నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం మన పత్రిక

NAMASTE TELANGANA

75 ఏండ్లుగా నిత్య పోరాటం

సవాళ్లున్నా సాంకేతిక సాయంతో ఇజ్రాయెల్ ముందడుగు › 8

ఎడారుల్లో వ్యవసాయం..

పౌరులందరికీ యుద్ధ నైపుణ్యంలో శిక్షణ



పోటీ పరీక్షలు, అకడమిక్‌కు సంబంధించిన మెటీరియల్ నేటి 'నిపుణ' ఈ పేపర్‌లో..

ఆదివారం SUNDAY 6.10.2024 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 12+4+32 పేజీల ఆదివారం అనుబంధం Pages: 12+4+32 Pages SUNDAY supplement | సంపుటి (Volume): 14 ‖ సంచిక (Issue): 122 ‖ వెల (Price) రూ.8.00 | తదియ

ఆదివారం, సూర్యోదయం: 6-07, సూర్యాస్తమయం: 6-01. శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయనం శరత్ రుతువు ఆశ్వయుజ మాసం శుక్ల పక్షం తిథి: తదియ ఉదయం 7-50 వరకు, తదుపరి చవితి. నక్షత్రం: విశాఖ రాత్రి 12-11 వరకు. వర్జ్యం: తెల్లవారుజామున 4-34 నుంచి మర్నాడు ఉదయం 6-19 వరకు. రాహుకాలం: సాయంత్రం 4-30 నుంచి సాయంత్రం 5-59 వరకు. దుర్ముహూర్తం: సాయంత్రం 4-24 నుంచి సాయంత్రం 5-12 వరకు. అమృతకాలం: పగలు 2-25 నుంచి సాయంత్రం 4-11 వరకు.

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline

ఏపీ దొంగ దెబ్బ

రహస్యంగా రాయలసీమ ఎత్తిపోతల పనులు



ఎన్జీటీ ఆదేశాలు బేఖాతర్

శ్రీశైలం రిజర్వాయర్ డెడ్‌స్టోరేజీలోనూ బ్యాక్‌వాటర్ తరలించేలా ప్రణాళిక

100 అడుగుల లోతు 150 అడుగుల వెడల్పుతో 18 కిలోమీటర్ల భారీ కాల్వకు ప్లాన్

ఏపీ వైపు ఐదు కిలోమీటర్ల తవ్వకం పూర్తి.. 3,825 కోట్ల ఖర్చుతో ఎత్తిపోతలు

- 111 టీఎంసీలు తరలించే ప్రతిపాదన
- పోతిరెడ్డిపాడుపై సిద్ధమైన మరో కాల్వ
- ఇకపై నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ ఎడారే
- నల్లగొండ, పాలమూరులో శాశ్వత కరువే
- 'రాయలసీమ'ను తీవ్రంగా వ్యతిరేకించి బీఆర్ఎస్ సర్కారు న్యాయపోరాటం
- ఏపీలో చంద్రబాబు రాకతో పెరిగిన వేగం
- రేవంత్ మౌనంతో తెలంగాణకు అన్యాయం

(నీంకార్ వెంకటేశ్వర్‌రావు)

మహబూబ్‌నగర్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కృష్ణానది నీటిని అక్రమంగా తరలించేందుకు ఏపీ స్కెచ్ వేసింది. కృష్ణానదిని చెరబట్టి 100 అడుగుల లోతు 150 అడుగుల వెడల్పుతో ఏకంగా 18 కిలోమీటర్ల భారీ కాల్వ నిర్మాణానికి ఆంధ్రప్రదేశ్ పథకం రచిస్తున్నది. శ్రీశైలం రిజర్వాయర్ డెడ్ స్టోరేజీ ఉన్నప్పటికీ బ్యాక్‌వాటర్‌ను పూర్తి స్థాయిలో తరలించుకుపోయేలా రూ.3,825 కోట్లు ఖర్చు చేసి రాయలసీమ ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టింది. ఇదే జరిగితే నాగార్జునసాగర్‌కు చుక్కనీరు కూడా వెళ్లే పరిస్థితి ఉండదు. తెలంగాణ ప్రయోజనాలను దెబ్బతీసే ఈ ఎత్తిపోతల పథకం పూర్తయితే మహబూబ్‌నగర్ జిల్లాకు తీవ్ర ముప్పుతో పాటు తెలంగాణకు కృష్ణా నది నీళ్లు ఇక గగనమే అని అనిపిస్తున్నది. నంద్యాల జిల్లా జూపాడు బంగ్లా మండలం పోతులమడుగు గ్రామ సమీపంలో నిర్మిస్తున్న రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని 'నమస్తే తెలంగాణ' బృందం పరిశీలించింది. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం సంగమేశ్వర ఆలయం సమీపం నుంచి రాయలసీమ ఎత్తిపోతల పథకానికి తవ్వుతున్న కాల్వ ప్రాంతాన్ని పరిశీలిస్తే విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. కృష్ణా నదిపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూ.3,825 కోట్ల వ్యయంతో › 7వ పేజీలో



పిట్టల రాజు



కాత్రేవుల సాంబమూర్తి

ముగ్గురు రైతుల విషాదాంతం

సరైన దిగుబడులు రాక ఆందోళన

అప్పులు తీర్చేమార్గం లేక ఆవేదన

పురుగుల మందు తాగి బలవన్మరణం

జనగామ, హనుమకొండ జిల్లాల్లో విషాదం

రుణమాఫీ కాక పాలమూరులో ఆగిన రైతు గుండె



చిల్పూరు/ఆత్మకూరు/నవాబ్‌పేట, అక్టోబర్ 5: పంట దిగుబడులు రాక.. చేసిన అప్పులు తీర్చే మార్గం లేక ఇద్దరు రైతులు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటనలు జనగామ, హనుమకొండ జిల్లాల్లో విషాదం నింపాయి. కాగా రుణమాఫీ కాలేదన్న దిగులుతో పాలమూరు జిల్లాలో మరో రైతు గుండె ఆగింది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా.. జనగామ జిల్లా చిల్పూరు మండలంలోని శ్రీపతిపల్లికి చెందిన రైతు పిట్టల రాజు(38) తనకున్న 1.3 ఎకరాల్లో వరి వేయగా మరో ఎకరన్నర భూమిని కౌలుకు తీసుకొని పత్తి సాగు చేశాడు. ఈ క్రమంలో తన వ్యవసాయ › 7వ పేజీలో



కందుకూరు రైతు ధర్నాలో మాట్లాడుతున్న కేటీఆర్. చిత్రంలో మాజీమంత్రులు సబితారెడ్డి, మహమూద్ అలీ, ఎమ్మెల్సీ వాణీదేవి, మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, క్యామ మల్లేశ్ తదితరులు

ఢిల్లీకి డబ్బుల మూటలకే మూసీ

మూసీ గబ్బంతా సీఎం, మంత్రుల నోట్లోనే

సుందరీకరణ పేరిట పక్కాగా లూటిఫికేషన్

రైతుల శక్తి ముందు సీఎం రేవంత్‌రెడ్డి ఎంత?

దేవుళ్లందరిపైనా ఒట్టేసి మోసం చేసిండు

రుణమాఫీ, రైతుభరోసా ఎగ్గొట్టిన ఘనుడు

మోదీనే ఎదిరించినం.. చిట్టినాయుడోలెక్కా?

కందుకూరు రైతు ధర్నాలో కేటీఆర్ నిప్పులు

> **సబితమ్మ, వారి ముగ్గురు కొడుకులకు ఫాంహౌస్‌లు ఉన్నయని రేవంత్ అబద్ధాలు చెప్తున్నడు. నిజంగా వారికి ఫాంహౌస్‌లుంటే కూల్చివేయించేందుకు మేమే సిద్ధంగ ఉన్నం. నీ కడుపు చల్లబడాలంటే పెద్దోళ్ల ఇండ్లను కూల్చండి.. అంతేగాని పేదల ఇండ్లపైకి బుల్డోజర్లు పంపద్దు.** - కేటీఆర్

హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ): 'కాంట్రాక్టర్ల నుంచి కమీషన్లు దొబ్బి ఢిల్లీకి మూటలు పంపేందుకే మూసీ ప్రాజెక్టును తెరపైకి తెచ్చిండ్రు.. ఇది బ్యూటిఫికేషన్ ప్రాజెక్టు కాదు..పక్కా లూటిఫికేషన్ ప్రాజెక్టు.. మూసీ గబ్బంతా ముఖ్యమంత్రి, కాంగ్రెస్ నేతల నోళ్లలోనే ఉన్నది' అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 'ప్రమాణస్వీకారం చేసిన వెంటనే డిసెంబర్ 9నే రుణమాఫీ చేస్తానని, ఆ ఫైల్‌పైనే మొదటి సంతకం చేస్తానని గొప్పలు చెప్పిన రేవంత్‌రెడ్డి, అధికారం చేపట్టి పదినెలలైనా నెరవేర్చకుండా మోసం › 2వ పేజీలో



ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని మార్కెట్ యార్డుకు ఆనుకుని ఉన్న స్థలంలో నిర్మిస్తున్న ఇంటిని అధికారులు కూల్చివేయడాన్ని నిరసిస్తూ గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ప్రధాన రోడ్డుపై రాస్తారోకో నిర్వహిస్తున్న స్థానికులు

రాజీవ్ గాంధీకి.. రేవంత్ ద్రోహం!

పట్టణ స్థానిక సంస్థల బలోపేతానికి రాజీవ్ తపన

అధికారాలు కాలరాసేందుకు రేవంత్ తహతహ › 2

జీహెచ్ఎంసీ అధికారాలు ఇక హైడ్రా చేతికి..

బదలాయిస్తూ గెజిట్ విడుదల

రాజీవ్ ఊపిరిపోస్తే.. రేవంత్ చావుదెబ్బ : కాంగ్రెస్ సీనియర్లు

ఇందూరులో నిద్రా

హైడ్రా తరహాలో ఏర్పాటు › 2

పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ వెల్లడి

బఫర్ జోన్‌కూ బుల్డోజర్!

'మూసీ' ప్రజలపై మరో పిడుగు

స్పష్టతనిచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి

ఎఫ్‌ఆర్‌ఎల్ నుంచి ఇరువైపులా 30 మీటర్ల వరకు బఫర్‌జోన్

కూలనున్న పలు అపార్ట్‌మెంట్లు, అప్రూవ్డ్ గేటెడ్ కమ్యూనిటీలు

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 5(నమస్తే తెలంగాణ): ఖుల్లం ఖుల్లా... మూసీ పరీవాహక ప్రాంత ప్రజల భవిష్యత్తు తేలిపోయింది. ఇప్పటిదాకా కేవలం రివర్ బెడ్ ఇండ్ల కూల్చివేతనే అంటూ కాస్తోకూస్తో ఊపిరి పీల్చుకుంటున్న పరీవాహక ప్రాంత ప్రజలపై సాక్షాత్తూ సీఎం రేవంత్‌రెడ్డి మరో పిడుగు వేశారు. రివర్ బెడ్, ఎఫ్‌ఆర్‌ఎల్.. కాదు ఏకంగా బఫర్‌జోన్ దాకా విస్తరణ చేపడతామని ప్రకటించారు. రెండు రోజుల వ్యవధిలో రెండు పర్యాయాలు దీనిపై స్పష్టత ఇచ్చారు. మూసీకి రెండు వైపులా బఫర్‌జోన్ దాకా ఉన్న నిర్మాణాలను తొలగిస్తామని అధికారికంగానే చెప్పారు. అంటే ఎంఆర్‌డీసీఎల్ (మూసీ రివర్‌ఫ్రంట్ › 2వ పేజీలో

బోనస్‌కు 'కొలతల' కొర్రీ!



- కొలత ప్రామాణికంగానే సన్నాలకు బోనస్
- ప్రత్యేక పరికరాలను తెప్పించిన సివిల్ సప్లై
- 10 వేల క్యాలిపర్స్ పరికరాల కొనుగోలు
- క్యాలిపర్స్‌తో గింజ పొడవు, వెడల్పు లెక్కింపు
- కొలతల ప్రకారం ఉంటేనే సన్నాలుగా లెక్క
- వాటికే 500 బోనస్.. తేడావస్తే సున్నా
- 33 రకాలు సన్నాలుగా ప్రభుత్వ ప్రకటన
- అలాంటప్పుడు మళ్లీ కొలతలెందుకన్న ప్రశ్న
- బోనస్‌ను బురిడీ కొట్టించేందుకేనా?

రైతన్నలూ.. సన్న వడ్లు పట్టుకొని పోయి సర్కారుకు అమ్మాలని చూస్తున్నరా? అమ్మితే రూ.500 బోనస్ వస్తదని తెగ ఆశపడుతున్నరా? సన్న వడ్లే తెచ్చారో, లేదో మీరు చెప్తేనో, చూసినోళ్లు చెప్తేనో, కండ్ల ముందు కనిపిస్తేనో సరిపోదండోయ్. సర్కారోళ్లే ఓ బియ్యపు గింజను తీసుకొని దాని పొడవెంత? వెడల్పెంత? అని కొలుస్తరు. వాళ్ల లెక్క సరిపోతేనే మీరు పండించింది సన్న వడ్లేనని సర్టిఫికెట్ ఇస్తరు. కొంచెం పొడవు ఎక్కువైనా, గింజ అడ్డంగా పెరిగినా బోనస్‌పై ఆశ వదులుకోవాల్సిందే!

హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ): సన్న ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామంటూ ప్రకటించిన ప్రభుత్వం.. లోలోపల మాత్రం కోతలు పెట్టేందుకు సిద్ధమవుతున్నది. బోనస్‌ను ఎగ్గొట్టేందుకు 'కొలత'ల పేరుతో కొర్రీలకు రంగం సిద్ధం చేసింది. కొనుగోలు కేంద్రానికి రైతులు తెచ్చిన ధాన్యం సన్నదా? దొడ్డుదా; తేల్చేందుకు పౌరసరఫరాల సంస్థ ప్రత్యేక పరికరాలను కొనుగోలు చేస్తున్నది. ఈ పరికరంతో ధాన్యం కొలతలు వేసి.. నిబంధనల ప్రకారం కొలతలు ఉంటే ఆ ధాన్యాన్ని సన్న ధాన్యంగా › 6వ పేజీలో

'మూసీ' ముసుగు దొంగ ఎవరు?

- రుణమాఫీ ఎగ్గొట్టి మూసీకి రాజకీయాలు
- హామీల అమలు చేతగాకే తిరుగుతున్నడు
- బతుకమ్మ పండుగపై ఎందుకింత నిర్లక్ష్యం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ): మూసీ ప్రాజెక్టు వెనుక దాక్కున్న ముసుగు దొంగ ఎవరు? అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వ అవినీతి, వైఫల్యాలపై శనివారం ఎక్స్ వేదికగా ఆయన తీవ్రస్థాయిలో ప్రశ్నల వర్షం కురిపించారు. మూసీ బ్యూటిఫికేషన్ పేరిట రూ.1.50 లక్షల కోట్లు లూటిఫికేషన్‌కు తెర తీసిన ఘనుడు ఎవరు? రైతు రుణమాఫీ ఎగ్గొట్టి, మూసీలో మురికి రాజకీయాలు చేస్తున్న ఆ దొంగ ఎవరు? రైతుబంధు ఎగ్గొట్టి, మూసీ పేదల ఉసురు పోసుకుంటున్న దుర్మార్గుడు ఎవరు? మహిళలకు వంద రోజుల్లోనే నెలకు రూ.2,500 చొప్పున ఇస్తా అని తప్పించుకు తిరుగుతున్న మోసగాడు ఎవరు? అవ్వ, తాతలకు నెలకు రూ.4,000 ఇస్తా అని చెప్పి ఎగ్గొట్టిన నయవంచకుడు ఎవరు? ఆడబిడ్డల పెండ్లిండ్లకు తులం బంగారం ఇస్తా అని మాటతప్పిన దగాకోరుడు ఎవరు? అని సీఎం రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ ప్రశ్నలు గుప్పించారు. తెలంగాణ అస్తిత్వ సంబురమైన బతుకమ్మ పండుగపై సర్కారుకు ఎందుకింత నిర్లక్ష్యమని కేటీఆర్ ప్రశ్నించారు. ఆడబిడ్డల వేడుకకు ఏర్పాట్లు చేయడానికి మనసు రావట్లేదా? పండుగపూట కూడా పల్లెలు పరిశుభ్రంగా ఉంచలేరా? అని సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. బతుకమ్మ గిట్టదు, పట్టదా? చెత్తా చెదారం మధ్య మురికి కంపులో అక్కా చెల్లెండ్లు బతుకమ్మ ఆడుకోవాల్నా? బ్లీచింగ్ పౌడర్ కొనడానికి, చెరువు కట్టమీద లైట్లు పెట్టడానికి పంచాయతీల్లో పైసల్లేని పరిస్థితులు దాపురించాయని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్ర పండుగను నిర్వహించుకునేందుకు నిధుల్లేని దౌర్భాగ్యం ఎందుకొచ్చింది? మహిళలకు బతుకమ్మ చీరలను రద్దుచేశారని, కనీసం బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా చేసుకోవాల్సిన అవసరం లేదని ప్రభుత్వం చెప్పదల్చుకున్నదా? అని కేటీఆర్ మండిపడ్డారు.



రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలోని కందుకూరులో జరిగిన రైతు ధర్నాలో ప్రసంగిస్తున్న కేటీఆర్. హాజరైన నియోజకవర్గం పరిధిలోని రైతులు

ఢిల్లీకి డబ్బుల మూటలకే మూసీ

> పింఛను రెండు వేలు పెంచి ఇస్తనని చెప్పి జనవరి, ఆగస్టు రెండు నెలలు ఎగ్గొట్టిండు. ఆరు గ్యారెంటీలను నూరు రోజుల్లో అమలు చేస్తనని చెప్పి 420 హామీలతో రేవంత్‌రెడ్డి మోసం చేసిండు. ఇప్పుడు ఆఖరి వంద రోజుల్లో అమలు చేస్తడేమో! -కేటీఆర్

మొదటిపేజీ తరువాయి...

చేస్తున్నడు..' అంటూ నిప్పులు చెరిగారు. ఎకరానికి రూ.15 వేల చొప్పున రైతు భరోసా ఇస్తానని, దొడ్డు వడ్లు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తానని బోగస్ మాటలు చెప్పిండని మండిపడ్డారు. రైతులు తలుచుకుంటే ఈ రేవంత్‌రెడ్డి ఉంటడా? అంటూ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 'ప్రధాని మోదీనే ఎదిరించిన మాకు ఈ చిట్టినాయుడు రేవంత్ ఓ లెక్కనా?' అని హెచ్చరించారు. శనివారం రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం కందుకూరులో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాకు హాజరైన రైతులనుద్దేశించి ప్రసంగించారు. 'మొన్నటి ఎన్నికల్లో ఓట్ల కోసం రుణమాఫీ చేస్తానని యాదాద్రి లక్ష్మీనర్సింహస్వామి, వరంగల్ భద్రకాళి అమ్మవారిపై ఒట్టేసి మాట తప్పి దేవుళ్లను కూడా మోసం చేసిన ఘనుడు మన చిట్టినాయుడు' అని దెప్పిపొడిచారు. అన్నవస్త్రం కోసం పోతే ఉన్న వస్త్రం పోయిన చందంగా రాష్ట్రంలో అన్ని వర్గాలను దగా చేస్తున్నడని విమర్శించారు. ఒకే ఇంట్లో ఇద్దరు ముసలోళ్లు, ఆడబిడ్డలకు కూడా నాలుగు వేల చొప్పున పింఛన్ ఇస్తానని చెప్పి నట్టేట ముంచాడని మండిపడ్డారు. రెండు వేలు అదనంగా ఇస్తానని జనవరి, ఆగస్టు రెండు నెలలు ఎగ్గొట్టాడని చెప్పారు.

రైతులను నాశనం చేసిన ఘనత కాంగ్రెస్‌దే

మాకు మూడు ఫాంహౌస్‌లు ఉన్నట్టు సీఎం రేవంత్‌రెడ్డి చెబుతున్నారు. అవి ఎక్కడ ఉన్నాయో ఆయనే చెప్పాలి. మాకు ఒక్కటే ఇల్లు ఉన్నది. అధికారం రాకముందు రైతులకు అరచేతిలో వైకుంఠం చూపి, ప్రభుత్వం వచ్చాక మోసం చేసిన ఘనత కాంగ్రెస్‌దే. కేసీఆర్‌కు నదుల గురించి తెలిస్తే.. రేవంత్‌కు ఫాంహౌస్‌ల నుంచి మురుగు నీటి పారుగంత తెలిసినట్టుంది. కూల్చడం కాదు.. దమ్ము ధైర్యం ఉంటే ఫార్మాసిటీని ఏర్పాటు చెయ్యి. మెట్రో సదుపాయాన్ని కల్పించాలి. మెడికల్ కాలేజీని నిర్మించాలి. రేపు మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ పార్టీనే.

- కార్తీక్ రెడ్డి, బీఆర్ఎస్ యువనేత

చెరువులోనే రేవంత్ ఇల్లు..

కొడంగల్‌లోని రేవంత్‌రెడ్డి ఇల్లేమో రెడ్డి చెరువులో, ఆయన అన్న తిరుపతిరెడ్డి ఇల్లు దుర్గం చెరువు శిఖం భూమిలో ఉన్నాయని కేటీఆర్ చెప్పారు. ప్రభుత్వం వాళ్ల అక్రమ నిర్మాణాలను వదిలిపెట్టి పేదలపై ప్రతాపం చూపుతున్నదని విమర్శించారు. ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా ముందుగా వారి ఇండ్లను కూలగొట్టిన తర్వాతే మూసీ ప్రక్షాళనపై ముందుకెళ్లాలని సూచించారు.

ఆరు గ్యారెంటీలను నూరు రోజుల్లో అమలు చేస్తానని చెప్పి 420 హామీలు ఇచ్చి మోసం చేసిండని దుయ్యబట్టారు. 'ఇప్పుడు ఆఖరి వంద రోజుల్లో అమలు చేసేలా ఉన్నట్టున్నడు..' అని ఎద్దేవా చేశారు. ఇందిరమ్మ పథకం తెచ్చి ఇండ్లు కట్టిస్తానని చెబితే నమ్మి అధికారం కట్టబెడితే, ఇప్పుడు కూలగొట్టుడే పనిగా పెట్టుకున్నాడని చురకలంటించారు.

లక్షన్నర కోట్లతో మూసీ ప్రక్షాళన ఎందుకు?

ఆడబిడ్డల పెండ్లిళ్లకు తులం బంగారం కోసం, ఆసరా పింఛన్ల పెంపునకు పైసల్లేవని చెప్తున్న ముఖ్యమంత్రి.. లక్షన్నర కోట్లతో మూసీ ప్రక్షాళన ఎందుకు చేపడుతున్నాడో చెప్పాలని కేటీఆర్ ప్రశ్నించారు. కాంట్రాక్టర్ల నుంచి కమీషన్లు దొబ్బి ఢిల్లీకి మూటలు పంపేందుకే ఈ ప్రాజెక్టును తెరపైకి తెచ్చాడని ఆరోపించారు. మూసీ ప్రాజెక్టుతో ఎన్నెకరాలకు నీళ్లిస్తావో చెప్పాలని నిలదీశారు. చెరువులు, కుంటలు కాపాడతానని నెపంతో హైడ్రాను తెచ్చి నగరజనాన్ని ఆగం చేస్తున్నాడని విమర్శించారు. హైడ్రాను అడ్డం పెట్టుకొని బీఆర్ఎస్ నేతలను బద్నాం చేస్తున్నాడని ధ్వజమెత్తారు. సబితమ్మతో పాటు, వారి ముగ్గురు కొడుకులకు ఫాంహౌస్‌లు ఉన్నాయని అబద్ధాలు చెబుతున్నాడని మండిపడ్డారు. నిజంగా వారికి మూడు ఫాంహౌస్‌లు ఉంటే తామే కూల్చివేయించేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. 'నిజంగా ఈ ముఖ్యమంత్రి కడుపు చల్లబడాలంటే మా లాంటి పెద్దోళ్ల ఇండ్లను కూల్చండి.. అంతేగాని పేదల ఇండ్ల పైకి బుల్డోజర్లు పంపవద్దు' అని సూచించారు.

> దేవుళ్లపై ఒట్టేసి రైతులను మోసం చేసిండు.. రైతులు తలుచుకుంటే ఈ రేవంత్‌రెడ్డి ఉంటడా? ఆయన కుర్చీ ఉంటదా? వారి సంఘటిత శక్తి ముందు ఈ ముఖ్యమంత్రి ఎంత? -కేటీఆర్

రియల్ ఎస్టేట్ కోసమే ఫోర్త్‌సిటీ..

కేసీఆర్ ప్రభుత్వం లక్షమంది తెలంగాణ బిడ్డలకు ఉపాధి కల్పించేందుకు తెచ్చిన ఫార్మాసిటీపై రేవంత్ సర్కారు రోజుకో నాటకమాడుతున్నదని కేటీఆర్ ఆరోపించారు. బహిరంగ సభల్లో రద్దు చేశామని చెప్తున్న ప్రభుత్వం కోర్టులోనేమో కొనసాగిస్తున్నామని బుకాయిస్తున్నదని విమర్శించారు. గత ప్రభుత్వం కేంద్రం సహకారంతో చేపట్టిన ట్రిపుల్ ఆర్‌పైనా దుష్ప్రచారం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓ మంత్రి, కాంట్రాక్టర్ల ప్రయోజనం కోసం, అస్మదీయుల భూములను కాపాడేందుకు అలైన్‌మెంట్‌ను మార్చేందుకు కుతంత్రాలు చేస్తున్నదని ఆరోపించారు. కేసీఆర్ పాలనలోనే రైతులకు న్యాయం జరిగిందని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి చెప్పారు. ఆయన చేపట్టిన రైతు సంక్షేమ పథకాలతో దేశమంతా తెలంగాణ వైపు చూసిందని పేర్కొన్నారు. రేవంత్ సర్కారు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి అన్నదాతను దగా చేస్తున్నదని మండిపడ్డారు. ధర్నాలో మాజీ డిప్యూటీ సీఎం మహమూద్ అలీ, ఎమ్మెల్సీలు నవీన్‌రెడ్డి, శంభీపూర్ రాజు, వాణీదేవి, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, రంగారెడ్డి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, పార్టీ యువనేత పటోళ్ల కార్తీక్‌రెడ్డి పాల్గొన్నారు.



ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలో మార్కెట్ యార్డుకు ఆనుకుని ఉన్న స్థలంలో నిర్మిస్తున్న ఇంటిని కూల్చిన అధికారులు

ఇంద్రవెల్లిలో రెండిండ్ల నేలమట్టం

- ప్రభుత్వ స్థలంలో కట్టుకున్నారంటూ అధికారుల కూల్చివేత
- పంచాయతీ ఎదుట బాధితులు, గిరిజనేతరుల నిరసన
- అధికారుల హామీతో ఆందోళన విరమణ

ఇంద్రవెల్లి, అక్టోబర్ 5: ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డుకు ఆనుకుని ఉన్న స్థలంలో నిర్మించిన ఇంటితోపాటు మండల కేంద్రంలో అనుమతి లేకుండా నిర్మిస్తున్న మరో ఇంటిని అధికారులు కూల్చివేశారు. ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా ఆదేశాల మేరకు శనివారం వేకువజామున రెవెన్యూ, ఇంద్రవెల్లి గ్రామ పంచాయతీ అధికారులు పోలీసు బందోబస్తు మధ్య జేసీబీ సాయంతో నేలమట్టం చేశారు. దీంతో ఇండ్లు కోల్పోయిన బాధితులతోపాటు మండలంలోని అన్ని రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, గిరిజనేతరులు ఇంద్రవెల్లి గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ముట్టడించారు. అనంతరం కార్యాలయం ఎదుట ప్రధాన రోడ్డుపై బైఠాయించి 2 గంటలపాటు రాస్తారోకో చేశారు. ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్‌గౌడ్‌తోపాటు ఉట్నూర్, ఇచ్చోడ సీఐలు మొగిలి, భీమేశ్, ఇంద్రవెల్లి ఎస్సై సునీల్, గుడిహత్నూర్ ఎస్సై ఇమ్రాన్ ఆందోళనకారులకు నచ్చజెప్పినా వినిపించుకోలేదు. ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్ వచ్చి నాయకులతోపాటు గిరిజనేతరులతో చర్చించి సమస్యను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఇంద్రవెల్లి పంచాయతీ అధికారులతోపాటు ఇతర మండలాలకు చెందిన వారు ఏజెన్సీలో ఇండ్ల నిర్మాణం చేయరాదని బెదిరించడంతోపాటు డబ్బు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఇంద్రవెల్లి పంచాయతీ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్పందించిన సబ్ కలెక్టర్.. అధికారులపై, ఇండ్లకు డబ్బు అడిగిన వారిపై ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామన్న హామీతో ఆందోళన విరమించారు.

లోకం పోకడ



ముందు ప్రక్షాళన చేయాల్సింది, మూసీ నీళ్లను కాదు, వీళ్ల నోళ్లను!

కేసీఆర్ 'ఇండ్లు' లేకుంటే బతుకు బస్టాండే!

- మూసీ బాధితులకు డబుల్ ఇండ్ల కేటాయింపు
- 147 మంది నిర్వాసితులకు ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం
- కేసీఆర్‌ను తలుచుకుంటున్న మూసీ నిర్వాసితులు



అబ్దుల్ సత్తార్ ఖురేషి

హైదరాబాద్ సిటీబ్యూరో/సైదాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ): 'కేసీఆర్ కట్టించిన డబుల్ బెడ్ రూం ఇండ్లే ఇప్పుడు అక్కరకొస్తున్నాయి. అవే లేకుంటే మా బతుకు బస్టాండే' అని మూసీ నిర్వాసితులు కేసీఆర్ మేలును తలుచుకుంటున్నారు. ఉన్న ఫలంగా ఇండ్లు ఖాళీ చేయించిన అధికారులు మమ్మల్ని ఎక్కడికి తరలిస్తుండ్రు అని తలుచుకుంటేనే భయమేసింది. సామగ్రినీ సరిగా తీసుకోకుండా బిక్కుబిక్కుమంటూ ఇక్కడికి వచ్చాం. కాంగ్రెస్ సర్కారు మోసం చేసిన ఈ తరుణంలో నాడు బీఆర్ఎస్ హయాంలో కట్టించిన ఇండ్లే దిక్కయినయ్.. అని పలువురు సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. కేసీఆర్ సార్ చల్లంగా ఉండాలి.. అని బాధిత కుటుంబాలన్నీ దీవిస్తున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నాడు పిల్లిగుడిసెల ప్రాంతంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇండ్లు నేడు మూసీ నిర్వాసితులకు వరంగా మారాయి. రూ.29.41 కోట్ల వ్యయం తో నిర్మించిన 288 ఇండ్లలో 2021 ఆగస్ట్ 28న అనాటి మంత్రి కేటీఆర్ 141 మంది లబ్ధిదారులకు ఇండ్లు కేటాయించగా, మిగిలిన 147 ఇండ్లను ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం శంకర్‌నగర్, మూసానగర్ నిర్వాసితులకు కేటాయించింది. 'సీఎం రేవంత్‌రెడ్డి ఇస్తామన్న డబుల్ బెడ్ రూం ఇండ్లు ఎవరు కట్టించిండ్రు? కేసీఆర్ కట్టించిన ఆ ఇండ్లే ఇప్పుడు మాకు దిక్కయ్యాయి కదా అని అబ్దుల్ సత్తార్ ఖురేషి తదితరులు ముక్తకంఠంతో చెప్తున్నారు.

రాజీవ్‌గాంధీకి రేవంత్ ద్రోహం!

- పట్టణ స్థానిక సంస్థల బలోపేతానికి రాజీవ్ తపన
- అధికారాలు కాలరాసేందుకు రేవంత్ తహతహ
- జీహెచ్ఎంసీ అధికారాలు హైడ్రాకు.. బదలాయిస్తూ రాష్ట్ర సర్కార్ గెజిట్ విడుదల
- రాజీవ్ ఊపిరిపోస్తే.. రేవంత్ చావుదెబ్బ కొట్టాడని విశ్లేషకులు, కాంగ్రెస్ సీనియర్ల మండిపాటు

హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ) : మైకు దొరికిన ప్రతిచోటా 'రాజీవ్ గాంధీ' జపం చేస్తుంటే.. సీఎం రేవంత్‌రెడ్డికి నిజంగానే ఆయనంటే ఎంత అభిమానమో! అని అంతా అనుకున్నారు. సచివాలయం ముందు తెలంగాణ తల్లి విగ్రహానికి బదులు రాజీవ్ విగ్రహాన్ని పెడితే కాంగ్రెస్‌కు, 'గాంధీ' కుటుంబానికి రేవంత్ వీరభక్తుడని, రాజీవ్‌గాంధీనే అనుసరిస్తాడని భావించారు. కానీ ఇదంతా రాజకీయ లబ్ధికోసం చేసిన బూటకమేనని తేలిపోయింది. తన మానస పుత్రిక 'హైడ్రా' కోసం జీహెచ్ఎంసీ అధికారాలను బదలాయిస్తూ ప్రభుత్వం గెజిట్ తీసుకురావడంతో నిజమైన కాంగ్రెస్‌వాదులకు ఇన్నాళ్లూ కమ్ముకున్న పొరలు తొలిగిపోయాయి. నాడు స్థానిక సంస్థల బలోపేతానికి రాజీవ్‌గాంధీ పునాదులు వేస్తే.. నేడు సీఎం రేవంత్‌రెడ్డి ఆ పునాదులను పెకలించేశారు. ప్రభుత్వ ఆస్తుల రక్షణ పేరుతో జీహెచ్ఎంసీకి, దాని కమిషనర్‌కు ఉన్న అధికారాలను ఇతర ఏజెన్సీ లేదా అధికారికి బదలాయించే అధికారాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి కట్టబెట్టారు. తద్వారా జీహెచ్ఎంసీ కోరలు పీకేసి, ప్రత్యామ్నాయ వ్యవస్థను తెచ్చారని రాజ్యాంగ నిపుణులు విమర్శిస్తున్నారు.

నాడు రాజీవ్ తపన..

స్థానిక సంస్థలైన గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లను బలోపేతం చేసేందుకు దివంగత ప్రధాని రాజీవ్ గాంధీ ఎంతో కృషి చేశారు. సింఘ్వీ కమిటీ లాంటి నిపుణుల బృందాలను నియమించి కార్యాచరణ రూపొందించారు. పట్టణ స్థానిక సంస్థల బలోపేతానికి ప్రణాళిక రూపొందించి, పూర్తిస్థాయిలో నియమ నిబంధనలతో బిల్లును తయారుచేశారు. 65వ రాజ్యాంగ సవరణ రూపంలో 1989లో లోక్‌సభలో బిల్లు పాస్ అయినా రాజ్యసభలో ఆగిపోయింది. రాజీవ్‌గాంధీ మరణానంతరం దివంగత ప్రధాని పీవీ హయాంలో 1993లో 74వ రాజ్యాంగ సవరణ బిల్లుగా ఆమోదం పొందింది. పట్టణ స్థానిక సంస్థల బలోపేతానికి గట్టి పునాది పడింది. ఈ రాజ్యాంగ సవరణ ప్రకారం పట్టణ స్థానిక సంస్థల రూపురేఖలు, పాలనా వ్యవహారాలు వంటివి నిర్ణయమయ్యాయి.

మూడు దశాబ్దాల స్వేచ్ఛకు మంగళం

నాటి కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన 74వ రాజ్యాంగ సవరణ స్ఫూర్తిని మూడు దశాబ్దాల తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని నేటి కాంగ్రెస్ ప్రభుత్వం తుంగలో తొక్కిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పట్టణ స్థానిక సంస్థలకు రాజీవ్ గాంధీ ఊపిరిపోస్తే తాజా గెజిట్‌తో సీఎం రేవంత్‌రెడ్డి చావుదెబ్బ కొట్టాడని రాజకీయ విశ్లేషకులు, కాంగ్రెస్ సీనియర్లు మండిపడుతున్నారు. పరిరక్షణ పేరుతో రోడ్లు, వీధులు, జలవనరులు తదితర ప్రభుత్వ ఆస్తులపై అజమాయిషీని ఏజెన్సీకి కట్టబెట్టారని, కేవలం తన రాజకీయ స్వార్థం కోసం పుట్టించిన 'హైడ్రా' కోసం జీహెచ్ఎంసీని బలి పెడతారా? అంటూ ప్రశ్నిస్తున్నారు.



నాగోలులో జరిగిన మీటింగ్‌లో నాగర్‌కర్నూలు ఎంపీ మల్లు రవి మాట్లాడుతుండగా ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

మూసీకి మద్దతు.. రేవంత్‌కు భజన!

- సమావేశం రైతులది.. హాజరైంది నాయకులు
- మూసీ బాధితుల ఊసే లేకుండా సమావేశం
- రేవంత్‌పై పొగడ్తలతో విసుగెత్తించిన నేతలు
- భూములు, ఇళ్లూ ఇవ్వాల్సిందేనని ప్రసంగాలు
- సమావేశానికి దూరంగా ఉన్న మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్ సిటీబ్యూరో/ మన్సూరాబాద్, అక్టోబర్ 5(నమస్తే తెలంగాణ): మూసీ ప్రక్షాళన చేద్దాం.. రైతాంగాన్ని ఆదుకుందాం.. అంటూ నాగోల్‌లోని శుభం కన్వెన్షన్ హాల్‌లో కాంగ్రెస్ నేతలు సమావేశం నిర్వహించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి తరలించిన కాంగ్రెస్ నేతలతో ఈ కార్యక్రమం రైతులు లేని నేతల కార్యక్రమంలా మారింది. నల్లగొండ జిల్లా కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు పాల్గొన్న ఈ కార్యక్రమాన్ని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అంతా తానై నిర్వహించగా, మూసీ ప్రక్షాళనకు సహకరించాలని చెప్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఈ కార్యక్రమానికి హాజరుకాకపోవడం కాంగ్రెస్ నేతల్లోనే చర్చకు దారితీసింది. మూసీ ప్రక్షాళనతో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు ఉపయోగంగా ఉంటుందన్న ఆలోచనను రైతుల్లో కల్పించే దిశగా కాంగ్రెస్ నేతలు చేసిన ప్రయత్నాలు అసలు రైతులే రాకపోవడంతో విఫలమయ్యాయి.

రైతుల పేరిట కాంగ్రెస్ నేతలు

మూసీ ప్రక్షాళనలో రైతులకు బదులు తమ కాంగ్రెస్ నేతలు కార్యకర్తలను, లోకల్ లీడర్లను తరలించారు. రైతులను తీసుకురావాలనుకున్నా.. వారెవరూ సహకరించకపోవడంతో కార్యక్రమం అభాసుపాలు కాకుండా పార్టీ కార్యకర్తలు, లీడర్లతోనే మమ అనిపించారు. కుర్చీల్లో అందరూ కాంగ్రెస్ నేతలే ఉండడంతో రేవంత్ భజనతో నేతల ప్రసంగాలు కొనసాగాయి. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వస్తారని భావించినప్పటికీ ఆయన ముఖం చాటేశారు. మూసీ ప్రక్షాళనకు అందరూ సహకరించాలని చెబుతున్న కోమటిరెడ్డి సొంత పార్టీ కార్యక్రమం అందునా సొంత జిల్లా నేతలు నిర్వహించిన కార్యక్రమానికి చివరి నిముషంలో హ్యాండిచ్చారు. ఉమ్మడి నల్గొండ జిల్లాకే పెద్ద దిక్కుగా భావించే కోమటిరెడ్డి కార్యక్రమానికి రాకపోవడంతో హాజరైన నేతలలో చర్చ జరిగింది. ఉమ్మడి నల్లగొండ కాంగ్రెస్‌లో గ్రూప్ వార్ కొనసాగుతుందని, రేవంత్ భజన చేసే బ్యాచ్‌తో తాను కలవాల్సిన అవసరం లేదని మంత్రి రాలేదని కోమటిరెడ్డి అనుచరులు కొందరు అక్కడికి వచ్చి వెంటనే బయటకు వెళ్లిపోయారు.

అధికారాలను బదలాయించేలా ఆర్డినెన్స్!

- హైడ్రా చట్టబద్ధత కోసం ప్రభుత్వం గెజిట్
- జీహెచ్ఎంసీ చట్టసవరణకు ఆమోదం

హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ): హైడ్రా చట్టబద్ధత కోసం ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకొచ్చింది. జీహెచ్ఎంసీకి, కమిషనర్‌కు ఉండే అధికారాలను ఏదేని ఏజెన్సీకి లేదా అథారిటీకి, అధికారికి బదలాయించేలా జీహెచ్ఎంసీ చట్టం-1955లో మార్పులు చేసింది. సెక్షన్ 374-ఏకు సవరణ చేస్తూ 374-బీ సెక్షన్‌ను జోడించింది. ప్రభుత్వ సవరణకు గవర్నర్ జిష్ణుదేవ్ శర్మ ఆమోదం తెలిపారు. దీంతో ఈ నెల 3 నుంచి ఆర్డినెన్స్ అమల్లోకి వస్తున్నట్టు ప్రభుత్వం గెజిట్ జారీ చేసింది. 'రోడ్లు, నాలాలు, జలవనరులు, ఖాళీ ప్రదేశాలు, పార్కులు, వీధులు తదితర కార్పొరేషన్/రాష్ట్ర ప్రభుత్వ ఆస్తులు ఆక్రమణలకు గురికాకుండా రక్షించడం, నిరంతరం పర్యవేక్షించడం' కోసం ఈ మార్పులు చేస్తున్నట్టు గెజిట్‌లో పేర్కొన్నది. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణతోపాటు విపత్తుల నిర్వహణ కోసం ఈ చర్యలు తీసుకుంటున్నట్టు వెల్లడించింది.

హైడ్రా తరహాలో నిజామాబాద్‌లో నిడ్రా

- పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ వెల్లడి

కంఠేశ్వర్, అక్టోబర్ 5: హైదరాబాద్‌లో హైడ్రా తరహాలో నిజామాబాద్‌లో కూడా నిడ్రా వస్తుందని పీసీసీ చీఫ్ బొమ్మ మహేశ్ కుమార్‌గౌడ్ తెలిపారు. శనివారం ఆయన నిజామాబాద్‌లో మీడియాతో చిట్‌చాట్‌లో మాట్లాడారు. నిజామాబాద్‌కు నిడ్రా రావాల్సిన అవసరం ఉన్నదని, కచ్చితంగా వస్తుందని చెప్పారు. ప్రభుత్వ భూములు, దేవాలయ, యూనివర్సిటీ స్థలాలను ఎవరు కబ్జా చేసినా వదిలే ప్రసక్తే లేదని అన్నారు. కబ్జాల విషయంలో పార్టీలకతీతంగా ఎంతటి వారైనా సరే చర్యలు తీసుకోవాలని కలెక్టర్, సీపీలకు ఆదేశాలిచ్చినట్టు తెలిపారు. జిల్లాలో మరో మెడికల్ కాలేజీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.



హైదరాబాద్‌లోని చాదర్‌ఘాట్ శంకర్‌బస్తీలో ఇంటిని కూలగొడుతున్న దృశ్యం



రేవంత్‌రెడ్డి పంపే బుల్డోజర్లు మా ఇండ్లదాకా రావద్దని మూసీకి వినతిపత్రం ఇస్తున్న సత్యానగర్ మహిళలు

బఫర్ జోన్‌కూ బుల్డోజర్!

మొదటిపేజీ తరువాయి...

డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్) అధికారులు రూపొందించిన మ్యాపులో బ్లూ కలర్ గీత నుంచి 30 మీటర్లు అంటే సుమారు వంద ఫీట్లు వరకు ఉండే నిర్మాణాలను కూడా కూల్చివేయనున్నారు. ఈ క్రమంలో 'నమస్తే తెలంగాణ' ముందుగా అంచనా వేసినట్టుగానే దాదాపు లక్షన్నర నిర్మాణాలకు ఎసరు పడే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇప్పటివరకు గుర్తించిన మూసీ మ్యాపింగ్ ప్రకారం రివర్ బెడ్(రెడ్ లైన్), ఫుల్ రివర్ లెవల్(బ్లూ లైన్) మాత్రమే ఉంది. కానీ ఎఫ్ఆర్ఎల్ హద్దుల నుంచి మరో 30 మీటర్ల దూరం ఉండే ప్రాంతాన్ని బఫర్ జోన్‌గా నిర్ధారించనున్నారు. దీంతో రెడ్, బ్లూ లైన్ల తరహాలో మరో గీత గీసి పేద, మధ్యతరగతి వర్గాల సొంతిళ్లను మూసీలో కలిపేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సన్నద్ధమైంది. దీనికి సీఎం రేవంత్‌రెడ్డి చేసిన తాజా వ్యాఖ్యలే సాక్ష్యంగా నిలుస్తుండగా, మూసీ ప్రాజెక్టు పేరిట లక్షలాది మంది పేద, మధ్యతరగతి వర్గాలు అన్ని అనుమతులతో నిర్మించుకున్న ఇండ్లు, అపార్టుమెంట్లు, భవనాలు కుప్పకూలిపోనున్నాయనేది స్పష్టమైంది. తొలుత కలుషిత వాతావరణం, దోమలు, చెత్తాచెదారంతో ఉండే మూసీ రివర్ బెడ్ నివాసితులను తొలగిస్తామని చెప్పిన ప్రభుత్వం.. దశల వారీగా మూసీ ఎఫ్ఆర్ఎల్‌కి వంద మీటర్ల దూరంలో అన్ని అనుమతులతో నిర్మించుకున్న భవనాలనూ కూల్చనుంది. రివర్‌బెడ్ నిర్మాణాలు, ఎఫ్ఆర్ఎల్ కట్టడాలతోపాటు బఫర్ జోన్ల వారీగా మూసీ వెంబడి మార్కింగ్ చేస్తే ఇప్పుడున్న లక్షన్నర నిర్మాణాల సంఖ్య తారుమారు కానుంది. మూసీకి ఇరువైపులా 30 మీటర్ల దూరాన్ని బఫర్ జోన్‌గా నిర్ధారించాల్సి ఉంటుంది. ఇదే జరిగితే మూసీలో మునిగే నిర్మాణాల సంఖ్య మరో 2 లక్షలకు పెరగనుంది. దీంతో మూడున్నర లక్షలకు పైగా నిర్మాణాలు మూసీలో కొట్టుకుపోనున్నాయి.

> మూసీ రివర్ బెడ్‌తో పాటు బఫర్ జోన్ నిర్మాణాలను కూడా తొలగిస్తాం. అక్కడ ఉండే పేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన నిర్మాణాలను కూల్చివేస్తాం. ఈ విషయంలో ఎలాంటి సందేహం లేదు. మూసీ పరీవాహక ప్రాంత జనాలను నిర్వాసితులుగా మార్చకుండా ప్రత్యామ్నాయ మార్గాలకు ప్రణాళికలు రూపొందిస్తాం. - 5న రవీంద్రభారతిలో జరిగిన వెంకటస్వామి జయంతి వేడుకల్లో సీఎం రేవంత్‌రెడ్డి

బరాబర్ బఫర్ జోన్ తొలగించుడే

ఎంఆర్‌డీసీఎల్ ప్రకటించిన మ్యాపింగ్ ఆధారంగా ఇప్పటివరకు బఫర్ జోన్ నిర్ధారణ కాలేదు. కానీ సీఎం రేవంత్ రెడ్డి మాటలు పేద, మధ్యతరగతి వర్గాలను భయాందోళనలకు గురిచేసేలా ఉన్నాయి. బరాబర్ బఫర్ జోన్ నిర్మాణాలను తొలగించాల్సిందేనని స్వయంగా ముఖ్యమంత్రి చెప్తుండటంతో బఫర్ జోన్ మరింత ఆందోళనకరంగా మారనుంది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న మ్యాపింగ్ ప్రకారం ఫుల్ రివర్ లెవల్ పరిధిలోనే వందలాది నిర్మాణాలు ప్రభావితం అవుతున్నాయి. అందులోనూ గేటెడ్ కమ్యూనిటీలు, అపార్టుమెంట్లతోపాటు, అన్ని అనుమతులతో నిర్మించుకున్న భవనాలు కూడా ఉన్నాయి. ఇక బఫర్ జోన్ పరిధిని కూడా నిర్ధారిస్తే మూసీ పరీవాహక ప్రాంతం మరింత పెరుగుతుందని, ఇప్పుడున్న దానికంటే రెండింతల వెడల్పుగా మారబోతుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రివర్ బెడ్ పరిధి వరకే కలుషిత వాతావరణం, దుర్గంధమైన పరిసరాలు ఉన్నాయి. కానీ బఫర్ జోన్ ప్రాంతాన్ని నిర్ధారిస్తే గనుక... దశాబ్దాల క్రితమే హుడా, జీహెచ్ఎంసీ లాంటి సంస్థల అనుమతులతో నిర్మించుకున్న కట్టడాలన్నీ కూలనున్నాయి. ఇప్పటికే ఎఫ్ఆర్ఎల్ పరిధిలో ఉండే ఆలయాలు, చర్చిలు, మసీదుల తొలగింపు అనివార్యంగా మారింది. ఇక బఫర్ జోన్ నిర్ధారణ జరిగితే ఇన్నాళ్లు చిన్న చిన్న గుడిసెలు, రేకుల షెడ్డులో ఉన్న పేదలతో పాటు, పదికాలాలు కుటుంబానికి నీడనిచ్చేలా నిర్మించుకున్న భవంతులూ కూలక తప్పదు.

> చెరువులు, కుంటల ఎఫ్టీఎల్, బఫర్ జోన్ల పరిధిలో ఉండే నిర్మాణాలను కూల్చేస్తాం. నాలాలు, కాలువలపై ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగిస్తాం. మూసీ రివర్ బెడ్‌తో పాటు బఫర్ జోన్ పరిధిలో ఉండే జనాలను అక్కడి నుంచి తరలించాల్సిందే. - 3న సికింద్రాబాద్ ఫ్యామిలీ డిజిటల్ కార్డు ప్రారంభ వేడుకల్లో సీఎం రేవంత్‌రెడ్డి

ఊసే లేని భూసేకరణ

బఫర్ జోన్ నిర్మాణాలను తొలగించాల్సిందేనని చెబుతూనే బఫర్ జోన్ పరిధిలో కూలిపోయే నిర్మాణాలకు ప్రత్యామ్నాయం చూపుతామని సీఎం రేవంత్‌రెడ్డి చెబుతున్నారే తప్ప భూసేకరణ విషయాన్ని ప్రస్తావించడం లేదు. పట్టా భూముల్లోని కట్టడాలు, నిర్మాణాలను ప్రభుత్వం కూలగొట్టాలంటే కచ్చితంగా వారి నుంచి భూములను సేకరించాల్సిందే. దీనికి 2013లో కాంగ్రెస్ తెచ్చిన భూసేకరణ చట్టంప్రకారమే సేకరించాల్సి ఉంటుంది. కానీ ఆ చట్టం ఊసే ఎత్తకుండా నేరుగా బఫర్ జోన్ మార్కింగ్‌తో పేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన నిర్మాణాలను కూల్చే కుట్రలకు రేవంత్ తెరలేపారు.

- తెలంగాణ భవన్‌లో బతుకమ్మ సంబురాలు



బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో తెలంగాణ భవన్‌లో శనివారం బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన మహిళలు భక్తిశ్రద్ధలతో పాటలు పాడుతూ ఉత్సాహంగా వేడుక జరుపుకొన్నారు. బతుకమ్మ పాటలతో తెలంగాణ భవన్ హోరెత్తింది. కార్యక్రమంలో ఎమ్మెల్సీ వాణీదేవి, మాజీ ఎమ్మెల్యేలు పద్మా దేవేందర్ రెడ్డి, గొంగిడి సునీతా మహేందర్ రెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ తుల ఉమ, బీఆర్‌ఎస్ నాయకురాళ్లు ముక్తవరం సుశీలారెడ్డి, మన్నే కవితా రెడ్డి, సామల హేమ, పావని గౌడ్, రమాదేవి, సుమిత్ర ఆనంద్, సరోజ తదితరులు పాల్గొన్నారు. -హైదరాబాద్



చేనేతలను ఆదుకోండి!

- బతుకమ్మ చీరల తయారీలేక ఉపాధి కోల్పోయిన కార్మికులు
- పని కల్పించి చేరదీయాలని ప్రభుత్వానికి డిమాండ్

హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో కొంతకాలంగా ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్న పవర్ లూమ్ కార్మికులను అన్నివిధాలుగా ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని నేతన్నలు డిమాండ్ చేస్తున్నారు. తమను ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు అవకాశాలు కల్పించాలని కోరుతున్నారు. నేతన్నల ఆత్మహత్యలు నివారించేలా నిర్ణయాలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. గత ఏడేండ్లుగా రాష్ట్రంలో బతుకమ్మ చీరల తయారీ అవకాశం కల్పించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం నేత కార్మికులను ఆదుకున్న విషయం తెలిసిందే. కానీ, కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చాక బతుకమ్మ చీరల పంపిణీ పథకాన్ని నిలిపివేసింది. దీంతో పవర్‌లూమ్‌పై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్న నేత కార్మికులకు ఆధారం లేకుండాపోయి రోడ్డునపడ్డారు. ఈ క్రమంలో ప్రభుత్వం తమకు పని కల్పించి ఆదుకోవాలని తెలంగాణ నేత కార్మిక సంఘం నాయకుడు కూరపాటి రమేశ్ డిమాండ్ చేస్తున్నారు. పరిస్థితులు ఇలాగే కొనసాగితే తమ డిమాండ్ల సాధనకు త్వరలోనే కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా తమ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరుతున్నారు.

4 | నమస్తే తెలంగాణ
హైదరాబాద్
ఆదివారం 6 అక్టోబర్ 2024
www.ntnews.com

వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

గతాన్ని పరిరక్షిస్తేనే.. భవిష్యత్తు!



Er. వేదకుమార్ మణికొండ
98480 44713

ఇటీవల మనం ఒక శుభవార్త విన్నాం. ప్రపంచ వారసత్వ ప్రదేశాల జాబితాలో చేర్చాలని కోరుతూ 10 జియోలాజికల్ సైట్ల పేర్లను ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాకు కేంద్ర ప్రభుత్వం పంపించింది. ప్రస్తుతం దేశంలో 100కు పైగా జియో- హెరిటేజ్ సైట్లు ఉన్నాయి. వాటిలో 34 మాత్రమే నేషనల్ జియోలాజికల్ మాన్యుమెంట్స్‌గా గుర్తింపు పొందాయి. భూమికి సంబంధించిన చరిత్రను తెలుసుకోవడంలో కీలకపాత్ర పోషించే వాటిని లేదా భౌగోళికంగా ఎర్త్ సైన్స్ పరంగా ప్రాధాన్యం ఉన్న స్థలాలను జియో- హెరిటేజ్ సైట్లుగా వ్యవహరిస్తుంటారు.

నేడు అంతర్జాతీయ జియో డైవర్సిటీ డే

సాధారణంగా ఆర్కియలాజికల్ సైట్లకు చట్టపరమైన భద్రత ఉంది. జియో- హెరిటేజ్ సైట్లకు మాత్రం అలాంటి భద్రత లేదు. ఈ నేపథ్యంలోనే జియోలాజికల్ హెరిటేజ్ రక్షణే ధ్యేయంగా జియో-హెరిటేజ్ సైట్స్ అండ్ జియో రెలిక్స్ బిల్లు 2022 రూపు దిద్దుకుంది. త్వరలోనే ఇది చట్టరూపం దాల్చే అవకాశం కూడా ఉంది. ప్రపంచవ్యాప్తంగా 1200 దాకా ప్రపంచ వారసత్వ ప్రదేశాలున్నాయి. ఇందులో 43 భారత్‌కు చెందినవి. వీటిలో జియోలాజికల్ సైట్ ఒక్కటి కూడా లేదు.

జియోలాజికల్ సైట్లకు ఉన్న ప్రాధాన్యం నేపథ్యంలో అక్టోబర్ 6న అంతర్జాతీయ జియో డైవర్సిటీ డేను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. జియోలాజికల్ సైట్లకు కూడా వివిధ రకాల గుర్తింపులు లభిస్తే వాటిని పరిరక్షించుకోవడం మరింత తేలికవుతుంది. దేశంలో వందకు పైగా అద్భుతమైన జియోలాజికల్ సైట్లు ఉన్నప్పటికీ, సమాజంలో మాత్రం వాటి పరిరక్షణ విషయంలో అంతగా అవగాహన ఉండటం లేదు. మహారాష్ట్రలోని లూనార్ క్రేటర్, మధ్యప్రదేశ్‌లోని భేడాఘాట్, ఆంధ్రప్రదేశ్‌లోని గండికోట లోయ, తెలంగాణలోని పాండవుల గుట్ట.. ఇలా మరెన్నో అద్భుతమైన జియోలాజికల్ సైట్లు మన దేశంలో ఉన్నాయి. వీటిలో అనేకం పర్యాటక కేంద్రాలుగా మారాయే తప్ప వాటి భౌగోళిక ప్రాధాన్యం మాత్రం అంతగా ప్రాచుర్యంలోకి రావడం లేదు. వాటి రక్షణ విషయాన్ని ఎవరూ పెద్దగా పట్టించుకోవడం లేదు. ఇలాంటి వాటికి యునెస్కో గ్లోబల్ జియో పార్క్ గుర్తింపు లభిస్తే అవి మరింతగా ప్రాచుర్యంలోకి వచ్చే అవకాశం ఉంటుంది.

జియో పార్కుల భావనకు రెండు దశాబ్దాలకు పైగా చరిత్ర ఉంది. గ్లోబల్ జియోపార్క్స్ నెట్‌వర్క్ (జీజీఎన్) 2024 అక్టోబర్ 6న అంతర్జాతీయ జియో డైవర్సిటీ డేను నిర్వహిస్తోంది. ఈ వేడుకను నిర్వహించుకోవడం అంతర్జాతీయ ప్రాధాన్యం ఉన్న జియోలాజికల్ హెరిటేజ్ సైట్లను కాపాడుకోవడం, భూమి చరిత్రకు గుర్తుగా వాటిని సంరక్షించుకోవడం తదితర అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ దినోత్సవం తోడ్పడుతుంది. ఈ సంవత్సరం గ్లోబల్ జియో పార్క్స్ నెట్‌వర్క్ తన 20వ వార్షికోత్సవాన్ని కూడా నిర్వహించుకోవడం ఓ విశేషం. 2021లో యునెస్కో అంతర్జాతీయ జియోడైవర్సిటీ డేను ప్రకటించింది. నాటి నుంచి ఏటా ఈ దినోత్సవాలు జరుగుతున్నాయి.

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 48 దేశాల్లో 213 యునెస్కో గ్లోబల్ జియోపార్కులు ఉన్నాయి. ఏటా కొత్తగా పది నుంచి ఇరవై దాకా విభిన్న స్థలాలను వాటికి జోడిస్తుంటారు. ఇదే విధమైన గుర్తింపును జాతీయ స్థాయిలో ప్రకటించడం కూడా ఈ స్థలాల పరిరక్షణకు, అవి ప్రాచుర్యంలోకి వచ్చేందుకు తోడ్పడుతుంది. ఇటీవలే తెలంగాణలో పాండవుల గుట్టకు ఈ విధమైన గుర్తింపు లభించింది. ఇలాంటి గుర్తింపు పొందిన ప్రాంతం తెలంగాణలో ఇదొక్కటే కావడం విశేషం. ఇప్పుడిప్పుడే జియో డైవర్సిటీ భావన ప్రజల్లోకి వెళ్తోంది. దక్కన్ హెరిటేజ్ అకాడమీ, పర్యావరణ, సాంస్కృతిక సంస్థలు, కొంతమంది వ్యక్తులు కొన్నేళ్లుగా ఈ అంశంపై విశేషమైన కృషి చేస్తున్నారు.



తెలంగాణ విషయానికి వస్తే ఇక్కడ భౌగోళిక ప్రాధాన్యం ఉన్న ప్రాంతాలు ఎన్నో ఉన్నాయి. పాండవుల గుట్ట హిమాలయాల కంటే ముందు నుంచీ ఉన్నదని చెప్పేందుకు ఆధారాలు లభ్యమవుతున్నాయి. అదే విధంగా కరీంనగర్, కొత్తగూడెం, ఆదిలాబాద్ తదితర ప్రాంతాల్లో రాక్షస బల్లుల శిలాజాలు, ప్రాచీన కాలపు తాబేళ్లు, ఇతర జంతువుల పాదముద్రలు కూడా బయటపడ్డాయి. ఇవన్నీ 160 నుంచి 200 మిలియన్ సంవత్సరాల కిందటివని అంచనా. హైదరాబాద్‌లోని మౌలాలీ పహాడ్‌కు కూడా అద్భుతమైన వారసత్వ ప్రాధాన్య చరిత్ర ఉంది. వీటిని గనుక మనం కోల్పోతే తిరిగి తెచ్చుకోలేం. యావత్ భూగోళ చరిత్ర వారసత్వం వాటికి ఉంది. అందుకే ఇలాంటి భౌగోళిక వైవిధ్య ప్రాంతాలను కాపాడుకునేందుకు ప్రజలే ముందుకు రావాలి. శిలా రాతి యుగం నుంచి లోహ యుగం దాకా ప్రాచీన చరిత్రను తమలో దాచుకున్న ప్రాంతాలెన్నో తెలంగాణలో ఉన్నాయి. పాండవుల గుట్ట, భువనగిరి, దేవరకొండ, ఉండ్రు కొండ, బొమ్మలమ్మ గుట్ట లాంటి ఎన్నో కొండలు, ప్రదేశాలు, ప్రాంతాలు దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురయ్యాయి. ఇప్పటికైనా ఈ ప్రాంతాల విశేషాలను భద్రపరిచేందుకు ప్రభుత్వం, ప్రజలు నడుం బిగించాల్సిన అవసరం ఉంది.

పాండవుల గుట్ట విషయానికి వస్తే.. తెలంగాణలోని జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఇది ఉంది. 1990 కన్నా ముందే దీని ప్రాధాన్యం వెలుగులోకి వచ్చింది. ప్రాచీన కాలపు పెయింటింగ్‌లు, గుహలు, ప్రాచీన ఆవాసాలకు సాక్ష్యాధారాలు ఇక్కడ ఉన్నాయి. ఈ పెయింటింగ్‌లలో ఎద్దు, పులి లాంటి జంతువుల బొమ్మలు, వృత్తాలు, చతురస్రాలు, రేఖాగణిత సంబంధిత చిత్రాలు, స్వస్తిక్ చిహ్నం, విల్లు, బాణాలు, కత్తి లాంటి చిత్రాలు ఉన్నాయి.

భూమి చరిత్రకు సంబంధించిన విశేషాలను జియో హెరిటేజ్ సైట్లు అందిస్తాయి. భూమి గతాన్ని ఇవి చాటిచెబుతాయి. సెయింట్ మేరీ ఐలాండ్‌లోని కాలమర్ బసాల్ట్ కావచ్చు, లేదంటే మహారాష్ట్రలోని లోనార్ క్రేటర్ కావచ్చు.. ఇవన్నీ కూడా అగ్నిపర్వతాల పేలుళ్లు, ఉల్కాపాతం, ప్రాచీన మానవ ఆవాసాలు.. ఇలా ఎన్నో విశేషాలకు సాక్ష్యాలు. అందుకే జియోలజిస్టులు, ఇతర పరిశోధకులను ఇవి అమితంగా ఆకట్టుకుంటున్నాయి. ప్రాచీన కాలపు శీతోష్ణస్థితులు, భూమి పొరలు, పర్వతాలు రూపుదిద్దుకున్న క్రమం ఇలా మరెన్నో విశేషాలను ఇవి అందిస్తాయి.

దేశంలో ఇప్పటి వరకు 34 ప్రదేశాలను నేషనల్ జియోలాజికల్ మాన్యుమెంట్లుగా గుర్తించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఓల్కనోజెనిక్ బెడెడ్ బైరేట్స్ (మంగంపేట), తిరుపతి ఎపర్చీన్ అన్ కన్ఫార్మిటీ (చిత్తూరు), తిరుమల సహజ శిలాతోరణం, ఎర్రమట్టి దిబ్బలు (విశాఖపట్నం) ఈ విధమైన గుర్తింపు పొందాయి. తెలంగాణలో పాండవుల గుట్టకు ఈ గుర్తింపు లభించింది. కేరళలో అంగాడిపురం లేటరైట్ (మల్లాపురం), వర్కాల క్లిఫ్ సెక్షన్ (వర్కాల), తమిళనాడులో నేషనల్ ఫాసిల్ ఉడ్ పార్క్ (పెరంబలూర్), సెయింట్ థామస్ చర్నోక్కైట్, కరాయ్ బద్లాండ్స్ ఫార్మేషన్ ఫాసిల్ పార్క్(పెరంబలూర్), గుజరాత్‌లోని ఎడ్డీ కరెంట్ మార్కింగ్ సెడిమెంటరీ స్ట్రక్చర్స్ (మహిసాగర్), రాజస్థాన్‌లోని సెంద్రా గ్రానైట్.. ఇలా పలు రాష్ట్రాల్లో మొత్తం 34 ప్రదేశాలు ఈ విధమైన గుర్తింపు పొందాయి.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో జియో హెరిటేజ్ సైట్లపై అవగాహన కల్పించేందుకు దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ లాంటి సంస్థలు ప్రయత్నిస్తున్నాయి. రెండు, మూడేళ్లుగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. జియో డైవర్సిటీ డే సందర్భంగా మౌలాలీ పహాడ్ వద్ద గతేడాది దక్కన్ హెరిటేజ్ అకాడమీ జియో హెరిటేజ్ వాక్, చర్చా కార్యక్రమాన్ని నిర్వహించింది. సంబంధిత రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 2022లో కూడా ఈ తరహా కార్యక్రమం తెలంగాణ అసెంబ్లీ ఎదురుగా ఉన్న నౌబత్ పహాడ్ వద్ద జరిగింది. ఈ ఏడాది అంతర్జాతీయ జియో డైవర్సిటీ దినోత్సవాన్ని పురస్కరించుకొని అక్టోబర్ 6న ఉదయం 9 గంటలకు హైటెక్ సిటీ సమీపంలోని ఫక్రుద్దీన్ గుట్ట (ఖాజాగూడ హిల్స్) వద్ద జియో హెరిటేజ్ వాక్‌ను దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ నిర్వహిస్తోంది. ఎఫ్‌బీహెచ్, సీడీఎస్, జేబీఆర్‌ఏసీ, టీఆర్‌సీ లాంటి పలు సంస్థలు ఈ కార్యక్రమానికి సహకరిస్తున్నాయి.

స్థానికంగా జియోలాజికల్ చరిత్ర గురించి తెలుసుకునేందుకు జియో హెరిటేజ్ డే వీలు కల్పిస్తుంది. స్థానిక సంస్కృతులు, జీవ వైవిధ్యం, పర్యావరణం, శీతోష్ణస్థితి మార్పులు లాంటి అంశాలు కూడా ఈ సందర్భంగా చర్చకు వస్తాయి. తమ ప్రాంత విశిష్టతలను కాపాడుకునేందుకు ప్రజలు ఏకతాటిపైకి వచ్చేందుకు ఈ దినోత్సవం వీలు కల్పిస్తుంది. పర్యాటకం పెరిగేందుకు తోడ్పడుతుంది. ప్రజలు తమ ప్రాంతంతో మరింతగా అనుబంధం పెంచుకునేందుకు తోడ్పడుతుంది. ఈ దినోత్సవాన్ని పురస్కరించుకొని వర్క్‌షాప్స్, సదస్సులు, క్షేత్ర పర్యటనలు, కళా ప్రదర్శనలు నిర్వహించాలి. దీని వల్ల స్థానిక విశేషాల పరిరక్షణకు స్థానికులు ముందుకు రాగలుగుతారు. మన దేశంలో జియో హెరిటేజ్ సంబంధిత అంశాలను జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా పర్యవేక్షిస్తోంది. పర్యావరణ, సాంస్కృతిక సంస్థలు కూడా ఈ దిశలో తమ వంతు సహకారాన్ని అందిస్తున్నాయి. యూనివర్సిటీలు సైతం ఈ విషయంలో కీలకపాత్ర పోషించే అవకాశం ఉంది. విద్యార్థులతో వివిధ ప్రాజెక్టులు చేపట్టాలి.

తెలంగాణ విషయానికి వస్తే ఇక్కడ భౌగోళిక ప్రాధాన్యం ఉన్న ప్రాంతాలు ఎన్నో ఉన్నాయి. పాండవుల గుట్ట హిమాలయాల కంటే ముందు నుంచీ ఉన్నదని చెప్పేందుకు ఆధారాలు లభ్యమవుతున్నాయి. అదే విధంగా కరీంనగర్, కొత్తగూడెం, ఆదిలాబాద్ తదితర ప్రాంతాల్లో రాక్షస బల్లుల శిలాజాలు, ప్రాచీన కాలపు తాబేళ్లు, ఇతర జంతువుల పాదముద్రలు కూడా బయటపడ్డాయి.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జిల్లా చరిత్రలు, స్థానిక చరిత్రలకు ఎంతో ప్రాధాన్యం ఏర్పడింది. ఎన్నో పుస్తకాలు వచ్చాయి. అదే తరహాలో జియో హెరిటేజ్ సైట్ల విషయంలోనూ ఉద్యమంలా కృషి జరగాల్సిన అవసరం ఉంది. తెలంగాణలో ప్రస్తుతం పాండవుల గుట్ట మాత్రమే అధికారిక గుర్తింపు పొందింది. అలాంటి గుర్తింపు మరెన్నో స్థలాలకు వచ్చే అవకాశం ఉంది. అందుకు వీలుగా సరైన రీతిలో డాక్యుమెంటేషన్, లిస్టింగ్ అండ్ నోటిఫికేషన్ జరగాలి. అందుకు రాష్ట్ర ప్రభుత్వం కూడా ఉదారంగా నిధులు మంజూరు చేయాలి. వివిధ ప్రభుత్వ విభాగాలను సమన్వయం చేస్తూ మరెన్నో ప్రాంతాలకు అధికారిక గుర్తింపు వచ్చేలా చేయాలి. ఇలాంటి గుర్తింపులు లభిస్తే తెలంగాణలో పర్యాటక రంగం కూడా వృద్ధి చెందే అవకాశం ఉంటుంది.

(వ్యాసకర్త: పర్యావరణవేత్త అండ్ అర్బన్, రీజనల్ ప్లానర్, హైదరాబాద్)

అజ్ఞానపు పాలనతో రాష్ట్రానికి అరిష్టం

మిడి మిడి జ్ఞానపు ప్రభుత్వాలు, పరిపక్వత లేని పాలకులు ప్రజలకెప్పుడూ అరిష్టమే. ఈ పది నెలల అజ్ఞానపు పాలనను 'ప్రభుత్వం' అని అనాలో, మార్పు కోరిన ప్రజల దీనావస్థలు తెలిసి కూడా కాంగ్రెస్ పెద్దలు, ఆ పార్టీ హై కమాండ్ స్పందించని వైనాన్ని 'మూర్ఖత్వం' అని అనాలో అర్థం కావడం లేదు.



గోసుల శ్రీనివాస్ యాదవ్
98498 16817



రాష్ట్రంలో ఇటీవల జరుగుతున్న వరుస పరిణామాలకు తోడు పాలనపై పట్టులేని ప్రభుత్వం ఫలితంగా అన్నివర్గాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఆత్మహత్యలు, హత్యలు పెచ్చరిల్లి అత్యాచారాల రోదనలు మిన్నంటుతున్నాయి. మొత్తంగా ఈ రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయన్నది సత్యం. ఈ సందర్భంలోనే పాలకులు దగ్గరుండి మరీ పేదల ఇండ్లు కూల్చివేస్తున్న తీరు దేశవ్యాప్తంగా చర్చకు దారితీస్తున్నది. హైదరాబాద్‌లో చెరువులు, నాలాల్లో ఆక్రమణలు పెరిగాయని ఇటీవల 'హైడ్రా' పేరుతో జరుగుతున్న బుల్డోజర్ కూల్చివేతల వల్ల పేదల హాహాకారాలు రోజురోజుకు మిన్నంటుతున్నాయి. పేదల ఆస్తులు, ఇండ్లు కూల్చేయాలని ముఖ్యమంత్రే స్వయంగా చెప్పడం, దానికి ఓ రాజకీయ పార్టీని మాత్రమే టార్గెట్ చేసి ఓ ఐపీఎస్ అధికారిని కమిషనర్‌గా నియమించడం విడ్డూరం. చెరువుల్లో, నాలాల్లో ఆక్రమణల కూల్చివేత కుతంత్రాలకు తెరలేపుతున్న తీరుకు చట్టబద్ధత కల్పించి మరీ బరి తెగించడం వారి అజ్ఞానానికి పరాకాష్ఠ అని చెప్పవచ్చు.

రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న విధాన నిర్ణయాల మేరకు పనిచేయాల్సిన ఐపీఎస్ అధికారి 'అంతా నా ఇష్టం' అన్నట్టు వ్యవహరిస్తున్నారు. రాష్ట్రంలో ఏ సమస్యలు లేనట్టు, అన్ని సమస్యలకు 'హైడ్రా'నే పరిష్కారం అన్నట్టు రేవంత్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుతో హైదరాబాద్ భవితవ్యం ప్రశ్నార్థకంగా మారుతున్నది. తాజాగా మూసీ సుందరీకరణ పేరిట కూల్చివేతలకు శ్రీకారం చుట్టిన తీరు, బాధితుల గోడు చూస్తుంటే సర్కార్ బుల్డోజర్ వైఖరి స్పష్టంగా తెలుస్తున్నది.

1908లో మూసీకి భారీ వరదలు వచ్చి హైదరాబాద్‌ను ముంచేసింది. నాటి పాలకులు రాచరికులైనా ప్రజల విశ్వాసాలను గౌరవించారు. మూసీ వరదల నుంచి తన ప్రజలను కాపాడాలని ఆరో నిజాం పూజలు కూడా చేశారు. హైదరాబాద్‌లో వరదల ఉధృతిని తగ్గించడానికి ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ నిర్మాణాలకు రూపకల్పన చేశారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి, ఆ తర్వాత కొన్నాళ్లకు ఏర్పడ్డ ఉమ్మడి రాష్ట్రాన్ని ఎక్కువ కాలం పాలించింది కాంగ్రెస్ పార్టీయే. ఆ పార్టీ ఆ తర్వాతి స్థానం టీడీపీది. కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాల హయాంలోనే సరస్సుల నగరం, ఉద్యాన నగరంగా విలసిల్లిన హైదరాబాద్ ఆక్రమణలకు గురైంది. ఇదంతా చరిత్ర. గత ప్రభుత్వం మూసీ ప్రక్షాళన కోసం ఒక ప్రణాళిక రూపొందించుకొని దానికనుగుణంగా మూసీలోకి వచ్చే 90 శాతం మురుగు నీటి శుద్ధికి ప్రాధాన్యం ఇచ్చింది. ఎస్టీపీల నిర్మాణం చేపట్టింది. శుద్ధి అయిన నీరే మూసీలో కలిసేలా చర్యలు ప్రారంభించింది. ఆ ఎస్టీపీల నిర్మాణం పూర్తయితే భవిష్యత్తులో మూసీలోకి వెళ్లేది శుద్ధి చేసిన నీరే తప్ప మురుగు నీరు కాదు. కానీ, కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు మూసీ సుందరీకరణ చేస్తామని, నది పరీవాహక ప్రాంతాన్ని అద్భుతంగా తీర్చిదిద్ది, అక్కడ షాపింగ్ కాంప్లెక్స్‌లను నిర్మిస్తామని హామీ ఇచ్చింది. ఇరువై నాలుగు గంటలు అక్కడ కార్యకలాపాలు జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పింది. అధికారంలోకి రాగానే మూసీ సుందరీకరణ కోసం మొదట రూ.50 వేల కోట్లు, ఆ తర్వాత రూ.1.50 లక్షల కోట్లు అవసరమవుతాయని సీఎం, మంత్రులు వివిధ సందర్భాల్లో చెప్పుకొచ్చారు. మూసీ సుందరీకరణ చేస్తే, హైడ్రా పేరిట ఆక్రమణలు కూల్చివేస్తే రాష్ట్రంలో ఇక ఏ సమస్యలు ఉండవని.. ఇదే ఇందిరమ్మ రాజ్యం లక్ష్యమన్నట్టు ఏలికలు మాట్లాడుతున్నారు.

ప్రజా ప్రభుత్వమని చెప్పుకొంటూ ప్రజల విజ్ఞప్తులను పట్టించుకోవడం లేదు. ప్రజల ఆవేదనలను పరిగణనలోకి తీసుకోవడం లేదు. అందుకే ఇవాళ మూసీ పరీవాహక ప్రాంతంలో సర్వేకు వెళ్లిన అధికారులపై ప్రజలు తిరుగుబాటు చేస్తున్నారు. ఇప్పటికే ముగ్గురు అమాయకులు తనువు చాలించారు. ఇప్పటి వరకు ఏ ముఖ్యమంత్రిని, ఏ ప్రభుత్వాన్ని శపించని విధంగా సామాజిక మాధ్యమాల్లో ప్రజలు శాపనార్థాలు పెడుతున్నారు.

నిజానికి మురికికూపంగా మారిన మూసీ ప్రక్షాళన కోసం కేసీఆర్ ప్రభుత్వం 'మూసీ నది పరీవాహక ప్రాంత అభివృద్ధి సంస్థ-ఎంఆర్డీసీ'ని ఏర్పాటు చేసింది. మూసీ నదిని ప్రక్షాళన చేయడం, పరీవాహక ప్రాంతాలను సుందరీకరించడం తదితర పనులు ఎంఆర్డీసీ లక్ష్యం. మురికికూపంగా మారిన నది ప్రక్షాళన, సుందరీకరణ కోసం రూ.16,635 కోట్ల అవసరమవుతాయని, అప్పట్లో ఎంఆర్డీసీ, మున్సిపల్ పట్టణాభివృద్ధి శాఖ అంచనా వేశాయి. రోడ్ల నిర్మాణానికి రూ.9,000 కోట్లు, 31 ప్రాంతాల్లో శుద్ధి కేంద్రాల ఏర్పాటుకు రూ.3,866 కోట్లు, సుందరీకరణ కోసం రూ.2,000 కోట్లు అవసరమవుతాయని అప్పట్లో లెక్కగట్టారు. దీనికితోడు మూసీపై 14 వంతెనలు నిర్మించేందుకు రూ.545 కోట్లతో ప్రణాళికలు రూపొందించినట్టు అప్పటి మంత్రి కేటీఆర్ ప్రకటించారు. కాగా, ఈ పనులన్నీ జరగాలంటే మొదటిదశలో మురుగునీటి శుద్ధి జరగాల్సి ఉన్నది.

హైదరాబాద్ సీవరేజీ బోర్డు పరిధిలో రోజు దాదాపు 2వేల మిలియన్ గ్యాలన్ల మురుగునీరు విడుదల అవుతున్నట్టు ప్రభుత్వ గణాంకాలు చెప్తున్నాయి. కాగా, ఇందులో 772 ఎంజీడీల నీరు శుద్ధి చేయడానికి 25 ఎస్టీపీలు నిర్మించారు. మరో 1,259 ఎంజీడీల నీరు శుద్ధి చేయడానికి కొత్తగా 31 ఎస్టీపీల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించారు. అంటే ఎక్కడా ఏ చిన్న కూల్చివేత, ఏ చిన్న ఇబ్బంది లేకుండా నగరవాసులను గత ప్రభుత్వం కాపాడుకున్నది. కానీ, హైదరాబాద్ ప్రజలు తమ వెంట లేరనో, లేక ఢిల్లీ పెద్దల వ్యాపారం కోసమో మూసీని పణంగా పెట్టి సుందరీకరణ పేరుతో పేట్రేగుతున్న మారణకాండ పైశాచిక పానలకు అద్దం పడుతున్నది. ప్రభుత్వానికి, ప్రధానంగా ముఖ్యమంత్రికి ఎంత ఆదరణ ఉన్నదో సామాజిక మాధ్యమాలను చూస్తే తెలుస్తున్నది.

హామీల అమల్లో వైఫల్యం, పథకాల లేమి, పాలనపై పట్టు లేకపోవడం వంటి కారణాలతో పాటు అజ్ఞానపు నిర్ణయాలతో అబాసుపాలవుతున్న తీరును కాంగ్రెస్ పార్టీ పెద్దలు అవలోకనం చేసుకోవాలి. ఇప్పటికైనా కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రం సురక్షితంగా ఉండాలంటే పాలనలో మార్పు రావాలి. కాబట్టి, అత్యవసరంగా ముఖ్యమంత్రి మారాలి. ఇందుకుగాను తెలంగాణలో ఉన్న కాంగ్రెస్ సీనియర్లు ఒక్కసారి తెలంగాణ స్థితిగతులను, భవితను అంచనా వేయాల్సిన అవసరం ఉన్నది. ఏ లక్ష్యం కోసం తెలంగాణ తెచ్చుకున్నమో ఆ లక్ష్య సాధన దిశగా మంచి పాలన అందించే ముఖ్యమంత్రినే కాంగ్రెస్ తిరిగి ఎన్నుకోవాల్సిన అవసరం ఉన్నది.

(వ్యాసకర్త: బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు)

భగవంతుడు ప్రత్యక్షమై ఏం వరం కావాలో కోరుకోమంటే.. 'స్వామి! రాత్రికి రాత్రే సోషల్ మీడియాలో సెలబ్రిటీగా మారిపోయే వరం ప్రసాదించండి' అని అడిగాడు భక్తుడు. 'దానికి దేవుని వరాలు పనిచేయవు నాయనా! తెలుగు భాషను ముక్కలు ముక్కలుగా తుంచగలవా? ఒంటి మీదున్న బట్టలను పీలికలుగా చించగలవా? పాట అర్థం కాకున్నా, సంగీతంతో పనిలేకున్నా డ్యాన్సులు దరువేసి దంచగలవా? ఎవరికీ అర్థంకాని భాషల్లో మాట్లాడగలవా? బూతుసాహిత్యం, బూమరాంగ్ డైలాగులు తడబడకుండా చెప్పగలవా? ప్రాణాల మీదికితెచ్చే సాహసాలు చేయగలవా? ఇవన్నీ అందుకు కావలసిన టాలెంట్. ఇక నీ అర్హత అంటావా! చదువు రాకున్నా చేతిలో స్మార్ట్ ఫోన్ ఉంటే సరిపోతుంది' అని సెలవిచ్చాడు భగవంతుడు!

స్మార్ట్‌ఫోన్‌తో పరేషాన్!



జోస్యుల వేణుగోపాల్
94404 36806



'ముందుగా నన్ను స్వామి అని పిలవడం మానేసి సామీ! అని పిలువు. ఇక్కడి నుంచే ప్రారంభించు' అంటూ మాయమయ్యాడు సదరు సామీ. అంతే, స్వామిని చూసిన సంతోషంలో ఆ మనిషిలోంచి మనిషి మాయమయ్యాడు. శరీరం ఏదో అద్వితీయ శక్తితో, సంతోషంతో మెలికలు తిరుగుతుంటే మనసు మొత్తం స్మార్ట్‌ఫోన్‌లో దూరి కమిట్‌మెంట్ లేని కంటెంట్ల కోసం సెర్చ్ చేస్తోంది. టెక్నాలజీ అందుబాటులోకి వచ్చిన మొదట్లో మనకు తెలియని విషయాలను గూగుల్ చెవిన వేసి సమాధానాలు రాబట్టుకొని తెలుసుకున్నాం. గూగుల్‌లో శోధన ఎక్కువయ్యాక కమర్షియల్ ఎలిమెంట్లతో విశృంఖలత్వం ఎక్కువైంది. ఈ క్రమంలో అందర్నీ తన కంట్రోల్‌లోకి తెచ్చుకుంది సోషల్ మీడియా.

యూట్యూబ్, వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఇతర యాప్‌ల వేదికగా రీల్స్ జనాదరణ పొందుతున్నాయి. వీటిని మెట్లుగా మలుచుకొని పైకి ఎదగాలనుకున్నవాళ్లు తమ టాలెంట్‌ను రకరకాల రీల్స్ రూపంలో ప్రదర్శిస్తూ పాపులర్ అయి డబ్బు, పేరు సంపాదించుకుంటున్నారు. డబ్బు సంపాదన కంటే తమ రీల్స్‌కు మిలియన్ల లైకులు, షేర్స్, సబ్‌స్క్రైబర్లు పెరిగి రాత్రికి రాత్రే సెలబ్రిటీలుగా మారిపోవాలన్నదే చాలామంది యావ. ఈ దుగ్ధతో మహిళలు కూడా సభ్య సమాజం తలదించుకునే వేషభాషలతో అసభ్యకర వీడియోలు చేస్తున్నారు. చేసేవాళ్లు వారి స్వలాభం కోసం రీల్స్ చేస్తుంటే, చూసేవాళ్లు మాత్రం నిద్రాహారాలు మానేసి, విలువైన సమయాన్ని వృథా చేస్తూ 'రీలో రీలో రేలారే' అంటున్నారు.

ఈ రీల్స్ కారణంగా భారతీయత ఉనికి కోల్పోతున్నది. సంప్రదాయం మంటగలిసిపోయి, నాగరికత రూపు మార్చుకొని రచ్చకెక్కుతోంది. లైకుల కోసం చాలామంది రోడ్లపై, నీళ్లలో, రైళ్లలో సాహసాలు చేస్తున్నారు. ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు. తమ పిల్లల టాలెంట్‌ను ప్రోత్సహించాలని తల్లిదండ్రులు కూడా చూసీచూడనట్టుగా వదిలేస్తుండటంతో గుర్తింపు పొందాలనే తాపత్రయంలో కొంతమంది ప్రాణాలు కోల్పోతున్నారు. మధ్యప్రదేశ్‌లో ఒక బాలుడు ఉరి వేసుకుంటున్నట్టుగా రీల్ చేయబోయి నిజంగా ఉరి పడి ప్రాణాలొదిలిన ఘటనే అందుకు నిదర్శనం. లక్నోలో వాటర్ ట్యాంక్‌లో రీల్ చేస్తూ ఓ యువకుడు మృత్యువాతపడ్డాడు. బిల్డింగ్‌పై నుంచి దూకడం, బైక్‌లపై ఫీట్లు, చెట్ల కొమ్మల చివరన నిలబడటం, పాము నోట్లో చెయ్యి పెట్టడం లాంటి సాహసాలు రీల్స్ రూపాన్ని సంతరించుకుంటున్నాయి. ఈ రీల్స్ మోజులో పడి ప్రమాదంలో చిక్కుకున్నవారిని కాపాడే బాధ్యతను మానవ సమాజం విస్మరిస్తుండటం బాధాకరం. బాధితుల ఆర్తనాదాలను పట్టించుకోకుండా రీల్స్ చేస్తూ పోస్టు చేస్తుండటం మానవత్వానికి మాయని మచ్చ. ఎదుటివాళ్ల కష్టాలు, నష్టాల నుంచి కూడా ప్రయోజనం పొందాలనుకోవడం దారుణం. సరదాగాకో, ఆటవిడుపు కోసమో రీల్స్ చేయడం తప్పు కాదు. కానీ, అదే వ్యసనంగా మారి జీవితాలను బలి తీసుకునేంత వరకు వెళ్లడం సరికాదు.

రీల్స్ చేసేవారే కాదు, చూసేవారు పరోక్షంగా ఇబ్బందుల పాలవుతున్నారు. నిత్యం రీల్స్ చూస్తూ కాలక్షేపం చేసేవారు మానసిక రుగ్మతలకు గురవుతున్నారు. దేశంలోని సగం జనాభా రోజూ రెండు గంటలకు పైగా సోషల్ మీడియాలో గడుపుతున్నట్టు ఒక అధ్యయనంలో తేలింది. అంతేకాదు, సోషల్ మీడియాలో వ్యక్తిత్వ హననం జరుగుతుండటం శోచనీయం. ప్రత్యర్థి రాజకీయ పార్టీలు, నాయకులు, సెలబ్రిటీలు సోషల్ మీడియా ట్రోలింగ్‌కు బాధితులుగా మారుతున్నారు. వారి వ్యక్తిత్వాన్ని కించపరుస్తూ బతుకుపై విరక్తి కలిగి ఆత్మహత్యల వరకు వెళ్లేలా చేయడం క్షమించరాని నేరం.

కత్తికి రెండువైపులా పదునున్నట్టు.. సోషల్ మీడియా వల్ల లాభనష్టాలు ఉన్నాయి. డిజిటల్ ప్లాట్‌ఫామ్ ఆధారంగా తమ కలలను సాకారం చేసుకొని ఎదిగినవారెందరో ఉన్నారు. అదే సమయంలో వ్యసనంగా మారి ప్రాణాల మీదికి తెచ్చుకున్నవారు కూడా ఉన్నారు. ఈ నేపథ్యంలో సోషల్ మీడియాను సరైన రీతిలో ఉపయోగించుకొని ఎదగాలో, చెడుమార్గంలో వినియోగించి కేసుల పాలై జీవితాన్ని అంధకారం చేసుకోవాలో తేల్చుకోవాల్సింది మనమే.



ఇల్లీగల్ ఎన్క్రోచ్‌మెంట్

Illegal Encroachment
ఎంత మాటన్నవ్ సారూ...
ఇల్లు ఇల్లీగల్ ఎట్లైతది?
అది అమ్మ కడుపంత పవిత్రమైంది.
తాళి గట్టి పెండ్లి జేసుకున్నట్లే
రిజిస్ట్రేషన్ జేసినంక పని మొదలువెడ్తిమి
గవుర్మెంటే పెండ్లి పెద్ద
అధికారులే పురోహితులు
అది అక్రమమైతే
ఆ రోజే పంచాతి వెట్టి
పంచలూడగొడ్తుంటిరి గదా...

అమ్మ నవమాసాలు మోస్తది
ఇల్లు తరతరాలను మోస్తది
అమ్మతో సహా

చెమటబొట్లను పైసలుజేసుకున్న
కష్టార్జితం ఇల్లు
అప్పులు, మిత్తులనే
ప్రసవవేదనను
పంటి కింద భరించిన
పేగు

రెండర్రల చిన్నిల్లు అయినా
ఆశల పల్లకిలో ఊరేగించే
ఇంద్రభవనం అది

దేవుణ్ణి నెత్తిమీద వెట్టుకోని
కుడికాలు మోపిన
పవిత్ర దేవాలయం

అమ్మ ఇష్టానికి చిరునామా
నాయన కష్టానికి పరాకాష్ట

పచ్చుల గూడు ముట్టుకుంటే
పాప మనుకునే మనిషికి
ఇండ్లు కూలగొట్టనీకె
చేతులెట్లొస్తయి సారూ

మొహబ్బత్ కీ షాన్ హైదరాబాద్
ఆబాదీ కా ఖజానా హైదరాబాద్
బర్బాదీ కి మారుపేరైపోతున్నది గదయ్యా

మనిషి గుళ్లను గూలగొడితే
చేతులకు జెట్టలు మొలుస్త యంటరు...
మరి ఓట్లెట్ల పడ్తయి సారూ
ఇంకొక్కసారి...
ఇల్లీగల్ ఎన్రోక్చ్‌మెంట్ అనకుండ్రి
మీకు దండంబెడ్త!!!



శశికళ
ఠాకూర్

చంద్రఘంట దేవీగా అమ్మవారు



దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీశైలం భ్రమరాంబికాదేవి చంద్రఘంట అవతారంలో శనివారం భక్తులకు దర్శనమిచ్చారు. - అలంపూర్

శ్రీరాజరాజేశ్వరి దేవీగా..



హైదరాబాద్‌లోని బల్కంపేట ఎల్లమ్మ అమ్మ వారు శనివారం శ్రీ రాజరాజేశ్వరి దేవీగా దర్శనమిచ్చారు. ప్రత్యేక అలంకరణలో ఎల్లమ్మను చూసి భక్తులు పరవశించారు.

శ్రీవారి బ్రహ్మోత్సవ శోభ



తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం రెండో రోజు రాత్రి 7 గంటలకు హంస వాహనంపై నుంచి భక్తులకు దర్శనమిస్తున్న మలయప్పస్వామి

ఆన్‌లైన్ బెట్టింగ్‌కు కుటుంబం బలి

- రూ.30 లక్షలకుపైగా కుమారుడి అప్పులు
- 20 గుంటల భూమి అమ్మి అప్పుల చెల్లింపు
- ఊర్లో తిరగలేక మస్తాపంతో బలవన్మరణం
- కుమారుడితోపాటు తల్లిదండ్రుల ఆత్మహత్య
- నిజామాబాద్ జిల్లా వడ్డేపల్లిలో విషాదం

ఎడపల్లి, అక్టోబర్ 5: ఆన్‌లైన్ బెట్టింగ్‌కు మరో కుటుంబం బలైంది. రూ.లక్షలు పోగొట్టిన ఓ యువకుడితోపాటు అతడి తల్లిదండ్రులు ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన శనివారం నిజామాబాద్ జిల్లాలో చోటుచేసుకుంది. ఎడపల్లి మండలం వడ్డేపల్లి గ్రామానికి చెందిన రంగ ఐవేణి సురేశ్ (55), హేమలత (48) దంపతులకు ఇద్దరు సంతానం. మెదడువాపు వ్యాధితో కూతురు చిన్నప్పుడే మృతి చెందింది. ఏకైక కుమారుడు హరీశ్ (22) నిజామాబాద్‌లో ఉంటూ పెట్రోల్ బంక్‌లో పని చేసేవాడు. ఆర్నెళ్ల క్రితం పని మానేసి ఇంటి వద్దే ఉంటున్నాడు. సురేశ్ దంపతులు చిన్న కిరాణ షాపు నడుపుతూ వ్యవసాయ కూలీలుగా పని చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. కొత్త ఇల్లు కట్టుకుందామన్న ఆశతో గృహ నిర్మాణాన్ని ప్రారంభించారు. కుమారుడు హరీశ్ ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటు పడి భారీగా అప్పులు చేశాడు.



హరీశ్ (ఫైల్)



సురేశ్



హేమలత

దీంతో తల్లిదండ్రులు ఇంటి నిర్మాణాన్ని ఆపేశారు. హరీశ్ చేసిన రూ.30 లక్షలకుపైగా అప్పులను తమకున్న 20 గుంటల భూమిని అమ్మేసి తీర్చారు. అయినప్పటికీ కుమారుడిలో మార్పు రాలేదు. నలుగురిలో తిరగలేక మనస్తాపం చెందిన తల్లిదండ్రులు, కుమారుడు శుక్రవారం రాత్రి ఉరేసుకున్నారు. తెల్లారినా ఎలాంటి అలికిడి లేకపోవడంతో ఇరుగుపొరుగు వారు తలుపులు కొట్టినా లోపల నుంచి స్పందన రాలేదు. ఇంటి వెనుక నుంచి చూడగా వేలాడుతూ కనిపించారు. సమాచారమందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం బోధన్ దవాఖానకు తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బోనస్‌కు 'కొలతల' కొర్రీ!

▸ మొదటిపేజీ తరువాయి...

పరిగణించనున్నారు. ఆ ధాన్యానికి మాత్రమే రూ.500 బోనస్ ఇవ్వనున్నది. కొలతలో ఏ మాత్రం తేడా వచ్చినా రైతులు తీసుకొచ్చిన ధాన్యం సన్నధాన్యంగా గుర్తించరు. ఆ రైతులకు బోనసూ ఇవ్వరు.



గింజల కొలతకు 'కాలిపర్స్'

చిన్న చిన్న వస్తువుల పొడవు, వెడల్పు కొలతలు లెక్కించేందుకు వినియోగించే 'కాలిపర్స్' పరికరాన్ని సన్నధాన్యాన్ని గుర్తించేందుకు వినియోగించనున్నారు. ఇందుకు సంబంధించి పౌరసరఫరాల సంస్థ ఇప్పటికే భారీ సంఖ్యలో కాలిపర్స్ కొనుగోలుకు నిర్ణయించింది. ప్రతి కొనుగోలు కేంద్రానికి కనీసం రెండు చొప్పున కాలిపర్స్ ఇవ్వాలని నిర్ణయించింది. ఈ సీజన్‌లో ధాన్యం కొనుగోలుకు 7 వేలకు పైగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నది. ఈ లెక్కన కనీసంగా 14 వేల కాలిపర్స్ పరికరాలు అవసరం కానున్నాయి. ఇందులో భాగంగానే ప్రస్తుతానికి 10 వేల కాలిపర్స్ సరఫరా చేయాలని మార్కెటింగ్ శాఖను కోరినట్టుగా తెలిసింది. ముందుగా ధాన్యం వచ్చే పలు జిల్లాలకు కాలిపర్స్‌ను అందించినట్టు తెలిసింది.

ఈ కొలతలుంటేనే సన్నాలు

రైతులు తీసుకొచ్చే ధాన్యంలో సన్నాలేవి? దొడ్డు రకం ఏవి? అనే అంశాన్ని తేల్చేందుకు అధికారులు కొన్ని కొలతలను నిర్ణయించారు. ఇప్పటికే ఆర్డర్ చేసిన కాలిపర్స్‌తో ఈ కొలతను లెక్కిస్తారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని కాలిపర్స్‌లో పెట్టి ఆ గింజ పొడవు, వెడల్పును లెక్కిస్తారు. ఇందుకోసం రైతు తీసుకొచ్చిన ధాన్యంలో 10 గింజలను సేకరిస్తారు. ఆ ధాన్యాన్ని ఒక ప్రత్యేకమైన పరికరంలో వేసి వాటిపై పొట్టుపోయేలా చేస్తారు. ఆ తర్వాత వచ్చినటువంటి బియ్యపు గింజను కాలిపర్స్ ద్వారా కొలతేస్తారు. ఈ కొలతలో బియ్యపు గింజ పొడవు 6 మిల్లీమీటర్ కన్నా తక్కువగా ఉండాలి. వెడల్పు 2 మిల్లీమీటర్‌కు మించొద్దు. బియ్యపు గింజ పొడవు, వెడల్పు రేషియో 2.5 మిల్లీమీటర్ కన్నా ఎక్కువగా ఉండాలి. కాలిపర్స్‌లో పెట్టిన బియ్యపు గింజ ఈ కొలతలకు సరిపోతేనే దాన్ని సన్నధాన్యంగా పరిగణిస్తారు. లేనిపక్షంలో ఆ ధాన్యాన్ని దొడ్డు రకం ధాన్యంగా పరిగణిస్తారు. ఈ కొలతల నిబంధన ప్రకారం ఉన్నటువంటి ధాన్యానికే రూ.500 బోనస్ ఇవ్వనున్నారు.

సన్న రకాలు ప్రకటించి.. మళ్లీ ఈ కొలతలేందుకు?

సన్నధాన్యానికి మాత్రమే క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే మార్కెట్లో చాలా రకాల సన్నాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఏ సన్న రకాలకు బోనస్ వర్తిస్తుందో వ్యవసాయశాఖ స్పష్టతనిచ్చింది. ఇందులో భాగంగానే 33 రకాల సన్నాలను గుర్తిస్తూ జూలైలో జాబితాను విడుదల చేసింది. 33 రకాలతో పాటు బీపీటీ 5204, ఆర్‌ఎన్‌ఆర్ 15047, హెచ్‌ఎంటీ సోనా, జైశ్రీరాం రకాలను కూడా సన్నాలుగా పరిగణించాలని సూచించింది. బోనస్ వర్తించే సన్నాల జాబితాను ప్రకటించిన ప్రభుత్వమే.. మళ్లీ ఇప్పుడు ఈ కొలతల తతంగం పెట్టడం ఏమిటి? అని రైతులు ప్రశ్నిస్తున్నారు. సన్నరకాల్లోనే గింజల పొడవు, వెడల్పులో తేడా ఉంటుందని, అలాంటప్పుడు వాటిని సన్నాలుగా గుర్తించకపోవటం ఏమిటి? అని నిలదీస్తున్నారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యం రకం వ్యవసాయశాఖ విడుదల చేసిన సన్నాల జాబితాలో ఉన్నా.. కాలిపర్స్ కొలతలో తేడా వస్తే పరిస్థితి ఏమిటి? అన్నది ప్రశ్నగా మారింది.

బోనస్‌ను ఎగ్గొట్టేందుకే 'కొలత'ల కొర్రీనా?

సన్న ధాన్యాన్ని గుర్తించేందుకు సివిల్ సప్లై కాలిపర్స్‌తో కొలతలు వేయాలనే నిర్ణయంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రైతులకు ఇచ్చిన బోనస్ హామీని ఎగ్గొట్టేందుకే ఈ కుట్రలకు తెరతీసిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ సీజన్‌లో సుమారు 91 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంటుందని ప్రభుత్వం అంచనా వేస్తున్నది. ఇందులో 44 లక్షల టన్నుల దొడ్డు రకాలు కాగా, 47 లక్షల టన్నులు సన్న ధాన్యం ఉంటుందని ఇటీవలి సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ లెక్కన 47 లక్షల టన్నుల సన్న ధాన్యం కొనుగోలు చేస్తే క్వింటాలుకు రూ.500 చొప్పున టన్నుకు రూ.5 వేల చొప్పున మొత్తం రూ.2,350 కోట్లు అవసరం అవుతాయి. ఇవి మద్దతు ధరకు అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ప్రభుత్వం ఉన్న ఆర్థిక ఇబ్బందుల్లో ఇంత భారీ మొత్తం భారం భరించడం కష్టమేననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అందుకే కొలతల కొర్రీ పెడుతున్నదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎంత వీలైతే అంత కోతలు కోసి బోనస్ భారాన్ని రూ.500 కోట్లకు మించనివ్వొద్దని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిసింది.

మొదటి దశలో ఆర్డర్ చేసిన కాలిపర్స్ జిల్లాలవారీగా..

జిల్లా	కాలిపర్స్ సంఖ్య
మహబూబ్‌నగర్	190
పెద్దపల్లి	350
నిజామాబాద్	500
నిర్మల్	250
సంగారెడ్డి	100
కామారెడ్డి	400
నారాయణపేట	100

విద్యుత్తు చార్జీల పెంపుపై 21 నుంచి విచారణ

రూ.1200 కోట్ల భారం మోపేందుకు డిస్కంల ప్రతిపాదన



హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ): వినియోగదారులపై రూ.1200 కోట్ల మేరకు విద్యుత్తు చార్జీల పెంపునకు అనుమతించాలని కోరుతూ డిస్కంలు విద్యుత్తు రెగ్యులేటరీ కమిషన్ (ఈఆర్సీ)కి చేసిన ప్రతిపాదనలపై ఈ నెల 21 నుంచి 25 వరకు బహిరంగ విచారణ జరుగనున్నది. లైసెన్సింగ్‌కు కేవలం 12 రోజులు మాత్రమే ఉన్నందున పబ్లిక్ హియరింగ్ గడువును పొడగించబోమని ఈఆర్సీ చైర్మన్ తన్నీరు శ్రీరంగారావు తెలిపారు. ఈఆర్సీ సలహామండలి సమావేశం శనివారం ఎర్రగడ్డలోని ఈఆర్సీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని విద్యుత్తు పంపిణీ సంస్థల తీరుపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తంచేశారు. వార్షిక రాబడి వివరాలు (ఏఆర్ఆర్) ప్రతిపాదనలను సకాలంలో సమర్పించడంలో డిస్కంలు విఫలమవుతున్నాయని అన్నారు. ఇది అంతిమంగా వినియోగదారులకు భారంగా మారనుందని పేర్కొన్నారు. సెంటర్ ఫర్ పవర్ స్టడీస్ ప్రతినిధి వేణుగోపాల్‌రావు మాట్లాడుతూ 2023-24 టారిఫ్‌ను ఈ ఏడాది వసూలు చేసేందుకు అనుమతినిచ్చి 7నెలలుదాటిపోయిందని, ఈ ఐదు నెలలకు టారిఫ్‌ను సవరించాల్సిన అవసరమేముందని ప్రశ్నించారు. ఆలస్యంగా ఏఆర్ఆర్ సమర్పించినందుకు పెనాల్టీలు వేసినా ఆ భారం వినియోగదారులపైనే పడుతుందని తెలిపారు.

చార్జీల పెంపునకు డిస్కంల ప్రతిపాదనలు

ప్రస్తుతం చార్జీల పెంపునకు డిస్కంలు ఈఆర్సీకి చేసిన ప్రతిపాదనలు ఇలా ఉన్నాయి. 2024 -25లో మొత్తంగా రూ.1,200 కోట్లు చార్జీల రూపంలో వసూలు చేసేందుకు డిస్కంలు ప్రతిపాదించాయి. ఎల్‌టీ క్యాటగిరీలో 300 యూనిట్లకు పైగా వాడుతున్న వారికి ప్రతి కిలోవాట్‌కు ప్రస్తుతం వసూలు చేస్తున్న రూ.10ని రూ. 50కు పెంచాలని ప్రతిపాదించాయి. ప్రస్తుతం రూ.30 ఫిక్స్‌డ్ చార్జీలు రూ.150కి పెరగనున్నాయి. ఇది 26 లక్షల మంది వినియోగదారులపై భారం పడనుంది. హెచ్‌టీ క్యాటగిరీలో రూ.7.65లుగా చార్జీలుగా నిర్ణయించారు. దీంతో 33కేవీ వినియోగదారులకు 50 పైసలు, 132 కేవీ వారికి రూపాయి చొప్పున చార్జీలు పెరగనున్నాయి. కరెంట్ బిల్లుల పెంపుతో రూ.700కోట్లు, ఫిక్స్‌డ్ చార్జీల ద్వారా రూ.100 కోట్లు, మొత్తంగా రూ.800 కోట్లు రాబట్టుకునే అవకాశమివ్వాలని కోరాయి. ఎల్‌టీ ఫిక్స్‌డ్ చార్జీల రూపేణా రూ.400 కోట్ల ఆదాయం పెంపునకు ప్రతిపాదించాయి. దీనిపై ఈఆర్సీ బహిరంగ విచారణ జరపనుంది.

మెడికల్ అడ్మిషన్లలో ఈడబ్ల్యూఎస్ కోటా ఏది?

- వైద్యారోగ్యశాఖను ప్రశ్నించిన హైకోర్టు
- సమాధానం చెప్పాలంటూ అధికారులకు నోటీసులు



హైదరాబాద్, అక్టోబర్5 (నమస్తే తెలంగాణ): ఎంబీబీఎస్, బీడీఎస్, పీజీ మెడికల్ కోర్సుల్లో ఈడబ్ల్యూఎస్ (ఆర్థికంగా వెనుకబడిన తరగతుల) రిజర్వేషన్లు అమలు చేయడం లేదంటూ బీజేపీకి చెందిన కామారెడ్డి ఎమ్మెల్యే కే వెంకటరమణారెడ్డి కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావుతో కూడిన ధర్మాసనం విచారణ ప్రారంభించింది. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను ఎందుకు అమలు చేయడం లేదని అధికారులను ప్రశ్నించింది. దీనిని కోర్టు ధిక్కరణ కింద ఎందుకు పరిగణించరాదో చెప్పాలని నోటీసులు జారీచేసింది. కోర్టుకు హామీ ఇచ్చినప్పటికీ ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను అమలు చేయకపోవడం కోర్టుధిక్కారమే అవుతుందని, కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించడాన్ని ధిక్కరణ కింద ఎందుకు పరిగణించరాదో తెలియజేస్తూ పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది. వైద్యఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తు, కాళోజీ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్ సంధ్యకు నోటీసులు జారీచేసింది. తదుపరి విచారణను వాయిదా వేసింది.

కోర్టు ఆదేశించినా అమలుచేయరా?

- దీనిని ధిక్కరణగా ఎందుకు పరిగణించరాదు?
- ఇంజనీరింగ్ సీట్ల వివాదంలో హైకోర్టు ప్రశ్న
- విద్యాశాఖకు నోటీసులు

హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ): ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీల్లో సీఎస్సీలో సీట్ల పెంపునకు అనుమతించాలంటూ గతంలో హైకోర్టు జారీచేసిన ఉత్తర్వులను అమలు చేయలేదంటూ పలు ఇంజినీరింగ్ కాలేజీలు కోర్టు ధిక్కరణ వ్యాజ్యాలను దాఖలు చేశాయి. వీటిని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాస్‌రావుతో కూడిన ద్విసభ్య ధర్మాసనం శనివారం విచారణ చేపట్టింది. కోర్టు ఉత్తర్వులను ఎందుకు అమలు చేయలేదో చెప్పాలని అధికారులకు నోటీసులు జారీచేసింది. హైకోర్టు ఉత్తర్వులను సుప్రీంకోర్టు సమర్థించిన తర్వాత కూడా ఎందుకు అమలు చేయలేదో చెప్పాలని ఆదేశించింది. దీనిని కోర్టు ధిక్కరణగా ఎందుకు పరిగణించరాదో వివరించాలని కోరింది. ఈ మేరకు ఉన్నత విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం, సాంకేతిక విద్యా కమిషనర్ ఏ శ్రీదేవసేన, ఉన్నత విద్యా మండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్, టీజీ ఈఏపీసెట్ కన్వీనర్ డాక్టర్ బీ డీన్‌కుమార్‌కు నోటీసులు జారీచేసింది. సమగ్ర వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను వాయిదా వేసింది.

నిబంధనలు అమలుచేస్తే స్థానిక కోటాకు అర్హులే

మెడికల్ అడ్మిషన్ల స్థానికతపై హైకోర్టు

హైదరాబాద్, అక్టోబర్5 (నమస్తే తెలంగాణ): నిబంధనల ప్రకారం తెలంగాణలో వరుసగా నాలుగేండ్లు నివాసం ఉండి, అర్హత పరీక్ష నీట్ రాసినట్లయితే మెడికల్ అడ్మిషన్లలో స్థానిక కోటా కింద పరిగణించాలని కాళోజీ యూనివర్సిటీని హైకోర్టు ఆదేశించింది. 2019 నుంచి తెలంగాణలో ఉంటూ ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత సాధించినప్పటికీ స్థానిక కోటా కింద పరిగణించకపోవడం అన్యాయమంటూ అనమ్తా ఫరూక్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యాన్ని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావుతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషనర్ పదో తరగతి వరకు దుబాయ్‌లో చదువుకున్నాడని, 2019లో తెలంగాణకు వచ్చి ఇక్కడే ఇంటర్మీడియట్ పూర్తిచేశాడని విద్యార్థి తరపు న్యాయవాది చెప్పారు. నాలుగేండ్లుగా స్థానికంగా ఉంటున్నట్టు శేరిలింగంపల్లి ఎమ్మార్వో ధ్రువీకరణ పత్రాన్ని కూడా ఇచ్చారని తెలిపారు. అయినప్పటికీ పిటిషనర్‌ను స్థానికేతరునిగా చూపడం చట్ట వ్యతిరేకమని ప్రకటించాలని కోరారు. వాదనల తర్వాత హైకోర్టు, పిటిషనర్ వరుసగా నాలుగేండ్లు తెలంగాణలో నివాసం ఉండటంతోపాటు ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత, నీట్ తెలంగాణలో ఉత్తీర్ణత సాధించినందున మెడికల్ అడ్మిషన్లలో స్థానిక కోటా కింద పరిగణించాలని ఆదేశించింది.

ఎస్ఆర్‌డీఎస్ ఉద్యోగులకు భద్రత

మంత్రి సీతక్క హామీ



హైదరాబాద్, అక్టోబరు 5 (నమస్తే తెలంగాణ) : గ్రామీణాభివృద్ధి శాఖ సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ సర్వీసెస్ (ఎస్ఆర్‌డీఎస్)లో పనిచేస్తున్న ఉద్యోగులకు భద్రత కల్పించేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. శనివారం సచివాలయంలో ఎస్ఆర్‌డీఎస్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశం మంత్రి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్ఆర్‌డీఎస్‌లో కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ పద్ధతిలో 3700కు పైగా ఉద్యోగులు పనిచేస్తున్నారని, వీరిలో టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఆఫీసు సుబార్డినేట్‌లు, ఇంజినీరింగ్ కన్సల్టెంట్లు ఉన్నారని తెలిపారు. ప్రతి ఉద్యోగి కుటుంబానికి భరోసా కల్పిస్తామని చెప్పారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేశ్‌కుమార్, కమిషనర్ అనితా రామచంద్రన్, స్పెషల్ కమిషనర్ షఫీ ఉల్లా, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

రైతుల గురించి మాట్లాడే నైతిక హక్కు ప్రధాని మోదీకి లేదని, పదేండ్ల పాలనలో రైతులకు పైసా రుణమాఫీ చేయని ప్రధాని, తెలంగాణ ప్రభుత్వాన్ని విమర్శించడం హాస్యాస్పదమని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క విమర్శించారు. మహారాష్ట్ర సభలో తెలంగాణ ప్రభుత్వంపై మోదీ వ్యాఖ్యలను మంత్రి శనివారం ఒక ప్రకటనలో ఖండించారు.

దేవాదాయ శాఖలో పదోన్నతులు

హైదరాబాద్, అక్టోబర్ 5(నమస్తే తెలంగాణ): దేవాదాయ శాఖలో 33మంది జూనియర్ అసిస్టెంట్లకు గ్రేడ్- 3 ఈవోలుగా పదోన్నతులు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. శనివారం సచివాలయంలో ఏర్పాటుచేసిన ఓ కార్యక్రంలో మంత్రి మంత్రి కొండా సురేఖ ఉద్యోగులకు పదోన్నతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 33 మంది జూనియర్ అసిస్టెంట్లకు గ్రేడ్- 3 ఈవోలుగా ప్రమోషన్ పత్రాలు అందివ్వడం ఆనందంగా ఉందని చెప్పారు. ఇప్పటికే గ్రేడ్ -1, గ్రేడ్ -2 ఈవోలుగా పలువురికి ప్రభుత్వం ప్రమోషన్లు కల్పించిన విషయాన్ని గుర్తుచేశారు. ఉద్యోగులు దేవాలయాల అభివృద్ధికి, భక్తుల సౌకర్యాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. దేవాదాయ శాఖ భూముల్లో సౌర విద్యుత్ ఉత్పత్తి, జియో ట్యాగింగ్‌తో ప్రభుత్వం కట్టుదిట్టమైన కార్యాచరణతో ముందుకు సాగుతున్నదని అన్నారు. కోర్టు కేసుల్లో వున్న దేవాలయ భూములకు విముక్తి ప్రసాదించేందుకు దేవాదాయ శాఖ త్వరలో లీగల్ ఆఫీసర్‌ను నియమించనుందని వివరించారు.

పీఎం యశస్వికి దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ): పీఎం యశస్వికి దరఖాస్తు చేసుకోవాలని అధికారులు శనివారం ప్రకటనలో తెలిపారు. స్కాలర్‌షిప్‌ల కోసం బీసీ, ఈబీసీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కోరారు. ఎంపికైన 9, 10వ తరగతి విద్యార్థులకు రూ.75వేల చొప్పున ఉపకార వేతనం అందిస్తామని తెలిపారు. ఇంటర్ విద్యార్థులకు రూ.1.25 లక్షలు ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. 31 వరకు దరఖాస్తు చేసుకోవాలని, పట్టణంలో వార్షిక ఆదాయం రూ.2 లక్షలు, గ్రామీణ ప్రాంతంలో రూ.1.50లక్షలకు మించరాదని వెల్లడించారు.

బీఎస్సీ నర్సింగ్ ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ): కాళోజీ యూనివర్సిటీ అనుబంధంగా ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ నర్సింగ్ కళాశాల్లో కాంపిటెంట్ అథారిటీ కోటా కింద 2024-25 విద్యా సంవత్సరానికి నాలుగేండ్ల బీఎస్సీ కోర్సుల్లో ప్రవేశానికి టీజీ-ఈఏపీసెట్-2024లో అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్‌సైన్సెస్ వారు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం నుంచి ఈ నెల 14 వరకు https://tsparamed.tsche.in వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన ఒరిజినల్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ తర్వాత అర్హత ప్రమాణాల ఆధారంగా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల తాత్కాలిక ఫైనల్ మెరిట్ స్థానం సిద్ధం చేయనున్నట్టు వివరించారు.

సీఎం చెప్పినా పైసలు ఇయ్యం!

- మహిళల ప్రమాదబీమాకు ఆర్థికశాఖ కొర్రీ
- ప్రీమియం చెల్లింపు ఫైల్ తిరస్కరణ
- 6నెలలైనా అమలుకాని పథకం
- మహిళా సంఘాల విమర్శలు



హైదరాబాద్, అక్టోబరు 5 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించి, ఆదేశాలు జారీ చేసిన ఫైల్‌కే ఆర్థిక శాఖ అధికారులు కొర్రీలు పెడుతున్నారు. సీఎం హామీ ఇస్తే తమకేంటి... అంటూ ఫైల్‌ను తిరస్కరించారు. మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ.10లక్షల ప్రమాద బీమా, రూ.2 లక్షల లోన్ బీమా కల్పించనున్నట్టుగా సీఎం రేవంత్‌రెడ్డి పరేడ్ గ్రౌండ్ సభలో ప్రకటించారు. దీనికి సంబంధించి ఉత్తర్వులు లోక్‌సభ ఎన్నికల ముందు ఇచ్చారు. ప్రీమియం మొత్తం ప్రభుత్వమే చెల్లిస్తుందని ప్రకటించి ఆరు నెలలైనా ఇంత వరకు చెల్లించలేదు. ప్రీమియం నిధుల విడుదలకు ఫైల్ ఆర్థికశాఖకు పంపిస్తే అధికారులు తిరస్కరించినట్టుగా తెలిసింది. రాష్ట్రంలో 50లక్షలకు పైగా మహిళా స్వయం సంఘాల సభ్యులు ఉండటంతో ప్రీమియం మొత్తం ఎక్కువగా అవుతుందని, అంతమొత్తం చెల్లించడం కష్టమని, ప్రత్యామ్నాయాలు ఆలోచించాలని ఆర్థిక శాఖ అధికారులు సూచించినట్టుగా సమాచారం. దీంతో ఆ పథకానికి ఆదిలోనే హంసపాదు ఎదురైందని, ఇప్పటికే సీఎం పథకాన్ని ప్రకటించినందున అమలు ఎలా చేయాలనే దానిపై సెర్ప్, స్త్రీ నిధి అధికారులు తర్జనభర్జన పడుతున్నట్టుగా సమాచారం. ఆరు నెలలైనా ఇంకా ప్రీమియం చెల్లింపు దశలోనే ఉండటంపై ఎస్‌హెచ్‌జీ సభ్యులు నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పథకం ఇలా...

స్వయం సహాయక సంఘాల సభ్యులకు లోన్ ఇన్సూరెన్స్ కింద స్వయం సహాయక సభ్యురాలు ఏ కారణంగానైనా మరణిస్తే ఆమె చెల్లించే బ్యాంకు లోన్‌ను రెండు లక్షల వరకు ఇన్సూరెన్స్ డబ్బు ద్వారా చెల్లిస్తారు. సభ్యురాలు ప్రమాదవశాత్తు మరణిస్తే ఆమె నామినీకి రూ.10లక్షలు ఇస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఈ పథకం అమలు బాధ్యతను స్త్రీ నిధికి అప్పగిస్తూ ఉత్తర్వులు కూడా ఇచ్చారు.

సురేఖపై ఇంత రియాక్షన్ అవసరమా?

- ఆమెకు మేమంతా అండగా ఉన్నాం
- ఇష్యూని ఇంతటితో క్లోజ్ చేయాలి
- గురుకుల హాస్టల్స్‌లో వసతులు లేవు
- మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి



హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ): సమంత, నాగ చైతన్య విషయంలో మంత్రి కొండా సురేఖ్ చేసిన వ్యాఖ్యలను పలువురు సినీ తారలు, రాజకీయ ప్రముఖులు తీవ్రంగా పరిగణించడంపై బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించారు. 'ఇంత రియాక్షన్ అవసరమా?' అని ఆయన ప్రశ్నించారు. గాంధీభవన్‌లో శనివారం ఆయన మీడియాతో చిట్‌చాట్ చేశారు. నాగార్జున కుటుంబం కోరిక మేరకు మంత్రి కొండా సురేఖ తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నట్టు ప్రకటించారని తెలిపారు. అయినప్పటికీ సినీ నటుల నుంచి స్పందనలు ఆగలేదని అసహనం వ్యక్తంచేశారు. బలహీన వర్గానికి చెందిన మంత్రి సురేఖ ఒంటరి కాదని, ఆమెకు తామంతా అండగా ఉన్నామని అన్నారు. తన వ్యాఖ్యలు ఉపసంహరించుకున్న తర్వాత కూడా ఇంత దాడి ఎందుకు అని ప్రశ్నించారు. ఇష్యూని ఇంతటితో క్లోజ్ చేయాలన్నారు. ఈ విషయంపై ఎవరూ మాట్లాడొద్దని పీసీసీ అధ్యక్షుడు కూడా ఆదేశించినట్టు తెలిపారు.

హామీలు అమలుచేశాం

ఇక మహిళల ఉచిత బస్సు, రైతు రుణ మాఫీ, డీఎస్సీ, ఉద్యోగ నియామకాలు పూర్తి చేశామని మంత్రి పొన్నం చెప్పారు. ఈ సంవత్సరం మహిళా సంఘాల సభ్యులకు మాత్రమే బతుకమ్మ చీరల పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఇప్పటికే బతుకమ్మ చీరలకు రూ.150 కోట్లు విడుదల చేసినట్టు చెప్పారు. రెసిడెన్షియల్ విద్యాసంస్థల సమస్యలపై సీఎం, డిప్యూటీ సీఎంతో చర్చించానని, వాళ్లు సానుకూలంగా స్పందించారని తెలిపారు. రాష్ట్రంలోని 1029 గురుకులాల్లో చాలా వాటికి సొంత భవనాలు లేవని తెలిపారు. అద్దెకు తీసుకున్న హాస్టల్స్‌లోనూ సరైన వసతులు లేవని అన్నారు. రాష్ట్రంపై కేంద్రం మరోసారి వివక్ష చూపిందని విమర్శించారు. వర్షాలకు రూ.10 వేల కోట్ల నష్టం జరిగినట్టు నివేదిక ఇస్తే కేవలం రూ.400 కోట్లు ఇచ్చిందని తెలిపారు. తెలంగాణ నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులు ఉండి ఏం లాభమని మండిపడ్డారు.

మరో 17 ప్రభుత్వ కాలేజీలకు అటానమస్ హోదా

- రాష్ట్రంలో మొత్తం 32 అటానమస్ కాలేజీలు

హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని మరో 17 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు అటానమస్ హోదాను దక్కించుకున్నాయి. ఇప్పటికే ఈ కాలేజీలకు నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రెడిటేషన్ కౌన్సిల్ (న్యాక్) నుంచి 'ఏ' గ్రేడ్ లభించడంతో తాజాగా వాటికి యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) అటానమస్ హోదాను కల్పించింది. నిరుటి వరకు రాష్ట్రంలో 15 ప్రభుత్వ డిగ్రీ కాలేజీలకు అటానమస్ హోదా లభించింది. ఇప్పుడు మరో 17 కాలేజీలకు అటానమస్ హోదా లభించడంతో రాష్ట్రంలో ఈ హోదా దక్కించుకున్న కాలేజీల సంఖ్య 32కు పెరిగింది. అటానమస్ హోదా కల్పించేందుకు నిర్దేశించిన నిబంధనల్లో ఇటీవల యూజీసీ పలు మార్పులు చేసింది. వర్సిటీలతో సంబంధం లేకుండా నేరుగా యూజీసీకి దరఖాస్తు చేసుకునేలా పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. పదేండ్ల క్రితం ఏర్పాటైన కాలేజీలతోపాటు న్యాక్ ఏ గ్రేడ్ పొందిన కాలేజీలకు తొలుత 10 ఏండ్లపాటు అటానమస్ హోదాను కల్పిస్తున్నది. 15 ఏండ్ల పాటు అటానమస్ హోదా కలిగి ఉన్న కాలేజీలకు శాశ్వత అటానమస్ హోదాను కల్పిస్తారు. ప్రస్తుతం రాష్ట్రంలో 153 ప్రభుత్వ డిగ్రీ కాలేజీలున్నాయి. వీటిలో ఇప్పటి వరకు 90కిపైగా కాలేజీలు న్యాక్ గుర్తింపు పొందాయి.

అటానమస్ కాలేజీలు ఇవే..

ప్రభుత్వ డిగ్రీ కాలేజీ - భద్రాచలం, ప్రభుత్వ డిగ్రీ కాలేజీ - పాల్వంచ, ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ - జగిత్యాల, ప్రభుత్వ డిగ్రీ కాలేజీ - కామారెడ్డి, ప్రభుత్వ డిగ్రీ కాలేజీ - బిచ్కుంద, ఎస్ఆర్ఎన్‌కే ప్రభుత్వ డిగ్రీ కాలేజీ-బాన్సువాడ, ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ - కరీంనగర్, జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ -సత్తుపల్లి, నూకల రామచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కాలేజీ-మహబూబాబాద్, ప్రభుత్వ డిగ్రీ కాలేజీ - బోధన్, బీజేఆర్ డిగ్రీ కాలేజీ - నారాయణగూడ, ప్రభుత్వ డిగ్రీ కాలేజీ - ఖైరతాబాద్, వివేకానంద డిగ్రీ కాలేజీ - విద్యానగర్, డాక్టర్ బీఆర్ఆర్ డిగ్రీ కాలేజీ - జడ్చర్ల, ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ -మహబూబ్‌నగర్, శ్రీ వెంకటేశ్వర ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ - పాలెం, కేఆర్ఆర్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ - కోదాడ.



నూతన్‌కల్ పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

రాణాకెక్కిన కాంగ్రెస్ వర్గపోరు

- ఎమ్మెల్యే సామేల్ ఆదేశాల మేరకే అదుపులోకి
- నూతన్‌కల్ పోలీస్ స్టేషన్ ఎదుట సొంత పార్టీ నేతల ధర్నా

సూర్యాపేట, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ): తుంగతుర్తి నియోజకవర్గంలో అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక ఎమ్మెల్యే సామేల్ ఆదేశాల మేరకే తమను స్టేషన్‌కు తరలించారని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు మండిపడ్డారు. సామేల్‌ను కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలిపించుకుంటే ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ పార్టీ కేడర్‌ను కనీసం పట్టించుకోవడం లేదని ఆ పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకులు అర్వపల్లి మండల కేంద్రంలో శనివారం సమావేశం ఏర్పాటు చేశారు. దీంతో ఎమ్మెల్యే సామేల్ పోలీసులను ఉసిగొలిపి తెల్లవారుజామున 4 గంటలకు నియోజకవర్గ వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకుల ఇండ్లపై దాడి చేయించి హౌజ్ అరెస్టులు చేయించారని, మరికొందరిని ముందస్తు అరెస్టులు చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారని సీనియర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. అర్వపల్లి, శాలిగౌరారం, నాగారం మండలాలకు చెందిన మోరపాక సత్యం, అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, నర్సింగ్ శ్రీనువాస్‌గౌడ్, వేల్పుల రమేశ్, శిగ నసీర్ తదితరులను అరెస్టు చేసి దాదాపు 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న నూతనకల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ అరెస్టులను నిరసిస్తూ.. కాంగ్రెస్ నాయకులు పోలీస్ స్టేషన్ ఎదుట పెద్ద ఎత్తున ధర్నా చేశారు. డీసీసీ ఉపాధ్యక్షుడు ధరూరి యోగానందచార్యులు స్టేషన్‌కు చేరుకుని అధికార పార్టీ నాయకుల అరెస్టును ఖండించారు.

బీసీ ఫెడరేషన్లను కార్పొరేషన్లుగా మార్చాలి

రేవంత్‌రెడ్డికి ఆర్ కృష్ణయ్య బహిరంగ లేఖ



హైదరాబాద్, అక్టోబర్ 5(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ప్రస్తుతమున్న 10 బీసీ కులాల ఫెడరేషన్లను కూడా కార్పొరేషన్లుగా మార్చాలని, ప్రతి కార్పొరేషన్‌కు బడ్జెట్‌లో రూ.1000కోట్లు కేటాయించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగలేఖ రాయడంతోపాటు మీడియాకు శనివారం విడుదల చేశారు. బీసీ శాఖ ఆధ్వర్యంలో విశ్వబ్రాహ్మణ, రజక, వడ్డెర, నాయీబ్రాహ్మణ, వాల్మీకి, భట్రాజు, మేదర, కృష్ణ బలిజ, పూసల, సగర, కుమ్మరి ఫెడరేషన్లు ఉన్నాయని తెలిపారు. ఫెడరేషన్ల నుంచి ఆయా కులవృత్తులకు ఆర్థికసాయం అందిస్తే కేవలం 50శాతం వరకే సబ్సిడీ వస్తుందని, అదే కార్పొరేషన్లుగా మారిస్తే 80శాతం వరకు ఉంటుందని పేర్కొన్నారు. రుణాల పరిమితినీ పెంచాల్సి ఉంటుందని వెల్లడించారు.

యువత ఆలోచనలు అద్భుతం

- తెలంగాణ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య
- ఎస్ఎఫ్‌సీ ఐడియాథాన్‌కు వచ్చిన 1200 దరఖాస్తులు
- 29 రకాల ఇన్నోవేషన్లు ఎంపిక

హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ): యువత ఆలోచనలు, ఇన్నోవేషన్లు అద్భుతంగా ఉన్నాయని రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య కితాబిచ్చారు. దేశంలోనే తొలిసారిగా ఎస్ఎఫ్‌సీ ఆధ్వర్యంలో తలపెట్టిన ఐడియాథాన్-2024కు అనూహ్య స్పందన వచ్చిందని తెలిపారు. బేగంపేటలోని హరితప్లాజాలో శనివారం నిర్వహించిన ఐడియాథాన్ విజేతలకు అవార్డుల ప్రదానోత్సంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల అభివృద్ధి కోసం మంచి ఆలోచనలను ప్రజల నుంచే స్వీకరించాలనే ఉద్దేశంతో 'ఐడియాథాన్' నిర్వహించామని, దేశ, విదేశాలు, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 1200 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. 12 ప్రాంతాల నుంచి 47 మంది 29 రకాల ఆలోచనలను ఆర్థిక సంఘం ముందు నాలుగు రౌండ్లలో పంచుకున్నారని తెలిపారు. అక్టోబర్ 1న చివరి రౌండ్‌తో ఐడియాలపై చర్చ ముగిసిందని, ఫైనల్ విజేతలను ఎంపికచేశామని చెప్పారు. మొదటి 4స్థానాల్లో నిలిచిన బృందాలకు చైర్మన్ రాజయ్య, కలెక్టర్లు అవార్డులు అందజేశారు. ఎస్ఎఫ్‌సీ మెంబర్ సెక్రటరీ స్మితాసబర్వాల్, సభ్యులు నెహ్రూనాయక్, రమేశ్, సుధీర్‌రెడ్డి, పంచాయతీరాజ్, శాఖ కమిషనర్ అనితారామచంద్రన్, శార్ప్ సెక్రటరీ దివ్య దేవరాజన్ పాల్గొన్నారు.

చెత్త ద్వారా రూ.10 లక్షల ఆదాయం

గత బీఆర్ఎస్ ప్రభుత్వం పల్లెప్రగతిలో ట్రాక్టర్ ట్రాలీ ఇవ్వడంతో గ్రామంలో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరిస్తున్నాం. సెగ్రిగేషన్ సెంటర్‌కు తీసుకెళ్లి తడిచెత్తతో వర్మికంపోస్టు తయారుచేసి ఆదాయం ఆర్జిస్తున్నాం. వర్మీకంపోస్ట్ చేసి అమ్మగా రూ.10 లక్షలు ఆదాయం వచ్చింది. పొడి చెత్తతో రూ.71,000 వచ్చింది. నాలుగేండ్లలో చెత్త ద్వారా వచ్చిన రూ.10.71 లక్షల ఆదాయంతో గ్రామంలో 5 లక్షలతో సోలార్ ప్లాంట్ పెట్టి 6కేవీ విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నాం. గతంలో నెలకు రూ.10-12 వేల కరెంట్ బిల్ వస్తుండె. ఇప్పుడు జీరో బిల్ వస్తున్నది.

- గాడ్గె మీనాక్షి, ముక్రా (కే) తాజా మాజీ సర్పంచ్, ఇచ్చోడ మండలం, ఆదిలాబాద్ జిల్లా

సెక్షన్లపై పట్టు సాధించాలి: డీజీపీ

హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ): కొత్తగా వచ్చిన చట్టాల్లోని సెక్షన్లపై పోలీసు అధికారులు పట్టుసాధించాలని డీజీపీ జితేందర్ పిలుపునిచ్చారు. కొత్త క్రిమినల్ చట్టాలు అమలులోకి వచ్చి 3 నెలలైన సందర్భంగా ఎదురవుతున్న ఇబ్బందులు, వాటి పరిష్కారాలపై పోలీసు అకాడమీలో శనివారం ఒకరోజు వర్క్‌షాపు, సమీక్ష నిర్వహించారు. సవాళ్లను అధిగమించేందుకు వర్క్‌షాపు ఎంతో ఉపయోగపడిందని పోలీసు అకాడమీ డైరెక్టర్, డీజీ అభిలాష బిస్త్ అన్నారు. సమస్యలు, వాటి పరిష్కారాలను సీఐడీ డీజీ శిఖాగోయెల్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. పోలీసులు కచ్చితత్వం పాటించాలని రాజస్థాన్ మాజీ డీజీపీ డీసీ జైన్ అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ఇంటెలిజెన్స్ డీజీ శివధర్ రెడ్డి, ఏడీజీలు సంజయ్ కుమార్ జైన్, స్టీఫెన్ రవీంద్ర, సీపీ అవినాశ్ మహంతి, ఏసీబీ డైరెక్టర్ తరుణ్ జోషి, నల్సార్ యూనివర్సిటీ అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌కు ఎస్సార్ఆర్ 50 లక్షల విరాళం

హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ): వరద బాధితుల సహాయార్థం ఎస్సార్ఆర్ అనే రియల్‌ఎస్టేట్ ప్రైవేట్ కంపెనీ రూ. 50 లక్షల విరాళం అందజేసింది. శనివారం కంపెనీ ప్రతినిధులు అల్లూరి శ్రీనివాస్, పరుచూరి మురళీకృష్ణ, కేఎస్ రామారావు, ఎం చంద్రారెడ్డి సీఎం రేవంత్‌రెడ్డిని జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో కలిసి చెక్కును అందించారు. వీరిని ముఖ్యమంత్రి అభినందించారు.





ఏపీ బార్డర్ కృష్ణానది నుంచి రాయలసీమ ఎత్తిపోతల పథకానికి అక్రమంగా నీటిని తరలించేందుకు తవ్విన కాల్వ, రాయలసీమ లిఫ్ట్‌కు నీటిని అక్రమంగా తరలించేందుకు కృష్ణానది సమీపంలో ఏర్పాటు చేసిన టన్నెల్

ఏపీ దొంగ దెబ్బ

మొదటిపేజీ తరువాయి...

ప్రతిపాదించిన రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ ఎండాకాలంలోనూ రాయలసీమకు నీటిని తరలించాలన్న ఉద్దేశంగా తెలుస్తోంది. ఈ ఎత్తిపోతల పథకం ద్వారా 111 టీఎంసీల నీటిని తరలించేందుకు ప్రతిపాదించారు. పంప్‌హౌస్ కోసం ఏకంగా కృష్ణానది తీరప్రాంతంలో లోతైన అప్రోచ్ కాల్వను నిర్మించారు. ఈ కాల్వ ద్వారా 12 సొరంగాల నుంచి సుమారు 300 మీటర్ల దూరంలోని పంప్‌హౌస్‌కు నీళ్లు వెళ్తాయి. అప్రోచ్ కెనాల్ కోసం నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ సమీపంలోని సంగమేశ్వర ఆలయం వద్ద మొదలు పెట్టి నంద్యాల జిల్లా జూపాడు బంగ్లా మండలం పోతులమడుగు గ్రామం వరకు 18 కి.మీ. అప్రోచ్ కెనాల్‌ను నిర్మిస్తున్నది. ఇప్పటికే కృష్ణా నదిలో ఏపీ వైపు ఐదు కిలోమీటర్ల మేర కాల్వ తవ్వకం పూర్తయినట్టు తెలుస్తున్నది.

పోతిరెడ్డిపాడుకు మరో కాల్వ

ఓ వైపు రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని అక్రమంగా నిర్మిస్తూనే పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీకి మరో కెనాల్‌ను తవ్వేశారు. ఇప్పటికే పోతిరెడ్డిపాడు వద్ద 15 టీఎంసీల నీటిని తరలించేందుకు తెలుగుగంగ కాల్వను ఏర్పాటు చేయగా.. మద్రాస్‌కు తాగునీరు అందించేందుకు ఉద్దేశించిన ఈ కాల్వ పక్కనే పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ సామర్థ్యాన్ని పెంచి 10 గేట్ల ద్వారా మరో 18 వందల క్యూసెక్కుల నీటికి కాల్వ ఏర్పాటు చేసి తరలిస్తున్నది. ఇవి రెండు కాల్వలు ఉండంగానే మరో కాల్వను నది లోపలి నుంచి తవ్వి పోతిరెడ్డిపాడుకు జనవరి చివరి వరకు నీళ్లు అందించేందుకు సిద్ధం చేసింది. కృష్ణా నదిలో నీరు రావడం ప్రారంభమైన నుంచి డిసెంబర్ వరకు పోతిరెడ్డిపాడు ద్వారా నీటిని యథేచ్ఛగా తరలిస్తున్నది. తాజాగా జనవరి చివరి వరకు పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీకి నీరు అందించే విధంగా మరో కాల్వను సిద్ధం చేయడం గమనార్హం. పోతిరెడ్డిపాడు విస్తరణపై గతంలోనే తెలంగాణ అభ్యంతరాలను వ్యక్తం చేసింది. ఉమ్మడి రాష్ట్రంలో కూడా అభ్యంతరాలు వ్యక్తం చేసిన అప్పటి వైఎస్ ప్రభుత్వం దీన్ని తుంగలో తొక్కి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌ను భారీ ఎత్తున విస్తరించింది.

111 టీఎంసీలు తరలించేలా ప్లాన్

కృష్ణా నదికి ఏపీ వైపున హంద్రీనీవా, ముచ్చుమర్రి, పోతిరెడ్డిపాడు, తెలుగుగంగ కాల్వతోపాటు తాజాగా నిర్మిస్తున్న రాయలసీమ ఎత్తిపోతల పథకానికి 111 టీఎంసీలు గ్రావిటీ ద్వారా తరలించకపోయేందుకు ఈ పథకాన్ని నిర్మిస్తున్నారు. కృష్ణా నదికి ఎగువన మహారాష్ట్ర, కర్ణాటకలో కురిసిన భారీ వర్షాలకు జూన్ రెండో వారం నుంచి వరద మొదలవుతుంది. ఈ సమయంలో ఏపీ తమ వైపు ఉన్న ఎత్తిపోతల పథకాలకు ఎలాంటి సమాచారం లేకుండా నీటి తరలింపు ప్రారంభిస్తున్నది. శ్రీశైలం నిండితే నీటి తరలింపునకు ఢోకా ఉండదు. ఎండాకాలంలో శ్రీశైలం నీటి మట్టం తగ్గుముఖం పడుతుంది. 854 మీటర్ల కనిష్ఠ మట్టానికి చేరినప్పుడు ఈ పథకాలకు నీళ్లు ఆగిపోతాయి. 854 అడుగుల మేర శ్రీశైలంలో డెడ్ స్టోరేజీ ఉన్నప్పటికీ నీళ్లను తోడుకోవచ్చని రాయలసీమ ఎత్తిపోతల పథకానికి రూపకల్పన చేశారు. ఇది పూర్తయితే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో తాగునీటికి ఇబ్బందులు తప్పవు. ఇక నాగార్జునసాగర్‌కు తరలించడం కూడా అసాధ్యమవుతుంది. రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని కేసీఆర్ ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకించి ఏకంగా న్యాయపోరాటానికి దిగింది.

ఎన్జీటీ ఆదేశాలు తుంగలో తొక్కి..

పర్యావరణ అనుమతులు లేనిది రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని చేపట్టొద్దని 2021 ఏడాది డిసెంబర్ 17న ఎన్జీటీ తీర్పు ఇచ్చింది. ఈ తీర్పుతో కొన్ని రోజులు పని ఆపిన ఏపీ ప్రభుత్వం.. ఆ తర్వాత నిరాటకంగా కొనసాగిస్తున్నది. ఎన్జీటీ తీర్పు నాటికి 14శాతం పనులు మాత్రమే పూర్తయితే.. 2024 మార్చి, ఏప్రిల్ వరకు దాదాపు 87 శాతం పనులు పూర్తి కావడం గమనార్హం. తెలంగాణ ప్రభుత్వ అభ్యంతరాలతో ఎన్జీటీ ఒక కమిటీని నియమించింది. పర్యావరణ అటవీ అనుమతులు లేనిదే నిర్మించినందుకు రూ. 2.65 కోట్ల ఫెనాల్టీ ఇవ్వాలని కమిటీ ప్రతిపాదించింది. అంతేకాకుండా పర్యావరణ అటవీ మంత్రిత్వ శాఖ అనుమతులతో పాటు ఇతర స్టాట్యూరీ పోస్ట్ ఫాక్టో అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఆదేశించింది.

బాబు కోసం రేవంత్ సైలెంట్..

ఇటు తెలంగాణలో అటు ఏపీలోనూ ప్రభుత్వాలు మారడంతో రాయలసీమ ఎత్తిపోతల పథకానికి ఇక అడ్డూ.. అదుపు ఉండదని భావిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు పగ్గాలు చేపట్టడంతో తెలంగాణ సీఎం రేవంత్ ఈ ప్రాజెక్టుకు అభ్యంతరాలు పెట్టకపోవచ్చన్న ఊహాగానాలు మొదలయ్యాయి. దీనికి బలం చేకూరుస్తూ సొంత జిల్లాలోని పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని పక్కకు పెట్టి పనులను ఎక్కడికి అక్కడే నిలిపివేసి.. బడ్జెట్లో చిల్లిగవ్వ కేటాయించకుండా చూడటం వెనుక ఉద్దేశం ఇదేనని అంటున్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం మాదిరిగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రాయలసీమ ఎత్తిపోతల పథకంపై పెద్దగా ఫోకస్ పెట్టకపోవచ్చని భావిస్తున్నారు. తన గురువు చంద్రబాబు కోసం శిష్యుడైన రేవంత్ తెలంగాణ ప్రయోజనాలను తాకట్టు పెట్టినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదని బీఆర్‌ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు.

తొమ్మిది నెలలుగా మందుల్లేవు



తొమ్మిది నెలలుగా పశువుల దవాఖానలో మందులు లేవంటూ రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడులోని ప్రభుత్వ పశువైద్యశాలకు శనివారం కొంతమంది రైతులు మూగజీవాల చికిత్స కోసం వచ్చారు. దవాఖానలో మందులు లేవని, మెడికల్‌షాప్‌నకు వెళ్లి తీసుకురావాలని సిబ్బంది చెప్పారు. ఆగ్రహం వ్యక్తంచేసిన వారు దవాఖానలో పశువులు కట్టేసి నిరసన తెలిపారు. ఎప్పుడు వచ్చినా మందులు లేవంటున్నారని రైతులు మండిపడ్డారు. 'మాకు మందులు సరఫరా కావడం లేదు. అధికారులకు చెప్పినా పురోగతి లేదు.' అని అటెండర్ తెలిపాడు. వారం రోజుల్లో మందులు సరఫరా చేస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు. - మానవపాడు

మద్దెలబండ సబ్ స్టేషన్ ఎదుట రైతుల ధర్నా



రెండ్రోజులుగా పంటలకు, గ్రామానికి కరెంట్ సక్రమంగా సరఫరా కావడంలేదంటూ రైతన్నలు ఆగ్రహం వ్యక్తంచేశారు. జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం అడవి రావుల చెర్వు గ్రామానికి చెందిన రైతులు శనివారం మద్దెలబండ సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేశారు. – మల్దకల్

జీతాల కోసం జీపీ వర్కర్ల నిరసన



ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ శనివారం మంచిర్యాల జిల్లా నెన్నెల గ్రామ పంచాయతీ వర్కర్లు ఆందోళన చేపట్టారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట బైఠాయించారు. ఐదు నెలలుగా వేతనాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, పండుగ పూట పస్తులు ఉంచుతారా? అని ప్రశ్నించారు. - నెన్నెల

గురుకుల ఏడీపై వేటు వెనుక మర్మమేంటి ?

- బదిలీలు, పదోన్నతుల్లో గోల్‌మాలే కారణమా..!

హైదరాబాద్, అక్టోబర్5 (నమస్తే తెలంగాణ): సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థ సొసైటీ అడిషనల్ సెక్రటరీ హన్మంత్‌నాయక్‌ను ప్రభుత్వం ఉన్నపళంగా తప్పించడం సర్వత్రా చర్చనీయాంశమైంది. వాస్తవంగా ఎస్సీ అభివృద్ధిశాఖ హన్మంత్‌నాయక్ పేరెంటల్ డిపార్ట్‌మెంట్ కాగా, ఎస్సీ గురుకుల సొసైటీలో అడిషనల్ సెక్రటరీగా విధులను నిర్వర్తిస్తున్నారు. సొసైటీ కీలక విభాగాలన్నీ ఆయన పర్యవేక్షణ కిందనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో సొసైటీలో జరిగిన బదిలీలు, పదోన్నతులు అనేక వివాదాలకు తెరలేపింది. సొసైటీ టీచర్లు ఏకంగా ప్రజాభవన్ వద్దకు వెళ్లి ధర్నాలకు దిగారు. సొసైటీ ఉద్యోగులే కాదు ఏడీ హన్మంతనాయక్‌పై మాదిగ, మాల, లంబాడ వర్గాలకు చెందిన పలు సంఘాల నేతలు కూడా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారని తెలుస్తున్నది. సొసైటీలోని కొందరు ఉద్యోగులు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి హన్మంతునాయక్ అనేక అక్రమాలకు పాల్పడుతున్నారని, ఆయనపై ఏసీబీ కేసు పెట్టాలని ఆ ఫిర్యాదులో పేర్కొన్నట్టు సమాచారం. ఆ ఫిర్యాదులను ఉన్నతాధికారులు సీరియస్‌గా తీసుకుని లోతుగా విచారణ చేస్తున్నట్లు విశ్వసనీయవర్గాల సమాచారం. ఈ నేపథ్యంలోనే ఉన్నపళంగా వేటు వేసి, పోస్టింగ్ ఇవ్వలేదని సొసైటీ వర్గాలు పేర్కొంటున్నాయి.

ఎస్సీ వర్గీకరణ దాకా డీఎస్సీ నిలిపేయాలి

- వర్గీకరణ అమలును అడ్డుకుంటున్నదెవరు?
- రెండు నెలలైనా అమలు కానీ సీఎం హామీ
- బీఆర్‌ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్



మాట్లాడుతున్న ఎర్రోళ్ల శ్రీనివాస్

హైదరాబాద్, అక్టోబరు 5 (నమస్తే తెలంగాణ): ఎస్సీ వర్గీకరణ అమలయ్యేదాకా డీఎస్సీ నియామకాలను నిలిపివేయాలని బీఆర్‌ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరీణపై సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం తీర్పు ఇచ్చినా అమలును అడ్డుకుంటున్నది ఎవరు అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తీర్పు అమలులో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. సుప్రీంతీర్పును వెంటనే అమలు చేస్తామని అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించి కూడా రెండు నెలలవుతున్నా, మళ్లీ కమిటీలంటూ సాగదీస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. వర్గీకరణపై ఎవరి ప్రయోజనాలు, ప్రలోభాలకు లొంగుతున్నారంటూ సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. ఎస్సీ వర్గీకరణ అమలుపై కాంగ్రెస్ మాదిగ ఎమ్మెల్యేలు, ఎంపీలు ఏంచేస్తున్నారని, ప్రభుత్వంపై ఎందుకు ఒత్తిడి చేయడంలేదని ప్రశ్నించారు.

బీఆర్‌ఎస్ పథకాలను కొనసాగించాలి

ఎస్సీలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఒక్క హామీ కూడా అమలు చేయడంలేదని విమర్శించారు. ఎస్సీలకు గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.10 లక్షల దళితబంధు ఇచ్చిందని, వైన్ షాపు టెండర్లలో 10 శాతం రిజర్వేషన్ కల్పించిందని, నీటిపారుదల శాఖ టెండర్లలో కోటి వరకు ఈఎండీ లేకుండా 21 శాతం టెండర్లు ఇచ్చేలా ఉత్తర్వులు ఇచ్చి అమలు చేసిందని తెలిపారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నేతు బొమ్మెర రామ్మూర్తి, చందు, అంజన్న, రవి, రజనీ పాల్గొన్నారు.

ముగ్గురు రైతుల విషాదాంతం

మొదటిపేజీ తరువాయి...

భూమిలో రెండు బోర్లు, బావి తవ్వేందుకు అప్పులు తెచ్చాడు. పంటలు సరిగ్గా పండక, సుమారు రూ.8 లక్షల వరకు అప్పు చేశాడు. ఆ మొత్తాన్ని తీర్చలేక తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. శనివారం పొలంలోనే పురుగుల మందు తాగాడు. అక్కడికి వచ్చిన రాజు భార్య సరిత అపస్మారక స్థితిలో ఉన్న భర్తను చూసి స్థానికుల సహాయంతో ఎంజీఎం దవాఖానకు తరలించగా, అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సిరిపురం ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు.

తిరుమలగిరిలో కౌలు రైతు..


కాగా హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం తిరుమలగిరి గ్రామానికి చెందిన కాట్రేవుల సాంబమూర్తి (28) ఎనిమిది ఎకరాలను ఆరేళ్లుగా కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. పెట్టుబడి కోసం తెచ్చిన అప్పులు ఎక్కువయ్యాయి. అదే సమయంలో సరైన దిగుబడి లేకపోవడంతో సుమారు రూ.ఆరు లక్షలు అప్పయింది. ఈ అప్పు తీర్చే మార్గం లేక మానసికంగా బాధపడుతూ ఈ నెల 3న పత్తి చేను వద్దకు వెళ్లి పురుగుల మందు తాగి భార్యకు ఫోన్ చేసి చెప్పాడు. వెంటనే ఆమె స్థానికులతో కలిసి వెళ్లి చూడగా స్పృహ కోల్పోయి కింద పడి ఉన్నాడు. వెంటనే ఎంజీఎం హాస్పిటల్‌కు తరలించగా, చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



కేతావత్ సోమ్లానాయక్ (ఫైల్)

రైతు ఉసురుతీసిన 'రుణమాఫీ'

రుణమాఫీ కాలేదన్న దిగులుతో పాలమూరు జిల్లాలో ఓ రైతు గుండె ఆగింది. బాధిత కుటుంబ సభ్యుల కథనం మేరకు.. మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం ఊరంచుతండాకు చెందిన కేతావత్ సోమ్లానాయక్ (59) కొన్నేండ్ల కిందట నవాబ్‌పేట ఎస్బీఐలో రూ.83 వేల పంట రుణం తీసుకున్నాడు. రూ.లక్షలోపే ఉన్నా ప్రభుత్వం ఇటీవల చేపట్టిన రుణమాఫీలో సోమ్లానాయక్‌కు మాఫీ కాలేదు. దీంతో బ్యాంకు, వ్యవసాయ కార్యాలయాల చుట్టూ నిత్యం ప్రదక్షిణలు చేశాడు. బ్యాంకుకు వెళ్తే వ్యవసాయ అధికారుల వద్దకు వెళ్లాలని, అక్కడికి వెళ్తే బ్యాంకుకు వెళ్లాలంటూ ఎవరికి వారు తప్పించుకునే ప్రయత్నం చేశారే తప్పా అతడి సమస్యను పరిష్కరించలేదు. రెండు శాఖల అధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతో మదనపడిన ఆయన శనివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందాడు. వ్యవసాయ అధికారుల వెబ్‌సైట్‌లో స్టేటస్ చూస్తే.. ఆధార్, రుణఖాతాలో పేర్లు సరిపోలకపోవడంతో రుణమాఫీ కాలేదని తేలింది. అధికారుల తప్పిదం వల్లే పేరులో తప్పులు దొర్లినట్టు స్పష్టమవుతున్నది. ఈ విషయమై ఏవో కృష్ణకిశోర్‌ను వివరణ కోరగా పేరు మ్యాచ్ కాకపోవడంతోనే మాఫీ కాలేదని తెలిపారు. బ్యాంక్ మేనేజర్ రవిని వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.



కామారెడ్డిలో భారతీయ కిసాన్ సంఘ్ నిర్వహించిన మహాసభలో వరంగల్ డిక్లరేషన్ అమలు చేయాలని ముక్తకంఠంతో నినదిస్తున్న రైతులు

రుణమాఫీ సంపూర్ణంగా అమలు చేయాలి

మిగతా హామీలనూ నెరవేర్చాలి.. భారతీయ కిసాన్ సంఘ్ డిమాండ్

కామారెడ్డి, అక్టోబర్ 5: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన అన్ని హామీలను నిలబెట్టుకోవాలని భారతీయ కిసాన్ సంఘ్ (బీకేఎస్) డిమాండ్ చేసింది. రుణమాఫీ, రైతుభరోసా, పంటకు రూ.500 బోనస్ సహా వరంగల్ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలన్నింటినీ సంపూర్ణంగా అమలు చేయాల్సిందేనని స్పష్టంచేసింది. కామారెడ్డి జిల్లా కేంద్రంలో శనివారం బీకేఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర మహాసభలకు రైతులు భారీగా తరలి వచ్చారు. ఈ సందర్భంగా బీకేఎస్ రాష్ట్ర కార్యదర్శి మోహిన్ మోహన్ మిశ్రా మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పాల కల్తీని అరికట్టి, పెండింగ్‌లో ఉన్న పాడి రైతుల బిల్లులను వెంటనే విడుదల చేయాలని అన్నారు. వ్యవసాయ సంబంధిత ధాన్యాలు, వంట నూనెల కల్తీని అరికట్టాలని, జంతు కొవ్వులతో తయారు చేస్తున్న వంట నూనెలను నియంత్రించాలని, కాంగ్రెస్ వరంగల్ డిక్లరేషన్‌లో ప్రకటించిన విధంగా వరి సహా అన్ని పంటలకు రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

నిత్యం అస్థిత్వ పోరాటం

- 75 ఏండ్లుగా పోరాడుతూనే ఉన్న ఇజ్రాయెల్
- సవాళ్లున్నా సాంకేతిక సాయంతో ముందడుగు
- ఏడారుల్లో వ్యవసాయం.. పటిష్ఠంగా నిఘా
- పౌరులందరికీ యుద్ధ నైపుణ్యంలో శిక్షణ



ఇజ్రాయెల్ సైనికులతో నెతన్యాహూ

జెరూసలేం: ఇజ్రాయెల్.. ఏడాది కాలంగా ప్రపంచమంతటా మీడియాలో ప్రధాన శీర్షికల్లో నిలిచిన దేశం. పిట్ట కొంచెం కూత ఘనం అన్నట్టు వైశాల్యంలో అతి చిన్న దేశమైనప్పటికీ.. తన అస్థిత్వం కోసం 75 ఏండ్లుగా పోరాటం చేస్తున్నది. ఇప్పటిదాకా కొన్ని యుద్ధాలను ఎదుర్కొంది. అయితే దాని ఉనికిని కొన్ని అరబ్ దేశాలు నేటికీ గుర్తించడం లేదు. కానీ సాంకేతిక సాయంతో, అమెరికా అండదండలతో అభివృద్ధిని సాధించింది. ఇరాన్ మినహా దాదాపు తన చుట్టూ ఉన్న అన్ని దేశాలతో సత్సంబంధాలు నెలకొల్పుకుంది. కానీ ఇరాన్ ప్రోద్బలంతో హమస్, హెజ్బొల్లా, ఇరాక్, సిరియాలోని ఉగ్ర సంస్థలు, హౌతీ తిరుగుబాటుదారులు మాత్రం నిత్యం ఇజ్రాయెల్‌తో ఘర్షణకు దిగుతున్నాయి. గత ఏడాది అక్టోబర్ 7న హమస్ తీవ్రవాదులు ఇజ్రాయెల్‌పై ఆకస్మిక దాడికి పాల్పడటంతో పశ్చిమాసియాలో మొదలైన హింస.. ఈ నెల ఒకటిన ఇజ్రాయెల్‌పైకి ఇరాన్ 200 వరకు ఖండాంతర క్షిపణులను ప్రయోగించడంతో పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారిపోయాయి.

ముప్పేట శత్రువులు పొంచి ఉన్నా...

'నేడు అరబ్బులు తమ ఆయుధాలు విసర్జిస్తే.. హింస అంతమవుతుంది. ఒకవేళ యూదులు (ఇజ్రాయెల్) తమ ఆయుధాలను విసర్జిస్తే.. ఇజ్రాయెల్ దేశమే లేకుండా పోతుంది' అని 1970 దశకంలో ఇజ్రాయెల్ ప్రధాని గోల్డా మెయిర్ వ్యాఖ్యానించారు. ఒకప్పుడు తుర్కియే తరువాత ఇజ్రాయెల్‌ను గుర్తించిన రెండో ముస్లిం దేశం ఇరాన్. కానీ నేడు అది ఇజ్రాయెల్ బద్ధశత్రువుగా మారిపోయింది. దాని ప్రోద్బలంతోనే నేడు లెబనాన్‌లోని హెజ్బొల్లా, ఇరాక్, సిరియాల్లోని ఉగ్రవాదులు, యెమెన్‌లోని హౌతీ తిరుగుబాటుదారులు నిత్యం ఇజ్రాయెల్‌పై కాలు దువ్వుతూనే ఉన్నారు. వీటికి తోడు పక్కలో బల్లెంలా పాలస్తీనాలోని హమాస్ అవకాశం దొరికినప్పుడల్లా ఇజ్రాయెల్‌పై విరుచుకుపడుతూనే ఉన్నది. శత్రువులను బలహీనపరచడం ద్వారా, మరికొందరు శత్రువులను స్నేహితులుగా మార్చుకోవడం ద్వారా ఇజ్రాయెల్ తన మనుగడ సాగిస్తున్నది. అమెరికా మద్దతు, తన సైనిక బలం, నూతన ఆవిష్కరణలు, సాంకేతిక పరిజ్ఞానం, పటిష్ఠమైన గూఢచార వ్యవస్థ, నిఘా విభాగం, బలమైన ఆర్థిక వ్యవస్థ ఇజ్రాయెల్‌కు అత్యంత కీలకమైనవి. ఇక ఇజ్రాయెల్ పౌరులు మెరికల్లాంటివారు. ప్రతి ఒక్కరు క్రావ్ మాగా అనే యుద్ధ విద్యలో నైపుణ్యం పొంది ఉంటారు.

సాంకేతికత సాయంతో స్వయం సమృద్ధి

ఇజ్రాయెల్ జనాభా 90 లక్షలు మాత్రమే. దేశంలో అత్యధిక భాగం ఎందుకూ పనికిరాని ఎడారి ప్రాంతమే. సముద్రపు జలాలను మంచినీరుగా మార్చే సాంకేతికత, తుంపర సాగుతో బీడు భూములను సాగుకు యోగ్యమైనవిగా మార్చేశారు. ప్రపంచవ్యాప్తంగా సైబర్ సెక్యూరిటీ సాంకేతికతను అందిస్తున్న కంపెనీల్లో 40శాతం ఇజ్రాయెల్‌కు చెందినవే ఉన్నాయి. తనకున్న ఇంజినీరింగ్ నైపుణ్యంతో ముడిసరుకు, ఇంధన వనరులు, చిన్న మార్కెట్లు వంటి అన్ని సవాళ్లను ఇజ్రాయెల్ ఎదుర్కోగలిగింది. ప్రపంచవ్యాప్తంగా ఆయుధాలను ఎగుమతి చేస్తున్న 10 టాప్ దేశాల్లో ఇజ్రాయెల్ ఒకటి.

అమెరికా అండ దండలు

ఇజ్రాయెల్ ఏర్పడిన నాటి నుంచి దానికి అమెరికా బలమైన మద్దతుదారుగా ఉన్నది. తనపై ఒకేసారి వందల సంఖ్యలో రాకెట్లు, క్షిపణుల వర్షం పడినాసరే విజయవంతంగా తిప్పికొట్టగల ఐరన్ డోమ్ రక్షణ వ్యవస్థను కూడా అది అమెరికా సాయంతోనే తయారు చేసుకున్నది. అమెరికా ఏటా 3.8 లక్షల కోట్ల డాలర్ల విలువైన సైనిక సాయాన్ని ఇజ్రాయెల్‌కు అందిస్తున్నది. ఈ నెల ఒకటిన ఇరాన్ క్షిపణుల దాడులను అడ్డుకోవడంలో అమెరికా సాయమందించింది.

దుర్గా పూజ వేళ ఖైదీలకు ప్రత్యేక భోజనాలు

కోల్‌కతా: దసరా నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని పశ్చిమ బెంగాల్ అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. జైళ్లలో శిక్ష అనుభవిస్తున్న ఖైదీలకు ప్రత్యేక భోజనాలు అందించాలని నిర్ణయించారు. మటన్ బిర్యానీ, చికెన్ కర్రీ తదితర నాన్ వెజ్ వంటకాలు, వెజ్ వంటకాలతో మెనూ సిద్ధం చేశారు.

ఆన్‌లైన్ బుకింగ్ భక్తులకు మాత్రమే శబరిమలకు అనుమతి

కేరళ ప్రభుత్వం నిర్ణయం

తిరువనంతపురం, అక్టోబర్ 5: ఆన్‌లైన్ బుకింగ్ చేసుకున్న భక్తులను మాత్రమే శబరిమలకు అనుమతించాలని కేరళ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వచ్చే నెల నుంచి శబరిమలలో వార్షిక మండలం-మకరవిలక్కు యాత్ర ప్రారంభం కానున్న నేపథ్యంలో శనివారం ముఖ్యమంత్రి పినరయి విజయన్ అధ్యక్షతన సమావేశం జరిగింది. శబరిమలకు వచ్చే అయ్యప్ప భక్తులు ముందుగా ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకోవాలని సీఎంఓ ఒక ప్రకటనలో తెలిపింది. ప్రతి రోజూ 80 వేల మంది భక్తులకు దర్శనం కల్పించేలా ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపింది.

జమ్ము కశ్మీర్‌లో ఇద్దరు ఉగ్రవాదులు హతం

న్యూఢిల్లీ: జమ్ము కశ్మీర్ కుప్వారా జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్లో ఇద్దరు తీవ్రవాదుల్ని భారత సైన్యం మట్టుబెట్టింది. ఘటనా స్థలంలో సెర్చ్ ఆపరేషన్ ఇంకా కొనసాగుతున్నదని సైన్యం తెలిపింది. పాకిస్థాన్ సరిహద్దు వెంబడి ఉగ్రవాదుల అక్రమ చొరబాట్లను విజయవంతంగా అడ్డుకోగలిగినట్టు శనివారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. మరోవైపు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) శనివారం ఐదు రాష్ట్రాల్లో 22 చోట్ల సోదాలు నిర్వహించింది. జైషే మొహమ్మద్ గ్రూప్‌నకు చెందిన ఉగ్రవాదులకు వ్యతిరేకంగా జమ్ము కశ్మీర్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, అస్సాం, ఢిల్లీ రాష్ట్రాల్లో పలు చోట్ల ఈ సోదాలు చేపట్టింది.

అతి స్వల్ప శ్రేణి రక్షణ వ్యవస్థ పరీక్ష సక్సెస్

న్యూఢిల్లీ: నాలుగో తరానికి చెందిన 'అతి స్వల్ప శ్రేణి గగనతల రక్షణ వ్యవస్థ' (వీఎస్‌హెచ్‌వోఆర్‌ఏడీఎస్)ను భారత్ విజయవంతంగా పరీక్షించింది. రాజస్థాన్‌లోని పోఖ్రాన్ ఫైరింగ్ రేంజ్‌లో శనివారం ఈ పరీక్ష నిర్వహించారు. ఒకే రోజు మూడు క్షిపణుల పనితీరును పరిశీలించారు. ఇవి విజయవంతంగా లక్ష్యాలను ఛేదించినట్టు డీఆర్‌డీవో అధికారులు వెల్లడించారు. మనుషులు సునాయాసంగా మోసుకెళ్లగలిగే ఈ గగనతల రక్షణ వ్యవస్థను డీఆర్‌డీవోలోని ల్యాబొరేటరీలు, భారత పారిశ్రామిక భాగస్వాములతో కలిసి హైదరాబాద్‌లోని రిసెర్చ్ సెంటర్ ఇమారత్ దేశీయంగా రూపొందించింది.

కాంగ్రెస్ సభలో మహిళా నేతపై అనుచిత ప్రవర్తన

నాయకుడి చర్యపై పలువురి ఆగ్రహం

న్యూఢిల్లీ: హర్యానాలో జరిగిన కాంగ్రెస్ సభలో సాక్షాత్తూ ఆ పార్టీకి చెందిన ఒక మహిళా నేత పట్ల మరొక నాయకుడు అనుచితంగా ప్రవర్తించాడు. దీనికి సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. హర్యానా ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ నిర్వహించిన ఒక సభలో కాంగ్రెస్ ఎంపీ దీపేందర్ హూడా, ఇతర సీనియర్ నేతలు పాల్గొన్నారు. స్టేజిపై ఉన్న ఓ మహిళా నేతపై తోటి కాంగ్రెస్ నేత చేతులు వేస్తూ అనుచితంగా ప్రవర్తించారు. ఈ ఘటనను కాంగ్రెస్ నేత కుమారి సెల్జా కూడా నిర్ధారించారు. దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు వైరల్ అయ్యింది. కాంగ్రెస్ నేతల వైఖరిని పలువురు తప్పుబడుతున్నారు. బహిరంగంగా ఒక మహిళను అవమానించడంపై బీజేపీ తీవ్రంగా మండిపడింది.

'నితీశ్‌కు భారత రత్న ఇవ్వాలి!'

పాట్నా, అక్టోబర్ 5: బీహార్ ముఖ్యమంత్రి, జేడీ(యూ) అధినేత నితీశ్ కుమార్‌కు భారతరత్న పురస్కారం ఇవ్వాలంటూ పాట్నాలో శనివారం పోస్టర్లు వెలిశాయి. నితీశ్‌కుమార్ జేడీ(యూ) రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి హాజరైన బీర్‌చంద్ పటేల్ మార్గ్‌లోని పార్టీ ప్రధాన కార్యాలయం ప్రవేశద్వారం సహా నగరంలో పలుచోట్ల ఈ పోస్టర్లు దర్శనమిచ్చాయి. అయితే, తమ పార్టీ అధికారికంగా ఈ డిమాండ్ చేయలేదని పార్టీ సీనియర్ నేత ఒకరు తెలిపారు.

మహమ్మారుల సన్నద్ధతపై సహకారం పెంపు

న్యూఢిల్లీ,: భవిష్యత్తులో కొవిడ్ లాంటి మహమ్మారులు వచ్చినా వాటిని ఎదుర్కొనే సన్నద్ధతపై అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్), ప్రపంచ బ్యాంక్ గ్రూప్ (డబ్ల్యూబీజీ), ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) సహకారాన్ని పెంచాయి. ఆరోగ్య విపత్తుల కారణంగా ఎదురయ్యే సవాళ్లు అధిగమించడానికి ఐఎంఎఫ్‌కు చెందిన రిసైలెన్స్ అండ్ సస్టయినబిలిటీ ట్రస్ట్ ద్వారా ఆయా దేశాలకు తక్కువ వడ్డీకి ఆర్థిక సాయం దక్కనున్నది.

బీజేపీకి భంగపాటు!

- హర్యానాలో అధికారం గల్లంతే
- జమ్ము కశ్మీర్‌లోనూ ప్రతిపక్ష స్థానమే
- ఎగ్జిట్ పోల్స్‌లో కమలానికి ఎదురుగాలి

న్యూఢిల్లీ: హర్యానా, జమ్ము కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి ఎదురుదెబ్బ తప్పదని ఎగ్జిట్ పోల్స్ తేల్చాయి. శనివారం హర్యానా అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసిన అనంతరం ఎగ్జిట్ పోల్స్ వెలువడ్డాయి. హర్యానాలో ఈసారి బీజేపీ ఓడిపోబోతున్నదని ఎగ్జిట్‌పోల్స్ తేల్చాయి. కాంగ్రెస్ అధికారం చేపట్టనున్నట్టు అంచనా వేశాయి. ఇక, జమ్ము కశ్మీర్‌లోనూ అధికారంపై బీజేపీ ఆశలు పెట్టుకున్నప్పటికీ ఆ పార్టీ ప్రతిపక్ష స్థానానికే పరిమితం అవుతుందని ఎగ్జిట్ పోల్స్ తేల్చాయి. ఇక్కడ కాంగ్రెస్ - నేషనల్ కాన్ఫరెన్స్ కూటమి అధికారంలోకి రానున్నట్టు పలు సంస్థలు అంచనా వేయగా, హంగ్ ఏర్పడే అవకాశం ఉందని ఇంకొన్ని ఎగ్జిట్ పోల్స్ పేర్కొన్నాయి.

హర్యానా ఎగ్జిట్ పోల్స్

సంస్థ	బీజేపీ	కాంగ్రెస్	జేజేపీ	ఐఎన్ఎల్డీ	ఆప్	ఇతరులు
దైనిక్ భాస్కర్	19-29	44-54	0-1	1-5	0-1	4-9
యాక్సిస్ మై ఇండియా	18-28	53-65	0	1-5	0	3-8
ఇండియాటుడే -సీ ఓటర్	20-28	50-58	0-2	0	0	10-14
రిపబ్లిక్ భారత్-మ్యాట్రిజ్	18-24	55-62	0-3	3-6	0	2-5

జమ్ము కశ్మీర్ ఎగ్జిట్ పోల్స్

సంస్థ	బీజేపీ	కాంగ్రెస్-ఎన్సీ	పీడీపీ	ఇతరులు
దైనిక్ భాస్కర్	20-25	35-40	4-7	12-16
ఇండియాటుడే-సీ ఓటర్	27-32	40-48	6-12	6-11
యాక్సిస్ మై ఇండియా	24-34	35-45	4-6	8-23



హర్యానా ఎన్నికల్లో 65 శాతం పోలింగ్

హర్యానా అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ శనివారం ముగిసింది. మొత్తం 90 నియోజకవర్గాలకు ఉదయం 7 గంటల నుంచి రాత్రి 6 గంటల వరకు ఓటింగ్ జరిగింది. దాదాపు 65 శాతం పోలింగ్ నమోదైంది. బీజేపీ, కాంగ్రెస్ మధ్య ప్రధాన పోటీ నెలకొన్నది. ఆమ్ ఆద్మీ పార్టీ, ఐఎన్ఎల్‌డీ - బీఎస్పీ కూటమి, జేజేపీ - ఆజాద్ సమాజ్ పార్టీ కూటమి కూడా పోటీలో ఉన్నాయి. అక్టోబరు 8న కౌంటింగ్ జరగనుంది.

లెబనాన్‌పై కొనసాగిన దాడులు

హమాస్ అధికారి హతం

జెరూసలేం, అక్టోబర్ 5: ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో హమాస్ అధికారి సయీద్ అతల్లా అలీ హతమయ్యాడు. ఉత్తర లెబనాన్‌లో ఓ శరణార్థి క్యాంప్‌పై జరిపిన వైమానిక దాడుల్లో అతడితోపాటు కుటుంబ సభ్యులంతా మరణించినట్టు హమాస్ శనివారం ప్రకటించింది. శనివారం ఉదయం లెబనాన్‌పై ఇజ్రాయెల్ 12 వైమానిక దాడులతో విరుచుకుపడింది. వైమానిక దాడుల్లో సిరియా, లెబనాన్‌ను కలిపే ప్రధాన రహదారి ధ్వంసమైంది. హెజ్బొల్లాను పూర్తిగా తుదముట్టించేందుకు ఇజ్రాయెల్ సైన్యం సిద్ధమవుతున్నది. లెబనాన్‌లోకి ఇజ్రాయెల్ పదాతి దళం రంగంలోకి ప్రవేశించనున్నదని, మంగళవారం నుంచి లెబనాన్‌లోకి అడుగుపెట్టబోతున్నదని తెలిసింది. అక్టోబర్ 7 దాడుల తర్వాత లెబనాన్ సరిహద్దు వెంబడి ప్రతిరోజూ హెజ్బొల్లా, ఇజ్రాయెల్ మిలటరీకి మధ్య కాల్పులు జరుగుతున్నాయి. యుద్ధంలో ఇప్పటివరకు 41 వేల మంది ప్రాణాలు కోల్పోయారని, ఇందులో సగం మంది మహిళలు, చిన్నారులే ఉన్నారని స్థానిక అధికారులు చెబుతున్నారు.

మొరాయించిన ఇండిగో సాంకేతిక వ్యవస్థ

విమానాశ్రయాల్లో ప్రయాణికుల అవస్థలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 5: దేశ వ్యాప్తంగా ఇండిగో విమాన ప్రయాణికులు శనివారం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. వెబ్‌సైట్ ద్వారా టిక్కెట్లు బుక్ కాలేదు. టిక్కెట్లు తీసుకున్న వారు గంటల కొద్దీ చెక్‌ఇన్‌ల కోసం వేచి చూడాల్సి వచ్చింది. వ్యవస్థల్లో ఏర్పడిన భారీ సాంకేతిక లోపం కారణంగా దేశ వ్యాప్తంగా ఇండిగో విమాన సర్వీసులకు అటంకం కలిగింది. దేశవ్యాప్తంగా తమ నెట్‌వర్క్ తాత్కాలికంగా నిలిచిపోవడంతో తమ వెబ్‌సైట్, బుకింగ్ వ్యవస్థలపై ప్రభావం చూపిందని, దీని కారణంగా తమ ప్రయాణికులు ఎక్కువసేపు వేచి చూడాల్సి వచ్చిందని ఇండిగో ఎయిర్‌లైన్స్ ఒక ప్రకటనలో తెలిపింది. మధ్యాహ్నం 12 గంటలకు సమస్య ఏర్పడగా, ఒంటి గంటకు దానిని పునరుద్ధరించామని. అయినప్పటికీ పలుసార్లు సాంకేతిక సమస్యలు తలెత్తాయని చెప్పారు. అయితే ఈ సమస్య ఎప్పటికి సరిచేస్తారన్న విషయాన్ని వారు తెలియజేయలేదు.

బాలిక అనుమానాస్పద మృతి

పశ్చిమ బెంగాల్‌లో ఉద్రిక్తత

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లోని దక్షిణ 24 పరగణాల జిల్లా జైనగర్ ప్రాంతంలో నాలుగో తరగతి చదువుతున్న బాలిక అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. బాలిక ట్యూషన్ నుంచి తిరిగి వస్తుండగా ఓ దుండగుడు కిడ్నాప్ చేసి, అత్యాచారానికి పాల్పడి ఉంటాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఓ వ్యక్తి రెండు రోజులుగా బాలికకు ఐస్‌క్రీమ్ ఇస్తూ ఆమెతో స్నేహం చేసేందుకు ప్రయత్నించాడని తెలిపారు. అతడే శుక్రవారం బాలికకు లిఫ్ట్ ఇచ్చి గుర్తు తెలియని ప్రదేశానికి తీసుకెళ్లాడని తెలిపారు. శనివారం బాలిక మృతదేహం లభ్యం కావడంతో స్థానికులు ఆగ్రహానికి గురయ్యారు. బాలిక అదృశ్యంపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపిస్తూ ఆందోళనకు దిగారు. మహిస్మరి పోలీస్ ఔట్‌పోస్ట్‌కు నిప్పు పెట్టారు. పోలీసు వాహనాలను ధ్వంసం చేశారు. స్థానికులను శాంతింపజేసేందుకు వచ్చిన కుల్తలి తృణమూల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే గణేష్ మండల్‌ను స్థానికులు తరిమేశారు. బాలిక మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించిన హాస్పిటల్‌కు వచ్చిన తృణమూల్ ఎంపీ ప్రతిమ మండల్‌కు వ్యతిరేకంగా ప్రజలు నినాదాలు చేశారు.

మా సహనం నశించింది

వలస కార్మికులకు రేషన్ కార్డుల జారీలో జాప్యంపై సుప్రీం కోర్ట్

న్యూఢిల్లీ: వలస కార్మికులకు రేషన్ కార్డులు మంజూరు చేయడంలో జాప్యం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంతాల యంత్రాంగంపై సుప్రీంకోర్టు అసంతృప్తిని వ్యక్తం చేసింది.ఈ-శ్రామ్ పోర్టల్‌లో నమోదైన వలస కార్మికులందరికీ రేషన్ కార్డులు ఇచ్చే అంశాన్ని జస్టిస్ సుధాంశు ధులియా, జస్టిస్ అహ్సనుద్దీన్ అమానుల్లా విచారించారు. 'మేము సహనాన్ని కోల్పోయాం. నవంబరు 19 నాటికి అమలు చేయకపోతే మీ కార్యదర్శులు కోర్టుకు హాజరు కావాల్సి ఉంటుంది' అని అన్నారు.

బుర్కినా ఫాసోలో 600 మంది ఊచకోత!

న్యూఢిల్లీ, అక్టోబర్ 5: ఆఫ్రికా దేశం బుర్కినా ఫాసోలో మిలిటెంట్, జిహాదీ గ్రూపులు మునుపెన్నడూ లేనంతగా మారణహోమం సృష్టిస్తున్నాయి. మహిళలు, చిన్నారులు, వృద్ధులు అన్న విచక్షణ లేకుండా గ్రామాల్లోకి చొరబడి కాల్పులకు తెగబడుతున్నాయి. ఇటీవలి మిలిటెంట్ల కాల్పుల్లో 600 మందికిపైగా అమాయక పౌరులు ప్రాణాలు కోల్పోయారని ఫ్రెంచ్ ప్రభుత్వ రక్షణ ఏజెన్సీ శనివారం అంతర్జాతీయ మీడియాకు తెలిపింది.

తెలంగాణలో రుణమాఫీ ఎగ్గొట్టిన కాంగ్రెస్

- అట్టడుగు వర్గాలపై ఆ పార్టీ నిర్లక్ష్యం
- మహారాష్ట్రలో ప్రధాని మోదీ విమర్శ

నాగ్‌పూర్, అక్టోబర్ 5: కాంగ్రెస్ పార్టీ బంజారాలతో పాటు అట్టడుగు వర్గాలను, రైతులను నిర్లక్ష్యం చేసిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విమర్శించారు. మహారాష్ట్రలోని విదర్భలో శనివారం జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడారు. ప్రతి ఎన్నికల్లో రుణమాఫీ చేస్తామంటూ బూటకపు హామీలు ఇవ్వడం కాంగ్రెస్ పార్టీకి అలవాటేనని ప్రధాని మోదీ ఆరోపించారు. తెలంగాణలో కూడా రైతుల రుణ మాఫీ చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చి ఇన్ని రోజులైనా రైతుల రుణాలు మాఫీ కాలేదని అన్నారు. దీంతో రైతులు ఇప్పుడు రుణ మాఫీ కోసం కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారని చెప్పారు. రైతులను కాంగ్రెస్ గౌరవించదని, వారి అవసరాలను పట్టించుకోదని అన్నారు. డ్రగ్స్ వ్యాపారంలో కాంగ్రెస్‌కు సంబంధాలున్నాయని, ఢిల్లీలో దొరికిన డ్రగ్స్ కేసులో కాంగ్రెస్ నేత పాత్ర ఉందని ఆరోపించారు.

బెంగాల్‌లో జూనియర్ వైద్యుల నిరాహార దీక్ష

మమత సర్కారు డిమాండ్లను పరిష్కరించనందుకే

కోల్‌కతా, అక్టోబర్ 5: పశ్చిమ బెంగాల్‌లో జూనియర్ డాక్టర్లు మరోసారి నిరసనను ప్రారంభించారు. ప్రభుత్వం తమ డిమాండ్లను పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ ఆరుగురు జూనియర్ డాక్టర్లు శనివారం నిరాహార దీక్షకు దిగారు. ఆర్జీ కర్ హాస్పిటల్‌లో జూనియర్ వైద్యురాలి హత్యాచార ఘటనకు నిరసనగా జూనియర్ డాక్టర్లు దాదాపు నెల రోజులు విధులు బహిష్కరించి ఆందోళన చేసిన సంగతి తెలిసిందే. వీరి డిమాండ్లు పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ హామీ ఇవ్వడంతో ఇటీవల ఆందోళనను విరమించి విధుల్లో చేరారు. అయితే, ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం తమ డిమాండ్లు పరిష్కరించడం లేదని జూనియర్ డాక్టర్లు ఆరోపిస్తున్నారు. డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వానికి 24 గంటల నోటీసు ఇచ్చామని, ప్రభుత్వం స్పందించకపోవడంతోనే నిరాహార దీక్ష చేస్తున్నట్టు పశ్చిమ బెంగాల్ జూనియర్ వైద్యుల ఫ్రంట్ తెలిపింది.

టాటా పంచ్ స్పెషల్ ఎడిషన్

ధర రూ.8.44 లక్షలు



ముంబై, అక్టోబర్ 5: టాటా మోటర్స్.. తాజాగా టాటా పంచ్‌ని ప్రత్యేక ఎడిషన్‌గా విడుదల చేసింది. నూతన గ్రీన్ కలర్‌తో తీర్చిదిద్దిన ఈ కామో మాడల్ ప్రారంభ ధర రూ.8,44,900గా నిర్ణయించింది. ఈ ధరలు ఢిల్లీ షోరూంనకు సంబంధించినవి. టాటా మోటర్ వెబ్‌సైట్‌లో ఈ మాడల్‌ను బుకింగ్ చేసుకోవచ్చునని తెలిపింది

కమీషన్ కొట్టు.. సబ్సిడీ పట్టు!

పరిశ్రమల సబ్సిడీల విడుదలలో దళారుల దాదాగిరి

8 శాతం వరకు కమీషన్ వసూలు చేస్తున్న వైనం

సీనియారిటీతో పనిలేకుండానే బకాయిల విడుదల

రూ. 3,500 కోట్ల వరకు పెండింగు బకాయిలు



హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో నూతన పరిశ్రమను ఏర్పాటుకు సంబంధించి మీకు రావాల్సిన సబ్సిడీలు పెండింగులో ఉన్నాయా..! అయితే చింతించాల్సిన అవసరం లేదు. సబ్సిడీ ఎప్పటి నుంచైనా ఉండని.. మీరు అమ్యమ్యాలు ముట్టచెప్పితే సరిపోతుంది..మీకన్నా ముందు సబ్సిడీ అందుకోవాల్సిన వారు ఎంత మందైనా ఉండని ముందు మీ బ్యాంక్ ఖాతాలో సబ్సిడీలు జమవుతాయి. అయితే ఇందుకోసం మీరు ఆర్థిక మంత్రిత్వ శాఖలో పలుకుబడి ఉన్న దళారులకు 7 శాతం నుంచి 8 శాతం వరకు ముట్టజెప్పాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఈ విషయం పరిశ్రమ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. సబ్సిడీ పొందాలంటే కమీషన్ ఇచ్చుకోవాల్సిందేనని వారు అల్టిమేటం జారీ చేస్తున్నారు. లేకపోతే మీ నంబర్ రావడానికి ఎన్ని రోజులైనా వేచి చూడకతప్పని పరిస్థితి. లంచాలు ఇచ్చుకోలేని చిన్న, చితక సంస్థల యజమానులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అసలే ఆర్థిక కష్టాలతో నత్తనడకన సాగుతున్న వ్యాపారాలకు సబ్సిడీ చెల్లించకపోకపోవడంతో కొన్ని పరిశ్రమలు మూతపడ్డాయి కూడా. అసలే సబ్సిడీ అంతంత మాత్రంగానే ఉండగా..ఆపై కమీషన్ల రూపంలో మరో 8 శాతం వరకు చెల్లిస్తే తమకు మిగిలేది ఏమీ ఉండదని వారు వాపోతున్నారు. ఇందుకు సంబంధించి కొన్ని వివరాలు..

- *నగర శివార్లలోని ఓ పారిశ్రామికవేత్తకు రావాల్సిన రూ. 30 లక్షల సబ్సిడీ రెండేండ్లుగా పెండింగ్‌లో ఉంది. ఈ సబ్సిడీ వస్తదని ముందుగానే ఊరంతా అప్పులు చేశారు. చివరకు ఇటు సబ్సిడీ రాలేదు..మరోవైపు అప్పులపై వడ్డీలు భారీగా పెరిగాయి. చివరకు చేసేదేమి లేకపోవడంతో మధ్య దళారీని కలుసుకొని 7 శాతం కమీషన్ ఇస్తానని మాట్లాడుకున్నారు. ఒప్పందం ప్రకారం సదరు దళారీకి ముందే చెక్కులు ఇచ్చాడు. పక్షం రోజుల్లో తనకు రావాల్సిన సబ్సిడీ తన ఖాతాలో జమైంది. ఆ వెంటనే దళారీకి నగదు ఇచ్చి తన చెక్కులు వాపస్ తీసుకున్నాడు.*
- ***నగరానికి కూతవేటు దూరంలో ఉన్న ఓ పారిశ్రామికవాడలో యూనిట్ ఏర్పాటుచేసుకున్న మరో పారిశ్రామికవేత్తకు రూ. 20 లక్షల సబ్సిడీ మూడేండ్లుగా పెండింగ్‌లో ఉంది. సదరు వ్యాపారవేత్త దళారితో మాట్లాడుకొని 8 శాతం కమీషన్ ఇచ్చేందుకు ఒప్పుకున్నాడు. అడ్వాన్స్‌గా రూ. 50 వేలు సమర్పించుకున్నాడు. పది రోజుల్లో సబ్సిడీ విడుదలైంది. అనంతరం మిగిలిన మొత్తాన్ని కూడా ఇచ్చాడు.***

ఇవి మచ్చుకి కొన్ని మాత్రమే. 'నాకు తెలిసిన ఐదుగురు పారిశ్రామికవేత్తలకు గత మూడు–నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సబ్సిడీ ఇటీవలే విడుదలయ్యాయి. దళారీలతో ఎంతో సులభంగా, వేగవంతంగా సబ్సిడీలు అందుకోవచ్చును. రావాల్సిన సబ్సిడీ అధికంగా ఉంటే ఎక్కువ మొత్తం చెల్లించాల్సి ఉంటుందని' అని ఓ పారిశ్రామికవేత్త పేర్కొన్నాడు. టీఎస్ ఐపాస్ చట్టంలో భాగంగా టీ–ఐడియా, టీ–ప్రైడ్ స్కీమ్‌లకు సంబంధించి కొంతకాలంగా సుమారు రూ. 3,500 కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. బకాయిలన్నీ విడుదల చేస్తామని సీఎం సహ మంత్రులు వివిధ సందర్భాల్లో ప్రకటించినప్పటికీ అది సాకారం కాలేదు. ఈ నేపథ్యంలో దొంగచాటుగా సబ్సిడీ బకాయిలు విడుదల చేసుకోవచ్చునని పరిశ్రమ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతున్నది. ఆర్థిక శాఖకు చెందిన ప్రముఖులతో సంబంధాలున్న కొందరు దళారులు ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. అయితే, ఇందులో ఆరోపణలకు తావులేకుండా ఉండేందుకు తెలంగాణ ఇండస్ట్రియల్ హెల్త్ క్లినిక్ లిమిటెడ్(టీఐహెచ్‌సీఎల్)ను పావుగా వాడుకుంటున్నట్లు సమాచారం. నష్టాల్లో కూరుకుపోయిన యూనిట్లను అధ్యయనం చేసి వాటిని కొనసాగించే విధంగా తగిన సూచనలు, సలహాలు ఇచ్చేందుకు టీఐహెచ్‌సీఎల్‌ను గతంలో ఏర్పాటు చేశారు. కాగా, సబ్సిడీ బకాయిలు విడుదల చేసేందుకుగాను ముందుగా టీఐహెచ్‌సీఎల్ నుంచి నష్టాల్లో ఉన్నట్లు ధృవపత్రం పొంది, దాని ఆధారం చేసుకొని సబ్సిడీలు విడుదల చేస్తున్నట్లు తెలిసింది. సహజంగా రాయితీలు సీనియారిటీ ఆధారంగా విడుదల చేస్తారు. దీని ప్రకారం ముందుగా పరిశ్రమ పెట్టుకున్నవారికి ముందుగా సబ్సిడీ విడుదల చేయాల్సి ఉంటుంది. అయితే, ఈ దళారుల దందాలో సీనియారిటీతో పనిలేకుండానే సబ్సిడీలు విడుదలవుతుండటం విశేషం. ఎంతోమంది మూడు–నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్నవారిని కాదని, ఇటీవలే పరిశ్రమ ఏర్పాటు చేసుకున్న వారికి కూడా సబ్సిడీలు అందుతుండటం విశేషం. బకాయిల వివరాలను ఇదివరకే పరిశ్రమల శాఖ ప్రభుత్వానికి పంపింది. పరిశ్రమల శాఖలోని కొందరు అధికారులు కూడా దళారులతో కుమ్మక్కై సబ్సిడీల విడుదలలో కీలకపాత్ర పోషిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

రాయితీలు ఇలా..

రాష్ట్రంలో పరిశ్రమలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో గత కేసీఆర్ ప్రభుత్వం పెద్ద ఎత్తున రాయితీలు ఇచ్చింది. టీ–ఐడియా కింద జనరల్ కేటగిరికి, టీ–ప్రైడ్ కింద ఎస్సీ, ఎస్టీ ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు సబ్సిడీ ఇవ్వనున్నట్లు గత ప్రభుత్వం ప్రకటించింది. టీ–ఐడియా కింద భూమిని కొనుగోలు చేసినవారికి 100 శాతం స్టాంప్ డ్యూటీ రీయింబర్స్‌మెంట్‌తోపాటు భూమి విలువలో 25 శాతం(గరిష్ఠంగా రూ.10 లక్షలు) రాయితీ, సొంత భూమిలో యూనిట్ పెట్టుకునేవారికి కన్వర్షన్ చార్జీల్లో 25 శాతం(గరిష్ఠంగా రూ.10 లక్షలు) రాయితీ ఇచ్చేవారు. దీంతోపాటు ఐదేండ్లపాటు రూపాయికే విద్యుత్ సరఫరా, దీనికి సంబంధించి చెల్లింపులు జరిపిన వారికి రీయింబర్స్‌మెంట్ కింద 15 శాతం పెట్టుబడి రాయితీ(గరిష్ఠంగా రూ.20 లక్షలు), ఐదేండ్లపాటు వ్యాట్, ఎస్‌జీఎస్టీ మాఫీ చేయనున్నారు. అలాగే ఐదేండ్లపాటు పావలావడ్డీ పథకం కింద చెల్లించిన వారికి రీయింబర్స్‌మెంట్ చేసుకునే అవకాశం కూడా కల్పించింది. ఎస్సీ, ఎస్టీల కోసం ప్రవేశపెట్టిన టీ–ప్రైడ్ కింద కూడా పెట్టుబడి రాయితీ 35 శాతం (గరిష్ఠంగా రూ.75లక్షలు) రాయితీ ఉంది. దీంతోపాటు మహిళలకు మరో ఐదు శాతం అదనంగా రాయితీలు లభించనున్నాయి.

మహారాష్ట్రలో మేఘా సోలార్ ప్లాంట్

హైదరాబాద్, అక్టోబర్ 5: మహారాష్ట్రలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటు చేస్తున్న 404 సోలార్ విద్యుత్ ప్లాంట్లతో 1,880 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయనున్నట్లు మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ ప్రకటించింది. ఈ విద్యుత్‌ను రాష్ట్రంలో తొమ్మిది జిల్లాల్లో ఉన్న రైతులకు తమ వ్యవసాయ అవసరాల నిమిత్తం వినియోగించుకోనున్నారు. ఈ సందర్భంగా మెయిల్ ఇంధన విభాగ చీఫ్ ఆపరేటింగ్ అధికారి శ్రీధర్ మాట్లాడుతూ..రైతుల జీవితాల్లో వెలుగులు నింపాలనే ఉద్దేశంతో ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

పెరగనున్న సిమెంట్ ధరలు!



న్యూఢిల్లీ, అక్టోబర్ 5: సిమెంట్ ధరలు భగ్గుమనే అవకాశాలనున్నాయి. గత కొన్ని రోజులుగా నిలకడ స్థాయిలో ఉన్న ధరలు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడు, నాలుగో త్రైమాసికాల్లో వీటి ధరలు పెంచేందుకు కంపెనీలు సిద్ధమవుతున్నాయని సెంట్రమ్ నివేదిక వెల్లడించింది. తొలి ఆరు నెలల్లో అత్యధికంగా వర్షాలు కురియడంతో డిమాండ్ భారీగా పడిపోయిందని, రెండో అర్ధభాగం నాటికి డిమాండ్ 5 శాతంగా ఉంటుందని, దీంతో కంపెనీలు సిమెంట్ ధరలను పెంచేందుకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపింది. సార్వత్రిక ఎన్నికల తర్వాత కొత్తగా ఏర్పడిన ప్రభుత్వ వ్యయాలు ఆలస్యం కావడం, రుతుపవనాల ప్రభావంతో ఈ ఏడాది అత్యధికంగా వర్షాలు కురియడం డిమాండ్‌పై పిడుగు పడినట్లు అయింది. దక్షిణాదితోపాటు ఉత్తర, సెంట్రల్ ప్రాంతాల్లో సిమెంట్‌కు డిమాండ్ లేకపోవడంతో ఏడాది ప్రాతిపదికన డిమాండ్ 20 శాతం వరకు పడిపోయిందని తెలిపింది. ఇదే సమయంలో భవిష్యత్తులో డిమాండ్ ఉంటుందన్న అంచనాతో కంపెనీలు తమ ప్లాంట్ల సామర్థ్యాన్ని భారీగా పెంచుకున్నాయి కూడా.

ఈ-కామర్స్ సంస్థలపై ఓరా ఆగ్రహం

న్యూఢిల్లీ, అక్టోబర్ 5: అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌పై సౌత్ ఇండియా ఆర్గనైజ్డ్ రిటైలర్స్ అసోసియేషన్(ఓరా) ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ రెండు సంస్థలు వ్యవహరిస్తున్న తీరును తప్పుపట్టింది. పోటీ వ్యతిరేక విధానాలు పాటిస్తుంచడంతోపాటు చట్ట విరుద్ధమైన పద్ధతులను అవలంభిస్తున్నాయని ప్రధానంగా ఆరోపిస్తున్నాయి. ముఖ్యంగా రిటైల్ సంస్థలు, చిన్న రిటైలర్లు, దేశవ్యాప్తంగా పోటీ లేకుండా ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించడాన్ని తప్పుపడుతున్నారు. కాంపిటేషన్ యాక్ట్ 2002 చట్టాలను ఈ రెండు సంస్థలు పట్టించుకోవడం లేదు.



ఆర్బీఐ డిప్యూటీ గవర్నర్ రాజేశ్వర్ రావు పదవీకాలం పొడిగింపు

న్యూఢిల్లీ, అక్టోబర్ 5: రిజర్వుబ్యాంక్ డిప్యూటీ గవర్నర్ రాజేశ్వర్ రావు పదవీకాలాన్ని ఏడాది పొడిగించింది కేంద్ర ప్రభుత్వం. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన ది అపాయింట్‌మెంట్స్ కమిటీ ఆఫ్ ది క్యాబినెట్(ఏసీసీ) సమావేశమై రాజేశ్వర్ పదవీకాలాన్ని అక్టోబర్ 9, 2024 నుంచి మరో ఏడాది పాటు ఈ పదవిలో కొనసాగేందుకు అనుమతినిచ్చింది. ఆర్బీఐ డిప్యూటీ గవర్నర్‌గా అక్టోబర్ 2020లో మూడేండ్ల కాలపరిమితితో నియమితులయ్యారు. ఇప్పటికే ఆయన పదవీకాలాన్ని రెండు సార్లు పొడిగించారు. 1984లో సెంట్రల్ బ్యాంక్‌లో చేరారు.

ఆర్బీఐ ఈడీగా అవిరల్ జైన్

ఆర్బీఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ)గా డాక్టర్ అవిరల్ జైన్ నియమితులయ్యారు. ఈడీగా పదోన్నతి పొందడానికి ముందు జైన్ మహారాష్ట్రకు ప్రాంతీయ డైరెక్టర్‌గా సేవలందించారు. అవిరల్ జైన్‌కు కరెన్సీ నిర్వహణ, విదేశీ మారకం నియంత్రణ, పర్యవేక్షణ, మానవ వనరుల నిర్వహణ వంటి విభాగాల్లో 30 ఏండ్లకు పైగా అనుభవం ఉన్నది.

ప్రాతః స్మరామి లలితా వదనారవిందం
బింబాధరం పృథుల మౌక్తికశోభినాసమ్।
ఆకర్ణ దీర్ఘనయనం మణికుండలాఢ్యం
మందస్మితం మృగమదోజ్జ్వల ఫాలదేశమ్॥

లలితా త్రిపుర సుందరీదేవి

త్రిపురాత్రయంలో లలితా త్రిపురసుందరీదేవి రెండో దేవత. త్రిగుణాతీతమైన కామేశ్వర స్వరూపంలో, సకల లోకాతీత కోమలత్వంతో ప్రకాశిస్తుంది. లలితాదేవి.. మణిద్వీప నివాసిని. సకల సృష్టి, స్థితి, సంహార కారిణి. శ్రీవిద్యా స్వరూపిణి. ఉపాసకులకు ముఖ్య ఆరాధ్య దేవత. 'చిదగ్నికుండ సంభూతా' అంటుంది లలితా సహస్రనామం. 'చిత్' అంటే చైతన్యం. చైతన్యం అనే అగ్నికుండం నుంచి అమ్మ ఆవిర్భవించింది. సకల విశ్వ చైతన్య శక్తి స్వరూపం శ్రీచక్రం. ఈ శ్రీచక్రానికి అధిష్ఠాన దేవత లలితా త్రిపురసుందరి. కోటి సూర్యుల ప్రకాశంతో సమానమైన కాంతి స్వరూపంతో, చేతిలో పాశం, అంకుశం, చెరకు విల్లు, పూల బాణాలు ధరించి దర్శనమిస్తుంది. లక్ష్మి, సరస్వతి ఇరువైపులా నిల్చుని వింజామరలతో వీస్తూ అమ్మను సేవిస్తుంటారు. లలితా ఉపాసనతో దారిద్ర్యం నశిస్తుంది. సకల ఐశ్వర్యాలు సిద్ధిస్తాయి. అమ్మకు పులిహోర, వడలు, పాయసం నివేదన చేయాలి.



అట్ల బతుకమ్మ

తొమ్మిది రోజులు బతుకమ్మకు పెట్టే ప్రసాదాల్లో నవధాన్యాలు వచ్చేట్టుగా చూడాలంటారు. అటుకుల రూపంలో బియ్యం, ముద్ద పప్పులో కందులు, పెసరపప్పు నివేదిస్తారు. ఇలా సమర్పించే నైవేద్యాలు ఔషధ గుణాలు కలిగి ఆరోగ్యాన్నీ ప్రసాదిస్తాయి. అట్ల బతుకమ్మ సందర్భంగా పెసర్లు, బియ్యంతో చేసిన అట్లు నివేదిస్తారు. సాధారణంగా అట్లు ఎక్కువగా మినుములతో చేసుకుంటారు. మినుముల్లో మాంసకృతులు ఎక్కువగా ఉంటాయి. బలవర్ధకమైన ఆహారమే అయినా ఎక్కువగా వాడితే బుద్ధి మాంద్యం ఏర్పడుతుంది. పెసర్లు జీర్ణశక్తిని పెంచుతాయి. జ్ఞాపకశక్తిని పెంపొందిస్తాయి. అందుకే తెలంగాణలో అట్ల బతుకమ్మ సందర్భంగా పెసరపప్పుతో చేసిన అట్లను నైవేద్యంగా పెడుతారు.

● డా॥ ఆర్.కమల







పుణ్యమంతా మనదే! ధన్యతంతా వెండితెరదే!! కృష్ణుణ్ని కండ్లకు కట్టిన ఘనత సినిమాదే! రాముణ్ని మన ముందు నిలిపిన కీర్తి చలన చిత్రానిదే! మహా తపోధనులకు సైతం అర్థం కాని అమ్మవారి తత్త్వాన్ని సామాన్య ప్రేక్షకుడికి అర్థం చేసిందీ సినిమానే! ఎంతలా అంటే.. అది సినిమా అని తెలుసు, అమ్మవారి పాత్రలో నటిస్తున్నది మన లాంటి మనిషనీ తెలుసు! అయినా.. పరాశక్తి సబ్జెక్టుతో సినిమాలు వస్తేచాలు.. థియేటర్ల ముందు వెయ్యినొక్క కొబ్బరికాయలు పగిలేవి. మంగళ హారతులు అఖండ జ్యోతిగా వెలిగిపోయేవి. భక్తి పారవశ్యంలో కొందరికి పూనకాలు వచ్చేవి. ఇదంతా సినిమా మహిమే! అమ్మవారి చిత్రమంటే బొమ్మ హిట్టు అవ్వాల్సిందే!! అంతగా జనం ఆదరించేవారు మరి. అందుకే ఆ ఆదిపరాశక్తి తన భక్తులకే కాదు.. వెండితెరకూ కొంగుబంగారమై విరాజిల్లుతున్నది.

వెండితెర కొంగుబంగారం

సినిమా క్లైమాక్స్‌లో ఉంది. అమ్మవారి గెటప్‌లో ఉన్న కె.ఆర్.విజయ త్రిశూలం చేతబూనింది. ఆమె కళ్లు అగ్నిగోళాల్లా మండుతున్నాయి. నాలుక ఇంతబారు చాపి.. దుర్మార్గుడైన రక్కసుడి గుండెలపై కాళ్లు పెట్టి త్రిశూలంతో ఒక్కపోటు పొడిచింది. వాడి రక్తం ఆమె ముఖంపై చిందింది. నేపథ్యంలో 'అయిగిరి నందిని నందితమేదిని విశ్వ వినోదిని నందినుతే..' అంటూ మహిషాసుర మర్దని స్తోత్రం వినిపిస్తూ ఉంది. ప్రేక్షకులు భయంతో, భక్తితో.. రోమాంచితమై అలా చూస్తూ ఉన్నారు. థియేటర్ అంతా ధీర గంభీరంగా ఉంది. ఇంతలో ముందులైన్‌లో ఏదో కలకలం. ఆమె ఎవరికో పూనకం వచ్చింది. చుట్టూ ఉన్న వాళ్లు అదుపు చేయలేపోతున్నారు. కూర్చున్న జనాలంతా ఒక్కసారిగా పైకి లేచారు. కళ్లముందు జరుగుతున్న కలామటీని ఆశ్చర్యంగా ఎంజాయ్ చేస్తున్నారు కొందరు. ఇంతలో పైలైన్‌లో ఇంకొకరికి పూనకం. బాల్కనీలో ఇద్దరు ముగ్గురు విరుచుకు పడిపోతున్నారు. థియేటర్ యాజమాన్యం అప్పటికే ముందు జాగ్రత్తగా కొబ్బరికాయలు.. కర్పూరం.. గుగ్గిలం.. వేపమండలు సిద్ధం చేసుకొని ఉంది. పూనకాలు మొదలవ్వగానే.. థియేటర్ అంతా గుగ్గిలం పొగతో నింపేశారు. కొబ్బరికాయలు కొట్టి, హారతులు ఇచ్చేస్తున్నారు.. వేపమండలతో వాళ్ల శరీరాలను నిమురుతున్నారు. ఈ హడావిడి సద్దుమణిగేలోపు సినిమాకు శుభం కార్డు పడిపోయింది.

ఇప్పుడైతే.. ఏసీ థియేటర్లు, మల్టీప్లెక్సులు వచ్చేశాయి. జనాలు తెలివి మీరారు. కానీ, ఒకప్పుడు పరిస్థితి వేరు. సౌకర్యాలతో పనిలేదు. అమ్మవారి సినిమా వచ్చిందంటే పూనకాలు లోడ్ అయ్యేవి. అమాయకత్వం, మూఢత్వం, మూర్ఖత్వం.. మూడింటినీ కలగలుపుకొని మరీ ఉండేవారు జనం. అందులో భాగమే ఈ పూనకాలు.. గుగ్గిలాలు. దీనికి సంబంధించిన ఒక ప్రచారం గురించి ఇక్కడ సరదాగా ప్రస్తావించాలి.

అది 1955. అక్కినేని నాగేశ్వరరావు హీరోగా తాపీ చాణక్య దర్శకత్వంలో రూపొందిన 'రోజులు మారాయి' సినిమా విడుదలై థియేటర్లలో ఆడుతున్న రోజులవి. బెజవాడ కనకదుర్గమ్మ కొండ మెట్ల దగ్గర ఓ రాత్రివేళ ఓ రిక్షావాడు బాడుగ కోసం చూస్తూ ఉన్నాడు. ఇంతలో ఓ పెద్దావిడ కొండపై నుంచి దిగి వచ్చింది. అతని రిక్షా ఎక్కి.. ''రోజులు మారాయ్' సినిమా ఆడుతున్న థియేటర్‌కి పోనీయ్ రా..' అన్నది. ఆ రిక్షావాడు ఆమెను థియేటర్‌కి తీసుకెళ్లాడు. ఆమె రిక్షా దిగి, డబ్బులివ్వకుండా థియేటర్లోకి వెళ్లిపోయింది. డబ్బివ్వకుండా వెళ్లిందన్న కోపంతో.. ఆ రిక్షావాడు థియేటర్ ముందే కాపు కాశాడు. సినిమా వదిలారు. ఆ పెద్దావిడా సరాసరి వచ్చి, మళ్లీ అతని రిక్షానే ఎక్కింది. 'ఎక్కడ ఎక్కించుకున్నావో.. అక్కడే దించెయ్యరా..' అన్నది. అతను కోపంతోనే రిక్షా తొక్కుతూ.. ఆమెను కొండ మెట్ల దగ్గర దించాడు. ఆమె మౌనంగా కొండెక్కి వెళ్లి పోతున్నది. అతను పిలుస్తున్నాడు. ఆమె పలకలేదు. అలా వెళుతూ.. వెళుతూ అంతర్ధానమైపోయింది. ఆ రిక్షావాడు చిరాగ్గా తన తలకు చుట్టుకున్న తుండును తీసి విదిల్చాడు. ఆ తుండులో నుంచి నోట్ల కట్టలు పడ్డాయి. జనాల అమాయకత్వానికి ఇదో పరాకాష్ఠ. ఇదే నిజమని ఆ సినిమాకు పోటెత్తారట జనం. అప్పటికే 'రోజులు మారాయి' హిట్ టాక్ తెచ్చుకొని ఆడుతున్నది. 'బెజవాడ దుర్గమ్మ కొండదిగొచ్చి చూసిన సినిమా' అని ప్రచారం జరగడంతో జనాలు ఆ సినిమా థియేటర్లకు క్యూ కట్టారట. జనాల అమాయకత్వాన్ని క్యాష్ చేసుకోవడంలో ఇదో స్ట్రాటజీ.



తదనంతర కాలంలో జనాల సెంటిమెంట్‌ని క్యాష్ చేసుకోవాలనే ఆలోచనలోంచే రకరకాల కథలు పుట్టుకొచ్చాయి. అలా పుట్టిన కథే కె.ఆర్.విజయ నటించిన 'మా ఇలవేల్పు'(1971). ఈ సినిమాకు ముందు అమ్మవారి సినిమాలంటే పౌరాణిక, జానపద తరహాలో ఉండేవి. 'విజయగౌరి', 'శ్రీగౌరీ మహాత్మ్యం', 'కనకదుర్గ పూజామహిమ'.. ఇలా అన్నమాట. 50, 60ల్లో తెరపై అమ్మవారు అంటే.. సర్వమంగళగా, దయాస్వరూణిగా కనిపించేది. 'కార్తవరాయుని కథ', 'జగదేకవీరుడి కథ' చిత్రాల్లో మహానటి కన్నాంబ పార్వతీదేవిగా సాక్షాత్కరిస్తే.. 'చెంచులక్ష్మి'లో మహాలక్ష్మిగా అంజలిదేవి దర్శనమిచ్చింది. ఇక భూదేవి అనగానే చటుక్కున్న గుర్తుకొచ్చే రూపం ఎస్.వరలక్ష్మి. 'లవకుశ'లో భూదేవిగా ఆమె నటన చిరస్మరణీయం. 'దక్షయజ్ఞం'లో సతీదేవిగా దేవిక కనిపిస్తే.. 'ఉమాచండీగౌరీ శంకరుల కథ'లో అమ్మవారి మూడు రూపాల్లో అభినయించి భళా అనిపించుకున్నది బి.సరోజాదేవి. ఇక పద్మావతి అంటే సావిత్రి, సత్యభామ అంటే జమున.. ఇవన్నీ మంగళకరమైన శక్తి రూపాలే.



అయితే.. అమ్మవారిలోని మహిషాసురమర్దని రూపాన్ని తెరపై చూపిస్తే ఎలా ఉంటుంది? అనే ఆలోచన నుంచి పుట్టుకొచ్చిన సినిమానే 'మా ఇలవేల్పు'. జి.వి.ఆర్.శేషగిరిరావు దర్శకుడు. ఇది పౌరాణికం కాదు, జానపదం కాదు. సమకాలీన సమాజంలో అమ్మవారి మహిమల నేపథ్యంలో సాగే ఫిక్షన్ మూవీ. అప్పట్లో ఇదో కొత్త ఆలోచన. థియేటర్లలో పూనకాలు రావడం మొదలైంది ఈ సినిమా నుంచే! కె.ఆర్.విజయ తొలిసారి అమ్మవారిగా తెరపై కనిపించి కూడా ఈ సినిమాతోనే. ఈ చిత్రం విడుదలైన థియేటర్లన్నీ అప్పట్లో దేవాలయాలుగా మారిపోయాయి. ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. 'మా ఇలవేల్పు' తర్వాత కె.ఆర్.విజయ ఇమేజ్ పూర్తిగా మారిపోయింది. ఆమెను మరో హీరో పక్కన హీరోయిన్‌గా చూడటానికి కూడా జనం ఇష్టపడలేదు. అప్పట్నుంచి అమ్మవారి పాత్రకు కె.ఆర్.విజయ పేటెంట్ రైట్ అనిపించుకుంది. 'మా ఇలవేల్పు' ప్రేరణగా ఆ తర్వాత చాలా సినిమాలు వచ్చాయి. అయితే.. 1982లో వచ్చిన 'కదలివచ్చిన కనకదుర్గ' మళ్లీ ఆ రేంజ్ హిట్టయ్యింది. కె.ఎస్.రెడ్డి ఈ చిత్రానికి దర్శకుడు. ఈ సినిమా కథ 'మా ఇలవేల్పు' కథకు దగ్గరగా ఉంటుంది. కానీ.. విజయవాడలో జరిగిన యదార్థగాథ అంటూ అప్పట్లో పబ్లిసిటీ ఊదరగొట్టి, జనాన్ని ఆకర్షించారు. ఇప్పటికీ అది నిజంగా జరిగిన కథ అని నమ్మేవాళ్లు లేకపోలేదు.

ఈ రెండు సినిమాల తర్వాత అమ్మవారి నేపథ్యంగా వచ్చిన చిత్రాల్లో చిరస్థాయిగా నిలిచిపోయేంత చరిత్ర సృష్టించిన సినిమా కోడి రామకృష్ణ 'అమ్మోరు' (1995). గ్రాఫిక్ మాయాజాలంతో జనాన్ని మెస్మరైజ్ చేసిన మూవీ ఇది. కె.విశ్వనాథ్ 'ఉండమ్మా బొట్టుపెడతా'(1968), 'మా ఇలవేల్పు'.. ఈ రెండు కథల్ని కలిపి తయారు చేసిన కథ 'అమ్మోరు'. నిర్మాత శ్యామ్ ప్రసాద్‌రెడ్డి అభిరుచి, రాజీలేని నిర్మాణ విలువలు, కోడి రామకృష్ణ దర్శకత్వ ప్రౌఢి 'అమ్మోరు'ను తెలుగు సినీ చరిత్రలోనే ఓ క్లాసిక్‌గా నిలబెట్టాయి. కథానాయికగా సౌందర్యకు, అమ్మవారిగా రమ్యకృష్ణకు ఎనలేని గుర్తింపును తెచ్చిపెట్టిన సినిమా ఇది. అమ్మవారి సినిమాలు ఎన్ని విడుదలై, విజయాలను అందుకున్నా.. 'మా ఇలవేల్పు', 'కదలివచ్చిన కనకదుర్గ', అమ్మోరు చిత్రాలు మాత్రం ఎప్పటికీ ప్రత్యేకమే!

అమ్మవారి నేపథ్య కథాంశాలతో రూపొంది భారీ విజయాలను అందుకున్న ఇతర సినిమాల విషయానికొస్తే.. తమిళనాడు దివంగత ముఖ్యమంత్రి, నటి జయలలిత నటించిన 'ఆదిపరాశక్తి', ఎస్.వరలక్ష్మి నటించిన 'పరాశక్తి మహిమలు'. కె.ఆర్.విజయ నటించిన 'జై సంతోషి మాత', 'అష్టలక్ష్మీ వైభవం', 'జగన్మాత' చిత్రాలతో పాటు 'శ్రీదేవి కామాక్షి కటాక్షం', 'శ్రీశైల భ్రమరాంబికా మహాత్మ్యం', 'మధుర మీనాక్షి..' ఇలా చాలా సినిమాలు ఉన్నాయి. రీసెంట్‌గా నేటి లేడీ సూపర్‌స్టార్ నయనతార కూడా 'మూకుతీ అమ్మన్' సినిమాలో అమ్మవారిగా మెరిసింది.

చివరిగా చెప్పొచ్చేదేంటంటే.. సమస్త బ్రహ్మాండాలూ అమ్మనుంచే ఉద్భవించాయని శాస్త్రవచనం. అఖిలాండ కోటి బ్రహ్మాండనాయకి అయిన అలాంటి అమ్మ.. తుచ్ఛమైన మానవశరీరంలోకి ప్రవేశిస్తుందనుకోవడం అమాయకత్వమే! రక్షించడానికీ, శిక్షించడానికీ అమ్మ దిగిరావాల్సిన అవసరం లేదు. అమ్మ అంతా వ్యాపించి ఉంటుందనీ, సర్వం శక్తిమయం అనీ తెలిసినా.. ఆ నిజాలు ప్రేక్షకులకు రుచించవ్. అబద్ధాన్నే ఎంజాయ్ చేస్తారు. భక్తి, నమ్మకం నుంచి పుట్టుకొచ్చే భావోద్వేగం అత్యంత శక్తిమంతం. దానికి అడ్డు చెప్పలేం.. అడ్డు కట్ట వేయలేం. సినిమా ఎలా ఉన్నా.. అమ్మ కృపాకటాక్ష వీక్షణాలు మాత్రం అందరిపై సదా ఉంటాయి.

... ✍ బుర్రా నరసింహా

శ్రీ గౌరి నీ పూజ ఉయ్యాలో

శ్రీ గౌరి నీ పూజ ఉయ్యాలో
బంగారు చెంబుల ఉయ్యాలో
జలతారు చీరలు ఉయ్యాలో
చేయబూనితిమమ్మ ఉయ్యాలో
గంగ ఉదకం తెచ్చి ఉయ్యాలో
అద్దాల రవికలు ఉయ్యాలో
కాపాడు మమ్ముల ఉయ్యాలో
కాంత నీ పాదాల ఉయ్యాలో
అద్దాల రవికలు ఉయ్యాలో
కైలాసరాణీ ఉయ్యాలో
కడిగి తరియింతుము ఉయ్యాలో
అమ్మ నీకిచ్చెద ఉయ్యాలో
శంకర పార్వతి ఉయ్యాలో
నీలకంఠపు రాణి ఉయ్యాలో
శంభునిరాణి ఉయ్యాలో
అంబికా నీకిదే ఉయ్యాలో
నీలవేణి రాణి ఉయ్యాలో
శంకర పార్వతి ఉయ్యాలో
అర్ఘ్యంబులిచ్చెద ఉయ్యాలో
ప్రేమ పువ్వుల మాల ఉయ్యాలో
శంభునిరాణి ఉయ్యాలో
ఆకాశగంగతో ఉయ్యాలో
తల్లి నిన్నెప్పుడూ ఉయ్యాలో
ఆదరించుము తల్లి ఉయ్యాలో
నీ కేసి పూజింతు ఉయ్యాలో
ధ్యానింతుమమ్మ ఉయ్యాలో
జలజాక్షి పందిట ఉయ్యాలో
జయము నీకు తల్లి ఉయ్యాలో
కలహంస నడకల ఉయ్యాలో
జలకమాడుమమ్మ ఉయ్యాలో
శుభము మాకు తల్లి ఉయ్యాలో
కలికి రాణివమ్మ ఉయ్యాలో
బంగారు చీరలు ఉయ్యాలో
జయము నీకు తల్లి ఉయ్యాలో
సింహపీఠంబున ఉయ్యాలో
శాంభవి నీకమ్మ ఉయ్యాలో
శుభము మాకు తల్లి ఉయ్యాలో.
చెలియకూర్చుండమ్మ ఉయ్యాలో
జలతారు చీరలు ఉయ్యాలో
అద్దాల రవికలు ఉయ్యాలో


ఆ ఫొటోలు కాల్చేశా

బాలీవుడ్‌లో సంచలనాలకు కేరాఫ్.. అనన్య పాండే! కెమెరా లెన్స్ మాత్రమే కాదు.. మీడియా హెడ్‌లైన్స్ కూడా ఎప్పుడూ ఈ బ్యూటీ మీదే! ఈమె వృత్తి జీవితమే కాదు.. వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఏ విషయమైనా సెన్సేషనే! అనన్య ఏం చేసినా.. సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావాల్సిందే! ఇటీవలే 'కాల్ మీ బే' వెబ్ సిరీస్‌తో మంచిహిట్ అందుకున్నదామె. ప్రస్తుతం 'కంట్రోల్' సినిమా ప్రమోషన్స్‌లో బిజీగా ఉంది. ఈ క్రమంలోనే పలు టీవీ చానళ్లకు ఇంటర్వ్యూలు ఇస్తూ.. తన గురించి ఎన్నో విషయాలను పంచుకున్నది. అవన్నీ ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా తన బ్రేకప్ గురించి చెప్పిన మాటలు.. సోషల్ మీడియాను షేక్ చేస్తున్నాయి. ఆ సమయంలో తన భావోద్వేగాలను ఎలా అదుపు చేసుకున్నదో.. ఆ బాధను ఎలా అధిగమించిన విధాన్ని బయట పెట్టింది. 'జీవితంలో ఏదీ శాశ్వతం కాదనే సత్యాన్ని అప్పుడే గ్రహించాను. కోపంతో నా ఎక్స్ బాయ్‌ఫ్రెండ్ ఫొటోలను తగలబెట్టేశాను. నాలో గూడుకట్టుకొన్న నిరాశ – నిస్పృహలను ఈ విధంగా బయటపెట్టుకున్నాను. ఆ సమయంలో 'జబ్ వీ మెట్' చిత్రంలో కరీనాకపూర్ పోషించిన 'గీతూ' పాత్ర నన్ను పూనిందేమో అనిపించింది. ఆ చిత్రంలో గీతూ కూడా ఇలాగే.. బ్రేకప్ నుంచి బయట పడేందుకు విచిత్రమైన మార్గాలను ఎంచుకుంటుంది. తన ఎక్స్ బాయ్‌ఫ్రెండ్ ఫొటోలను కూడా కాల్చేస్తుంది!' అంటూ నాటి సంగతులను గుర్తుచేసుకున్నది అనన్య. ఇక 'స్పెషల్ సాంగ్స్' చేయడానికి తనకు ఎలాంటి అభ్యంతరం లేదని అంటూనే.. అతిగా అందాల ప్రదర్శన మాత్రం ఉండకూడదనీ కండీషన్స్ పెడుతున్నది. కథను నమ్మి 'కంట్రోల్' సినిమా చేశానని చెప్పుకొచ్చింది. తాను ప్రయోగాలకు పెద్దపీట వేస్తాననీ, ప్రయోగాలు చేస్తే.. ఎవరైనా ఇండస్ట్రీలో ఎదుగుతారనీ అంటున్నది. విక్రమాదిత్య దర్శకత్వం వహించిన 'కంట్రోల్' (CTRL) ఇటీవలే ప్రేక్షకుల ముందుకు వచ్చి హిట్ టాక్ సొంతం చేసుకుంది.



'చిత్ర' విచిత్రాల శ్రీవల్లి!

నేషనల్ క్రష్.. రష్మిక! 'బ్లాక్‌బస్టర్ హిట్స్'ను సొంతం చేసుకుంటూ.. తక్కువ కాలంలోనే స్టార్ హీరోయిన్‌గా ఎదిగిపోయింది. ఒకవైపు తీరికలేకుండా సినిమాలు చేస్తున్నా.. సోషల్ మీడియాలోనూ యాక్టివ్‌గా ఉంటుందామె. తనకు సంబంధించిన తాజా ఫొటోలు, వీడియాలను ఎప్పటికప్పుడు షేర్ చేస్తుంది. తాజాగా, ప్రేమను పలురకాలుగా వ్యక్తం చేస్తూ ఫొటోలకు ఫోజులిచ్చింది. వివిధ రకాలుగా లవ్ సింబల్స్ క్రియేట్ చేసి.. తన ఫ్యాన్స్‌పై తనకున్న ప్రేమనంతా వ్యక్తం చేసింది. ఒక్కో ఫ్రేమ్‌కు ఒక్కో లవ్ సింబల్ వచ్చేలా దిగిన ఆ ఫొటోలను ఇన్‌స్టాలో పోస్ట్ చేసింది. 'హృదయాన్ని లక్ష విధాలుగా తయారుచేయగలిగేది నేనొక్కదాన్నే!' అంటూ క్యాప్షన్ కూడా ఇచ్చింది. ఓవైపు ఈ ఫొటోలు వైరల్ అవుతుండగానే.. మరోవైపు రష్మికకు సంబంధించిన ఓ పాత వీడియో సోషల్ మీడియాలో చెక్కర్లు కొట్టేస్తున్నది. తాను బీఏ చదువుతున్నడు ఇచ్చిన ఆడిషన్‌కు సంబంధించిన వీడియో అది. ముద్దుముద్దు మాటలు, ముచ్చటైన యాక్టింగ్‌తోపాటు అదిరిపోయే డ్యాన్స్‌తో ఉన్న ఈ వీడియో.. నెటిజన్లను తెగ అలరిస్తున్నది. ''హాయ్! నేను రష్మిక! వయసు 19. ఎత్తు 5.5. నేను బీఏ రెండో సంవత్సరం చదువుతున్నా!'' అంటూ ఇంట్రో ఇచ్చిన రష్మిక.. ఆ తర్వాత 'మాధురీ దీక్షిత్ ఆజ నాచ్‌లే!' పాటపై స్టెప్పులేసింది. కన్నడలో కొన్ని డైలాగ్స్ చెప్పి అలరించింది. 'పుష్ప–1' తోపాటు 'యానిమల్' చిత్రాలతో ఆలిండియా స్టార్ ర్యాంక్ కొట్టేసిన రష్మిక.. ప్రస్తుతం 'పుష్ప–2'తో బిజీగా ఉన్నది.





ముంబైదే ఇరానీ కప్

27 ఏండ్ల తర్వాత ట్రోఫీ సొంతం

లక్నో: ప్రతిష్ఠాత్మకమైన ఇరానీ కప్‌ను దేశవాళీలో దిగ్గజ జట్టు ముంబై సొంతం చేసుకుంది. ఈ ఏడాది రంజీ చాంపియన్ అయిన ముంబై.. ఇరానీ కప్‌లో రెస్టాఫ్ ఇండియాతో జరిగిన మ్యాచ్‌లో గెలవడం ద్వారా 27 ఏండ్ల తర్వాత ఈ ట్రోఫీని ముద్దాడింది. మ్యాచ్ డ్రాగా ముగిసినప్పటికీ తొలి ఇన్నింగ్స్‌లో ముంబైకి 121 పరుగుల కీలక ఆధిక్యం దక్కడంతో ముంబై విజేతగా నిలిచింది. తొలి ఇన్నింగ్స్‌లో ముంబై 537 పరుగుల భారీ స్కోరు చేయగా రెస్టాఫ్ ఇండియా 416 పరుగులకే ఆలౌట్ అయింది. ఆట ఆఖరి రోజు ముంబై రెండో ఇన్నింగ్స్‌లో 8 వికెట్ల నష్టానికి 329 పరుగుల భారీ స్కోరు చేసి తమ ఆధిక్యాన్ని 450 పరుగులకు పెంచుకుంది. చివరి రోజు ఆ జట్టు లోయరార్డర్ బ్యాటర్ తనుష్ కొటియాన్ (114 నాటౌట్) శతకంతో చెలరేగగా పదో నంబర్ ఆటగాడు మోహిత్ అవస్థి (51) అర్ధ సెంచరీతో రాణించాడు. తొలి ఇన్నింగ్స్‌లో ముంబై తరఫున డబుల్ సెంచరీ సాధించిన సర్ఫరాజ్ ఖాన్ (222 నాటౌట్)కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. 1997-98 సీజన్ తర్వాత ముంబై జట్టు ఇరానీ కప్‌ను గెలవడం ఇదే ప్రథమం.

దివాన్షికి రెండో స్వర్ణం

జూనియర్ వరల్డ్ చాంపియన్‌షిప్



లిమా (పెరూ): ఐఎస్ఎస్ఎఫ్ జూనియర్ వరల్డ్ చాంపియన్‌షిప్‌లో భారత్ స్వర్ణ పతకాల పంట పండిస్తోంది. శనివారం జరిగిన 25 మీటర్ల స్టాండర్డ్ పిస్టోల్ ఈవెంట్‌లో దివాన్షి స్వర్ణం గెలిచింది. ఫైనల్‌లో దివాన్షి 600 పాయింట్లకు గాను 564 పాయింట్లు స్కోరు చేసి అగ్రస్థానంలో నిలిచింది. ఈ టోర్నీలో ఆమెకు ఇది రెండో స్వర్ణం. భారత్‌కే చెందిన పరిషా గుప్త (559) రజతం సాధించగా మాన్వి జైన్ (557) కాంస్యం దక్కించుకుంది. దీంతో ఈ ఈవెంట్‌ను భారత్ క్లీన్ స్వీప్ చేయడం విశేషం. ఇదే పోటీ పురుషుల విభాగంలో సూరజ్ శర్మ 571 పాయింట్లతో స్వర్ణం సాధించగా ముకేశ్ (568)కు కాంస్యం దక్కింది.



క్రమశిక్షణకు మారుపేరు అలెన్: గోపీచంద్

హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ) : ప్రముఖ శిక్షణాసంస్థ అలెన్ కెరీర్ ఇన్‌స్టిట్యూట్ క్రమశిక్షణకు మారుపేరని జాతీయ బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ అన్నారు. ప్రతిభావంతులైన విద్యార్థులు తమ నైపుణ్యాలను మరింతగా సానబెట్టుకునేందుకు అలెన్ మంచి వేదికన్నారు. అలెన్ సంస్థ హైదరాబాద్ నుంచి తమ కార్యకలాపాలను ప్రారంభించిన సందర్భంగా శనివారం నగరంలోని ఓ హోటల్లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో గోపిచంద్ పాల్గొని మాట్లాడారు. హెచ్‌సీఏ అధ్యక్షుడు, అక్షర విద్యాసంస్థల చైర్మన్ జగన్ మోహన్‌రావు మాట్లాడుతూ.. అలెన్-అక్షర విద్యాసంస్థలు కలిసి పనిచేయనున్నాయన్నారు. అలెన్ సంస్థల సీఈవో నితిన్ కుక్రేజా తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆసీస్ శుభారంభం

లంకపై ఘనవిజయం • ఇంగ్లండ్‌ను భయపెట్టిన బంగ్లా



మేగన్ (3/12)

షార్జా: మహిళల టీ20 ప్రపంచకప్‌లో టైటిల్ వేటను డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియా ఘనంగా మొదలుపెట్టింది. తొలి మ్యాచ్‌లోనే కంగారూలు ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. గ్రూప్-ఏలో భాగంగా షార్జా వేదికగా శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో ఆ జట్టు 6 వికెట్ల తేడాతో గెలిచింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న శ్రీలంక.. 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 93 పరుగులు మాత్రమే చేయగలిగింది. నీలాక్షి డి సిల్వ (29) టాప్ స్కోరర్ కాగా హర్షిత మాధవి (23), అనుష్క సంజీవని (16) మాత్రమే రెండంకెల స్కోరు సాధించారు. ఆసీస్ పేసర్ మేగన్ షట్ (3/12) కట్టుదిట్టమైన బంతులతో లంకకు ఆరంభంలోనే చుక్కలు చూపించింది. అనంతరం ఛేదనలో ఆసీస్.. 14.2 ఓవర్లలోనే 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని పూర్తిచేసింది. ఆ జట్టు ఓపెనర్ బెత్ మూనీ (38 బంతుల్లో 43 నాటౌట్, 4 ఫోర్లు) ఆసీస్‌ను విజయతీరాలకు చేర్చింది. లంక బౌలర్లు ఆరంభంలోనే కీలక వికెట్లు పడగొట్టి ఒత్తిడి పెంచినా మూనీ, పెర్రీ (17) నిలకడగా ఆడి ఆసీస్‌కు తొలి గెలుపును అందించారు. మేగన్‌కే 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది.

ఇంగ్లండ్ కష్టమ్మీద..



వ్యాట్ హాడ్జ్ (41)

గ్రూప్-బీలో బంగ్లాదేశ్.. మాజీ చాంపియన్ ఇంగ్లండ్‌ను భయపెట్టింది. ఇరుజట్ల మధ్య షార్జా వేదికగా ఆద్యంతం ఉత్కంఠగా సాగిన లో స్కోరింగ్ థ్రిల్లర్‌లో గెలుపు కోసం బంగ్లా ఆఖరి వరకూ పోరాడినా ఇంగ్లండ్‌నే విజయం వరించింది. ఇంగ్లీష్ జట్టు నిర్దేశించిన 119 పరుగుల స్వల్ప ఛేదనలో బంగ్లాదేశ్.. 20 ఓవర్లలో 97/7 వద్దే ఆగిపోయి 21 పరుగుల తేడాతో అపజయం పాలైంది. ఆ జట్టు యువ బ్యాటర్ సోబన్ మోస్త్రి (44) బంగ్లా గెలుపు ఆశలను మోసింది. కెప్టెన్ నైగర్ సుల్తానా (15)తో కలిసి ఐదో వికెట్‌కు 25 పరుగులు జోడించింది. కానీ సుల్తానా రనౌట్ అవడం బంగ్లా కొంప ముంచింది. ఆ తర్వాత వచ్చిన బ్యాటర్లు విఫలమవడంతో ఆ జట్టుకు ఓటమి తప్పలేదు. ఒకవైపు వికెట్లు పడుతున్నా మోస్త్రి మాత్రం ఒంటరిపోరాటం చేసింది. కానీ చార్లీ డీన్ వేసిన 19వ ఓవర్‌లో మూడో బంతికి ఆమె ఎల్బీడబ్ల్యూగా వెనుదిరగడంతో ఆ జట్టు ఆశలు అడియాసలయ్యాయి. ఇంగ్లండ్ బౌలర్లలో స్మిత్ (2/11), స్పిన్నర్ చార్లి డీన్ (2/22) రాణించారు. అంతకుముం దు మొదట బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్.. జట్టు నిండా టీ20 స్పెషలిస్ట్ హిట్టర్లు ఉన్నప్పటికీ ప్రత్యర్థి స్పిన్నర్ల ధాటికి 20 ఓవర్లలో 118/7కే పరిమితమైం ది. వ్యాట్ హాడ్జ్ (41) మెరుగ్గా ఆడగా మిగిలిన బ్యాటర్లు విఫలమయ్యారు. బంగ్లాదేశ్ బౌలర్లలో ఫాతిమా ఖటూన్ (2/18), రితూ మోని (2/24), నహిదా అక్తర్ (2/32)చెరో రెండు వి కెట్ల చొప్పున పడగొట్టారు.



గచ్చిబౌలిలోని బాలయోగి ఇండోర్ స్టేడియంలో శనివారం ప్రారంభమైన 37వ జాతీయ అండర్-11 పురుషులు, మహిళల చెస్ చాంపియన్ పోటీలు

వన్డే సిరీస్ విజేత సౌతాఫ్రికా

అబుదాబి: ఐర్లాండ్‌తో అబుదాబి వేదికగా జరుగుతున్న మూడు వన్డేల సిరీస్‌ను దక్షిణాఫ్రికా మరో మ్యాచ్ మిగిలుండగానే చేజిక్కించుకుంది. రెండో వన్డేలో సఫారీలు 174 పరుగుల తేడాతో గెలుపొందారు. మొదట బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా.. ట్రిస్టన్ స్టబ్స్ (112) శతకంతో నిర్ణీత 50 ఓవర్లలో 343/4 పరుగుల భారీ స్కోరు చేసింది. ఛేదనలో ఐర్లాండ్ 30.3 ఓవర్లలోనే 169 పరుగులకు ఆలౌట్ అయింది.

అండర్ -19 క్రికెట్ విజేత కరీంనగర్

రన్నరప్‌గా మహబూబ్‌నగర్

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 5: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) సహకారంతో వరంగల్ కేంద్రంగా గత నెల 28 నుంచి అక్టోబర్ 5 దాకా జరిగిన అండర్-19 అంతర్ జిల్లా పోటీల్లో కరీంనగర్ విజేతగా నిలిచింది. ఫైనల్‌లో కరీంనగర్ జట్టు 2 వికెట్ల తేడాతో గెలుపొంది ట్రోఫీని కైవసం చేసుకుంది. మొగిలిచర్ల క్రీడా మైదానంలో జరిగిన ఫైనల్‌లో టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన మహబూబ్‌నగర్.. నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 240 పరుగులు చేసింది. ఆ జట్టులో షాదాబ్ (89) అబ్దుల్ (48) రాణించారు. ఛేదనలో కరీంనగర్.. 49.5 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 2 వికెట్ల తేడాతో విజయాన్ని అందుకుంది. విఘ్నేష్ (53) కరణ్ (50) కరీంగనర్ విజయంలో కీలకపాత్ర పోషించారు. ఈ టోర్నీలో అత్యుత్తమంగా రాణించిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి జట్టు కు ఎం పిక చేయాలని ఆర్గనైజింగ్ కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ హెచ్‌సీఏ అధికారులను కోరారు.



నేటి నుంచే టీ20 పోరు

గ్వాలియర్‌లో భారత్, బంగ్లా తొలి మ్యాచ్



గ్వాలియర్: స్వదేశంలో భారత్ మరో టీ20 సిరీస్‌కు సిద్ధమైంది. ఇటీవలే ముగిసిన రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో బంగ్లాదేశ్‌ను 2-0తో ఓడించి జోరుమీదున్న టీమ్‌ఇండియా.. పొట్టి పోరులోనూ అదే దూకుడు ప్రదర్శించాలనే పట్టుదలతో ఉంది. మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో కొత్తగా పునర్నిర్మించిన శ్రీమంత్ మాధవరావు సింధియా స్టేడియం ఈ మ్యాచ్‌కు ఆతిథ్యమివ్వనుంది. 14 ఏండ్ల తర్వాత ఈ స్టేడియంలో జరుగనున్న తొలి అంతర్జాతీయ మ్యాచ్ ఇదే. త్వరలో న్యూజిలాండ్‌తో టెస్టు సిరీస్ నేపథ్యంలో యశస్వీ జైస్వాల్, శుభ్‌మన్ గిల్, రిషబ్ పంత్, అక్షర్ పటేల్, మహ్మద్ సిరాజ్ వంటి కీలక ఆటగాళ్లకు విరామమిచ్చిన భారత్.. యువ ఆటగాళ్లను పరీక్షించనుంది. నయా పేస్ సంచలనం మయాంక్ యాదవ్, యువ ఆల్ రౌండర్ నితీశ్ రెడ్డి, పేసర్ హర్షిత్ రాణా తొలి టీ20లో అరంగేట్రం చేసే అవకాశముంది. భారత్‌తో పోల్చితే అనుభవజ్ఞులైన ఆటగాళ్లు కలిగిన బంగ్లాదేశ్.. ఆతిథ్య జట్టుకు షాకివ్వాలని ప్రణాళికలు సిద్ధం చేసింది. టెస్టుల మాదిరిగా కాకుండా టీ20లలో దూకుడుగా ఆడతామని ఇప్పటికే ఆ జట్టు సారథి లిటన్ దాస్ భారత్‌కు హెచ్చరికలు కూడా పంపాడు. దిగ్గజ ఆల్ రౌండర్ షకిబ్ అల్ హసన్ రిటైర్మెంట్ తర్వాత ఆ జట్టు ఆడుతున్న తొలి సిరీస్ ఇదే.



దాయాదితో అమ్మాయిలు

మహిళల ప్రపంచకప్‌లో భాగంగా హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని భారత క్రికెట్ జట్టు ఆదివారం దాయాది పాకిస్థాన్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. గ్రూప్-ఏలో సెమీస్ బెర్తును ఖాయం చేసుకోవాలంటే టీమ్ ఇండియాకు నేటి మ్యాచ్ అత్యంత కీలకం కానుంది. దుబాయ్ వేదికగా జరుగబోయే మ్యాచ్ మధ్యాహ్నం 3 గంటలకు మొదలవనుంది. ఈ మ్యాచ్ స్టార్ స్పోర్ట్స్‌లో ప్రసారం కానుంది.

ఆపరేషన్ కగార్‌లో గరుడ దళం!

- మావోయిస్టుల ఏరివేతలో కీలకం
- డ్రోన్లకు స్వస్తి.. గద్దలు, డేగలతో పని
- కాళ్లకు జీపీఎస్ ట్రాకర్లు, మెడకు కెమెరాలు
- మొయినాబాద్‌లో శిక్షణ
- తెలంగాణ ఎస్ఐబీ నుంచే కీలక సమాచారం
- తాజా ఎన్‌కౌంటర్‌లో ఇన్ఫార్మర్లూ హతం?

హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ) : ఒక్కరు కాదు.. ఇద్దరు కాదు.. 9 నెలల్లోనే సుమారు 188 మంది మావోయిస్టులు ఎన్‌కౌంటర్‌లో హతమయ్యారు. వాతావరణం ప్రతికూలంగా ఉన్నా.. కాకులు దూరని కారడవిలోనూ భద్రతా దళాలు లక్ష్యాన్ని ఛేదించగలిగాయి. అందుకు కారణం 'ఈగల్ స్క్వాడ్' అని పలువురు రిటైర్డ్ ఐపీఎస్‌లు చెప్తున్నారు. ఆర్మీ నుంచి తెలంగాణ పోలీసుల వరకు గరుడ దళాన్ని విరివిగా ఉపయోగిస్తున్నారు. పూర్వం లేఖలను పంపేందుకు పావురాలను, గూఢచర్యానికి డేగలను, వేటకు జాగిలాలను, ప్రయాణానికి అశ్వాలను వినియోగించినట్టే.. ఇప్పుడు 'ఆపరేషన్ కగార్'కు 'గరుడ దళం' సహకారం కేంద్ర హోంశాఖ తీసుకుంటున్నది. సంఘ విద్రోహ శక్తుల చర్యలను పసిగట్టేందుకు, రక్షణ, రహస్య ప్రదేశాల్లో ఎగిరే డ్రోన్లను పట్టుకునేందుకు 2020లో రాష్ట్ర ప్రభుత్వం దేశంలోనే తొలిసారిగా గద్దలకు శిక్షణ ఇవ్వాలని నిర్ణయించింది. ఈ క్రమంలో మొయినాబాద్‌లో కొన్ని గద్దలకు ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు. వాటిని మావోయిస్టుల ఏరివేతకు కేంద్ర హోంశాఖ ఉపయోగించిందని పలువురు చెప్తున్నారు.



గరుడ దళం ప్రత్యేకతలివే..

తొలుత నిఘాలో పావురాలకు శిక్షణ ఇద్దామని భావించినా అవి ప్రతికూల వాతావరణంలో ఎగరలేకపోవడంతో డేగలవైపు మళ్లారు. డేగలు తుఫాను సమయంలోనూ మేఘాల కంటే ఎత్తులో వెళ్లి అవి శ్రాంతంగా పనిచేస్తాయి. దీంతో నల్లమల అడవుల్లోంచి రెండేళ్ల వయసున్న డేగ పిల్లలను తెచ్చి వాటికి మొయినాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ ఇంటెలిజెన్స్ ట్రైనింగ్ అకాడమీ (ఐఐటీఏ)లో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. సంఘ విద్రోహక శక్తులు ఉపయోగించే డ్రోన్లను సులభంగా గుర్తించేలా తర్ఫీదునిచ్చారు. అవి రెండు కిలోల దాకా బరువును కూడా కొన్ని కిలోమీటర్ల దూరం వరకు సులభంగా మోసుకురాగలవు. ప్రధాని, ఇతర ప్రముఖుల పర్యటనల సందర్భంగా డ్రోన్లపై నిషేధం ఉంటుంది. అలాంటి సందర్భాల్లో డేగలు నిఘా పెట్టి మరీ ఏవైనా డ్రోన్లు గాల్లోకి ఎగిరితే వాటిని పట్టుకొచ్చి, అధికారులకు అప్పగిస్తాయి. డేగలకు అమర్చే కెమెరాల ద్వారా నిషేధిత, అనుమానిత ప్రాంతాల్లో వ్యక్తుల కదలికలను రికార్డ్ చేస్తుంటారు. ప్రపంచంలో ఇలాంటి డేగలు ఒక్క నెదర్లాండ్స్‌లోనే ఉన్నాయని నాటి డీజీపీ రవిగుప్తా మీడియాకు తెలిపారు.

ఎక్కడ నక్కి ఉన్నా.. పసిగట్టే 'కన్ను'

కేంద్ర ప్రభుత్వం 2026 నాటికి దేశంలో మావోయిస్టు వ్యవస్థ ఉండొద్దనే లక్ష్యంతో చేపట్టిన 'ఆపరేషన్ కగార్'కు తెలంగాణలో శిక్షణ పొందిన, పొందుతున్న గద్దలను వినియోగించినట్టు విశ్వసనీయ సమాచారం. దేశంలోనే తొలిసారిగా తెలంగాణ పోలీసులు ప్రత్యేకంగా ఈగల్ స్క్వాడ్ ను ఏర్పాటు చేసుకున్నారని, ప్రత్యేక శిక్షణ పొందిన గద్దలతో డ్రోన్ దాడులకు చెక్ పెట్టవచ్చని నాటి డీజీపీ రవి గుప్తా ఓ సందర్భంలో చెప్పారు. వాటి కాళ్లకు జీపీఎస్ ట్రాకర్, మెడకు, రెక్కల కింద మైక్రో కెమెరాలు అమర్చినట్టు తెలిసింది. వీటి ద్వారానే మావోయిస్టుల సమాచారం తెలుసుకొని, పథకం ప్రకారం కాల్పులు జరిపారని పలువురు అంటున్నారు. వానకాలం, చలికాలాల్లో వాతావరణం ప్రతికూలంగా ఉన్నా.. పోలీసులు విజయం సాధించడానికి ముఖ్యకారణం గరుడ దళమేనని స్పష్టంచేస్తున్నారు. కొంతకాలంగా కోవర్టు ఆపరేషన్లకు ప్రాధా న్యం ఇస్తున్న భద్రతా బలగాలు.. అదను చూసి ఇన్ఫార్మర్లనూ హతమారుస్తున్నట్టు తెలిసింది. తాజా ఎన్‌కౌంటర్‌లో కొందరు ఇన్‌ఫార్మర్లు కూడా ఉన్నట్టు చెప్తున్నారు.

మావోయిస్టు ఆశన్న మృతి చెందినట్టు పుకార్లు

వెంకటాపూర్, అక్టోబర్ 5: ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం నర్సింగాపూర్‌కు చెందిన మావోయిస్టు కేంద్ర కమిటీ నాయకులు తక్కళ్లపల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్న శుక్రవారం ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందినట్టు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని దంతెవాడ జిల్లా సరిహద్దులో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 40 మంది మావోయిస్టులు మృతి చెందగా, అందులో ఆశన్న ఉన్నట్టు వాట్సాప్ గ్రూపుల్లో చక్కర్లు కొడుతున్నది. ఈ విషయమై ఎస్సై జక్కుల సతీశ్‌ను వివరణ కోరగా.. ఆశన్న మృతిచెందిన విషయం శనివారం రాత్రి వరకు అధికారికంగా ఎలాంటి సమాచారం లేదని చెప్పారు. ఆశన్న.. మాజీ మంత్రి ఎలిమినేటి మాధవరెడ్డి హత్య కేసులో ఆశన్న ప్రధాన నిందితుడని, ఆంధ్రప్రదేశ్ ప్రస్తుత సీఎం నారా చంద్రబాబునాయుడు, మాజీ సీఎం జనార్దరెడ్డిలపై జరిగిన దాడుల్లో ప్రధాన పాత్ర వహించినట్టు గతంలో పోలీసులు ప్రకటించారు.

ఎన్‌కౌంటర్ మృతులు 31 మంది

- మావోయిస్టుల భేటీపై పోలీసులకు సమాచారం
- కూంబింగ్ నిర్వహిస్తుండగా ఎదురుకాల్పులు
- మృతులపై రూ.1.30 కోట్లకు పైనే రివార్డు
- సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి: పౌరహక్కుల నేతలు

కొత్తగూడెం క్రైం, అక్టోబర్ 5: ఛత్తీస్‌గఢ్ ఏజెన్సీలో శుక్రవారం జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో 31 మంది మావోయిస్టుల మృతదేహాలు లభ్యమైనట్టు బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ పాటిలింగం తెలిపారు. వీరిలో 13 మంది మహిళా మావోయిస్టులు ఉన్నారని చెప్పారు. ఎన్‌కౌంటర్‌కు సంబంధించిన వివరాలను శనివారం వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణ్‌పూర్ - దంతేవాడ జిల్లాల సరిహద్దుల్లో మావోయిస్టు అగ్రనేతలు సమావేశమయ్యారన్న సమాచారం పోలీసులకు అందింది. దీంతో డీఆర్‌జీ, సీఆర్‌పీఎఫ్ - కోబ్రా, ఎస్‌టీవో బలగాలు సంయుక్తంగా కూంబింగ్ నిర్వహిస్తుండగా నారాయణ్‌పూర్ జిల్లా ఓర్చా పోలీస్ స్టేషన్ పరిధిలోని నెందూర్ - తులతులీ గ్రామల మధ్య గల అటవీ ప్రాంతంలో మావోయిస్టులు తారసపడ్డారు. దీంతో రెండు గంటల పాటు ఎదురుకాల్పులు జరిగాయి. మృతులు పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ(పీఎల్‌జీఏ) 6వ కంపెనీ, తూర్పు బస్తర్ డివిజన్‌కి చెందిన వారిగా గుర్తించారు. మృతి చెందిన వారిలో రూ.25 లక్షల రివార్డున్న దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ సభ్యురాలు, తూర్పు బస్తర్ డివిజన్ ఇన్‌చార్జి నీతి అలియాస్ ఊర్మిలతో పాటు డివిజినల్ కమిటీ సభ్యులు సురేశ్ సలాం, మీనా మడకం ఉన్నారు. ఇప్పటివరకు గుర్తించిన మృతులపై రూ.1.30 కోట్ల రివార్డు ఉంది.



ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణ్‌పూర్ పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో ఉంచిన మావోయిస్టుల మృతదేహాలు


మృతుల ఫొటోలు బయటపెట్టాలని డిమాండ్

ఎన్‌కౌంటర్‌లో మరణించిన వారిలో మావోయిస్టు ముఖ్య నేతలు నంబాల కేశవరావు, తక్కెళ్లపాడు వాసుదేవరావు ఉన్నారనే సమాచారం అందుతున్నట్టు పౌరహక్కుల సంఘుల నేతలు తెలిపారు. పోలీసులు వెంటనే మరణించిన మావోయిస్టుల పేర్లు, ఫొటోలు విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.తెలంగాణ పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ జీ లక్ష్మణ్ హైదర్‌గూడలో మాట్లాడుతూ ఎన్‌కౌంటర్‌పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.



తమిళ దర్శకుడి కథకు గ్రీన్‌సిగ్నల్?



వంద సినిమాల మార్క్ అందుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టున్నారు రవితేజ. ప్రస్తుతం ఆయన 75వ సినిమా షూటింగ్ జరుగుతున్నది. సితార ఎంటర్టైన్మెంట్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రానికి భాను భోగవరపు దర్శకుడు. ఈ సినిమాకు 'దావత్' అనే టైటిల్‌ను అనుకుంటున్నారు. ఇదిలావుంటే.. ఈ సినిమా నిర్మాణంలో ఉండగానే మరో సినిమాకు రవితేజ గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశారట. తమిళ దర్శకుడు సి.సుందర్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తారని సమాచారం. ఖుష్బూ నిర్మాతగా వ్యవహరిస్తారట. సుందర్.సి గత కొన్నేళ్లుగా ఈ సినిమా కోసం ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారట. ఎట్టకేలకు రవితేజ నుంచి గ్రీన్‌సిగ్నల్ రావడంతో ఈ ప్రాజెక్ట్ పట్టాలెక్కడానికి రెడీ అయ్యిందని సమాచారం. ఇది రవితేజ 76వ చిత్రంగా రానున్నదని తెలుస్తున్నది. హారర్, థ్రిల్లర్ కామెడీ కథలను తెరకెక్కించి వైవిధ్యమైన దర్శకుడిగా సుందర్.సి పేరు తెచ్చుకున్నారు. మరి రవితేజతో ఆయన చేయబోయే సినిమా ఏ జానరో తెలియాలంటే ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే.

ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నా

కెరీర్ ఆరంభంలో ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నానని, అయినా పట్టుదలతో ఇండస్ట్రీలో నిలదొక్కుకున్నానని చెప్పింది త్రిప్తి డిమ్రి. 'యానిమల్' చిత్రం ద్వారా యూత్‌లో తిరుగులేని క్రేజ్‌ను సంపాదించుకున్న ఈ భామ ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉంది. ఇటీవలే 'బ్యాడ్ న్యూజ్' సినిమాతో ప్రేక్షకుల్ని పలకరించింది. ఈ సందర్భంగా ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తన కెరీర్ తొలినాటి రోజుల్ని గుర్తుచేసుకుంది. ' నాకు చదువుపై అంతగా ఆసక్తి ఉండేది కాదు. దాంతో మోడలింగ్ వైపు అడుగుపెట్టా. పేరెంట్స్ కూడా సినిమాల్లోకి వెళతానంటే అంగీకరించలేదు. ఇండస్ట్రీ కొచ్చిన తొలినాళ్లలో ఏ విషయం మీద అవగాహన ఉండేది కాదు. దాంతో నా సహచర నటీనటులతో సన్నివేశం గురించి చర్చిందేదాన్ని. ఒకానొక సమయంలో ఇండస్ట్రీకి వచ్చి సరైన నిర్ణయం తీసుకున్నానా? లేదా? అనే సందిగ్ధంలో పడ్డాను. 'లైలా మజ్ను' షూటింగ్ టైమ్‌లో సెట్స్‌లో ఏడ్చాను. వాళ్లు ఏం చెబుతున్నారో, ఆ భాష ఏమిటో అర్థమయ్యేది కాదు. దాంతో ఇంటికెళ్లి రాత్రిళ్లు డైలాగ్స్ ప్రాక్టీస్ చేశాను. ఎలాగో నా ప్రారంభ కష్టాల నుంచి గట్టెక్కి విజయాలను దక్కించుకున్నా' అని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఈ భామ మూడు సినిమాలతో బిజీగా ఉంది.

కర్ణుడిగా సూర్య?



తమిళస్టార్ హీరో సూర్య బాలీవుడ్‌లో అడుగుపెట్టనున్నారని, సీనియర్ బాలీవుడ్ డైరెక్టర్ రాకేష్ ఓంప్రకాష్ మెహ్రా దర్శకత్వంలో సూర్య నటించనున్నారనీ.. ఓ వార్త బీటౌన్‌లో బలంగా వినిపిస్తున్నది. ఈ విషయంపై దర్శకుడు రాకేష్ ఓం ప్రకాశ్ మెహ్రా ఐఫా వేదికగా క్లారిటీ ఇచ్చారు. ఈ వార్తలు నిజమేనని, ప్రస్తుతానికి ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించిన స్క్రిప్ట్ వర్క్ జరుగుతున్నదని, సమయం వచ్చినప్పుడు అధికారికంగా వెల్లడిస్తానని ఓం ప్రకాశ్ మెహ్రా తెలిపారు. అందుతున్న సమాచారం ప్రకారం.. మహాభారతం ఆధారంగా రాకేష్ ఈ కథ రాసుకున్నారట. ఈ సినిమాకు 'కర్ణ' అనే టైటిల్ కూడా ఆయన ఖరారు చేసినట్టు సమాచారం. 500కోట్ల భారీ బడ్జెట్‌తో తెరకెక్కనున్న ఈ సినిమాలో కర్ణుడిగా సూర్య నటించనున్నట్టు గత కొంతకాలంగా బాలీవుడ్‌లో వార్తలు వినిపిస్తున్నాయ్. రంగ్‌దే బసంతి, దిల్లీ 6, బాగ్ మిల్ఖా బాగ్, తుఫాన్ వంటి చిత్రాలతో గొప్ప దర్శకునిగా గుర్తింపు తెచ్చుకున్న ఓం ప్రకాశ్ మిశ్రా.. సూర్యతో సినిమా చేస్తున్నారన్న వార్త సూర్య అభిమానులకు ఆనందాన్ని అందిస్తుంటే.. ఆ సినిమాలో సూర్య కర్ణుడిగా నటిస్తున్నాడనే వార్త ఆ ఆనందాన్ని మిన్నంటేలా చేస్తున్నది.

ట్రెండ్‌కు తగినట్టుగా తీశా!

తెలుగు చిత్రసీమలో దర్శకుడు శ్రీనువైట్ల శైలి చాలా ప్రత్యేకం. యాక్షన్ కథాంశాలకు చక్కటి వినోదాన్ని జోడించి ఎన్నో బ్లాక్‌బస్టర్ హిట్స్‌ను అందించారు. ఆయన దర్శకత్వంలో గోపీచంద్ కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం 'విశ్వం' ఈ నెల 11న ప్రేక్షకుల ముందుకురానుంది. పీపుల్ మీడియా పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు. ఈ సందర్భంగా శనివారం దర్శకుడు శ్రీను వైట్ల పాత్రికేయులతో పంచుకున్న విశేషాలు...

- గోపీచంద్‌తో సినిమా చేయాలని ఎప్పట్నుంచో అనుకుంటున్నా. ఆయన్ని దృష్టిలో పెట్టుకొని కథ సిద్ధం చేశా. యాక్షన్, కామెడీ, ఎమోషన్ అంశాలు సమపాళ్లలో మేళవించిన కుటుంబ కథా చిత్రమిది. నా శైలి కామెడీతో ఆకట్టుకుంటుంది. ఈ కథలో పాప పాత్ర చాలా కీలకంగా ఉంటుంది.
- ఈ విశ్వంలో మనకు తెలియని ఎన్నో రహస్యాలుంటాయి. ఈ సినిమాలోని హీరో పాత్ర కూడా నిగూఢమైన రహస్యాలతో సాగుతుంది. అందుకే కథానుగుణంగా ఈ టైటిల్ పెట్టాం. దర్శకుడిగా నేను కాస్త గ్యాప్ తీసుకున్నా. అయినా నేటి ట్రెండ్‌ను గమనిస్తూ, సినిమాలు చూస్తూ అప్‌డేట్ అయ్యాను. ఇప్పటి అభిరుచులకు అనుగుణంగా నా శైలి వినోదాన్ని అందించే ప్రయత్నం చేశా.
- సొసైటీలోని ఓ బర్నింగ్ ఇష్యూని తీసుకొని ఈ కథను సిద్ధం చేశా. నా గత చిత్రాల్లో హీరో తన తెలివితేటలతో ఏదైనా సాధించేవాడుగా కనిపిస్తాడు. ఆ టెంప్లెట్‌కు భిన్నంగా ఈ కథ ఉంటుంది. మేకింగ్ కూడా చాలా వినూత్నంగా ఉంటుంది. గోపీచంద్ పాత్ర భిన్న పార్శ్వాల్లో సాగుతుంది.
- ఈ సినిమాలో ట్రెయిన్ ఎపిసోడ్ హైలైట్‌గా నిలుస్తుంది. చాలా మంది 'వెంకీ' సినిమా తరహాలో ఈ ఎపిసోడ్ క్రియేట్ చేశారా అని అడుగుతున్నారు. రెండు సినిమాలకు ఏమాత్రం సంబంధం ఉండదు. కథ డిమాండ్ మేరకే ట్రెయిన్ ఎపిసోడ్ పెట్టాల్సి వచ్చింది. ఈ సినిమాలోని ట్రెయిన్ ఎపిసోడ్‌లో వెన్నెల కిషోర్, గణేష్, నరేష్, కవిత, చమ్మక్ చంద్ర, షకలక శంకర్ కడుపుబ్బా నవ్విస్తారు.
- నేటి ప్రేక్షకులు కామెడీని ఆస్వాదించే విధానం మారిపోయింది. వినోదం కోసం వారికి ఎన్నో వేదికలు అందుబాటులోకి వచ్చాయి. అందుకే కథలో కామెడీ ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నాం. నిజానికి అది చాలా కష్టమైన విషయం.
- ఈ సినిమాను తెలుగు ఆడియెన్స్ కోసం మాత్రమే తీశాను. ఒకవేళ పాన్ ఇండియాకు రీచ్ అయితే సంతోషమే. 'ఢీ' సీక్వెల్ గురించి ఇంకా నిర్ణయం తీసుకోలేదు. శ్రీహరిగారి పాత్రను రీప్లేస్ చేయడం చాలా కష్టమని నా అభిప్రాయం.



సామాన్యుడి ప్రయాణం



వరుణ్‌తేజ్ హీరోగా రూపొందుతోన్న చిత్రం 'మట్కా'. కరుణకుమార్ దర్శకుడు. డాక్టర్ విజయేందర్‌రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి నిర్మాతలు. నవంబర్ 14న సినిమా విడుదల కానుంది. శనివారం విజయవాడలో ఈ సినిమా టీజర్‌ని విడుదల చేశారు. మట్కా కింగ్‌గా ఎదిగిన ఒక సాధారణ వ్యక్తి ప్రయాణమే ఇతివృత్తంగా ఈ సినిమా రూపొందిందని, వరుణ్‌ని ఇప్పటివరకూ చూడని కొత్తకోణంలో చూస్తారని దర్శకుడు కరుణకుమార్ చెప్పారు. ''గద్దలకొండ గణేష్' తర్వాత అలాంటి సినిమాలు చేయాలని చాలామంది అడిగారు. నానుంచి అలాంటి సినిమాలు ఆశించేవారికోసమే ఈ 'మట్కా'. 1960 ప్రాంతంలో వైజాగ్‌లో జరిగే కథ ఇది. టీజర్‌లో కొన్ని చూశారు. ట్రైలర్‌లో ఇంకొన్ని చూస్తారు. నా కెరీర్‌లో గర్వంగా చెప్పుకోదగ్గ సినిమా 'మట్కా' అవుతుంది' అని వరుణ్‌తేజ్ నమ్మకం వెలిబుచ్చారు. ఇంతకు ముందు ఓ లెక్క, ఈ సినిమా తర్వాత వరుణ్ కటౌట్ మరో లెక్క అన్న చందంగా సినిమా ఉంటుందని నిర్మాతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కెమెరామేన్ కిశోర్ కుమార్ కూడా మాట్లాడారు.

యాక్షన్ ఎంటర్‌టైనర్ 'హరుడు'



వెంకట్ హీరోగా నటిస్తున్న చిత్రం 'హరుడు'. రాజ్ తాళ్లూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ఈట ప్రవీణ్ రెడ్డి నిర్మిస్తున్నారు. శనివారం ఈ సినిమా గ్లింప్స్‌ను విడుదల చేశారు. దర్శకుడు మాట్లాడుతూ 'యాక్షన్ ప్రధానంగా సాగే మాస్ కథాంశమిది. వెంకట్ పాత్ర శక్తివంతంగా ఉంటుంది. వినూత్నమైన కాన్సెప్ట్‌తో ప్రతి ఒక్కరిని ఆకట్టుకుంటుంది' అన్నారు. తాను తొలిసారి మాస్ పాత్రను చేశానని, యాక్షన్ ఘట్టాల కోసం ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకున్నానని హీరో వెంకట్ తెలిపారు. ఇప్పటికే అరవైశాతం చిత్రీకరణ పూర్తయిందని, వచ్చే నెలలో రిలీజ్‌కు ప్లాన్ చేస్తున్నామని నిర్మాత ఈట ప్రవీణ్ రెడ్డి పేర్కొన్నారు. హెబ్బాపటేల్, సలోని, శ్రీహరి తదితరులు చిత్ర తారాగణం.

రాజేంద్రప్రసాద్ కుమార్తె కన్నుమూత



ప్రముఖ నటుడు రాజేంద్రప్రసాద్ ఇంట్లో తీవ్ర విషాదం నెలకొన్నది. ఆయన కుమార్తె గాయత్రి(38) గుండెపోటుతో కన్నుమూశారు. శనివారం ఛాతిలో నొప్పి రావడంతో ఆమెను హైదరాబాద్ ఏఐజీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గాయత్రి తుదిశ్వాస విడిచారు. రాజేంద్రప్రసాద్‌కు కుమార్తె గాయత్రితోపాటు కుమారుడు కూడా ఉన్నారు. గాయత్రిది ప్రేమ వివాహం. ఆమెకు ఓ కూతురు కూడా ఉన్నారు. చిన్నప్పట్నుంచీ గాయత్రిని రాజేంద్రప్రసాద్ ఎంతో గారాబంగా పెంచారని తెలుస్తున్నది. ప్రాణాధికంగా పెంచుకున్న కన్నబిడ్డ మరణంతో రాజేంద్రప్రసాద్ తీవ్ర నైరాశ్యానికి లోనయ్యారు. ఆయన కుటుంబం కన్నీరుమున్నీరవుతున్నది. ఈ నేపథ్యంలో పలువురు సినీరాజకీయ ప్రముఖులు రాజేంద్రప్రసాద్ కుటుంబాన్ని పరామర్శిస్తున్నారు.

కేటీఆర్ సంతాపం: 'సీనియర్ నటులు రాజేంద్రప్రసాద్‌గారి కుమార్తె మరణం నన్ను తీవ్రంగా బాధించింది. చిన్నవయసులోనే ఆమె కన్నుమూయడం ఎంతో బాధాకరం. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. ఈ కష్టాన్ని ఎదుర్కొనేంత ధైర్యాన్ని వారి కుటుంబానికి ప్రసాదించాలని ఆ దైవాన్ని వేడుకుంటున్నా. రాజేంద్రప్రసాద్‌గారు మనోనిబ్బరాన్ని కోల్పోవద్దని కోరుకుంటున్నా' అని బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ (ట్విటర్) ద్వారా స్పందించారు. ఇంకా చిరంజీవి, ఎన్టీఆర్, అల్లు అర్జున్, సాయిదుర్గతేజ్, వరుణ్ తేజ్, నవదీప్, కీర్తి సురేశ్, నరేశ్ కూడా రాజేంద్రప్రసాద్ కుటుంబానికి పరామర్శించిన వారిలో ఉన్నారు.



మనసును కదిలించే కథ

సుధీర్‌బాబు కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'మా నాన్న సూపర్‌హీరో'. అభిలాష్ రెడ్డి కంకర దర్శకత్వంలో సునీల్ బలుసు నిర్మించారు. ఈ నెల 11న విడుదలకానుంది. శనివారం థియేట్రికల్ ట్రైలర్‌ను అగ్ర హీరో మహేష్‌బాబు విడుదల చేశారు. తండ్రీకొడుకుల మధ్య అనుబంధాన్ని ఆవిష్కరిస్తూ ట్రైలర్ ఆద్యంతం హృద్యంగా సాగింది. చిన్నప్పుడే తనను వదిలేసిన తండ్రి మరలా జీవితంలోకి ప్రవేశిస్తే ఆ వ్యక్తి జీవితం ఎలాంటి మలుపులు తిరిగింది? ఈ క్రమంలో వారి మధ్య జరిగే సంఘర్షణ ఏమిటనే అంశాలతో ట్రైలర్ ఆకట్టుకుంది. సుధీర్‌బాబు, సాయిచంద్, షాయాజీషిండే పాత్రలు హైలైట్‌గా నిలిచాయి. తండ్రీకొడుకుల ప్రేమానుబంధానికి దృశ్యరూపంగా ఈ సినిమా మనసుల్ని కదిలిస్తుందని దర్శకుడు తెలిపారు. ఆర్నా, రాజు సుందరం, శశాంక్, ఆమని తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జై క్రిష్, దర్శకుడు: అభిలాష్ రెడ్డి కంకర.



దేవుడు రాసిన స్క్రిప్ట్

శ్రద్ధాదాస్, అజయ్, మాస్టర్ మహేంద్రన్ ప్రధాన పాత్రధారులుగా నటిస్తున్న చిత్రం 'త్రికాల'. 'స్క్రిప్ట్ ఆఫ్ గాడ్' ఉపశీర్షిక. మణి తెల్లగూటి దర్శకుడు. రాధికా శ్రీనివాస్ నిర్మాత. చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ సినిమా టైటిల్ పోస్టర్‌ను అగ్ర నిర్మాత దిల్‌రాజు ఆవిష్కరించారు. దర్శకుడు మాట్లాడుతూ 'హారర్ కథాంశమిది. కుమారి ఖండం అనే పురాణంలోని మూలకథను తీసుకొని ఆధునిక హంగులు మేళవించి ఈ సినిమాను తెరకెక్కించాం. శ్రద్ధాదాస్ పాత్ర ప్రధానాకర్షణగా నిలుస్తుంది. అబ్బురపరిచే గ్రాఫిక్స్‌తో సరికొత్త సినిమాటిక్ అనుభూతినందిస్తుంది' అన్నారు. తనికెళ్ల భరణి, ఆమని, అర్జున్ అంబటి, ఐశ్వర్య తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: హర్షవర్ధన్ రామేశ్వర్, దర్శకత్వం: మణి తెల్లగూటి.



కాలంతో చేసే ప్రయాణం

సాయిరోనక్, అమృత చౌదరి జంటగా నటిస్తున్న చిత్రం 'రివైండ్'. స్వీయ దర్శకనిర్మాణంలో కల్యాణ్ చక్రవర్తి రూపొందిస్తున్నారు. ఈ నెల 18న ప్రేక్షకుల ముందుకురానుంది. శనివారం ఈ చిత్ర ట్రైలర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దర్శకనిర్మాత మాట్లాడుతూ 'టైం ట్రావెల్ మీద తీసిన లవ్‌స్టోరీ ఇది. సైంటిఫిక్ ఫిక్షన్ జోనర్‌లో ఆకట్టుకుంటుంది. స్క్రీన్‌ప్లే చాలా కొత్తగా ఉంటుంది. విభిన్న ఇతివృత్తంతో ప్రేక్షకులకు కొత్త అనుభూతినందిస్తుంది' అన్నారు. మంచి కంటెంట్‌తో వస్తున్న ఈ సినిమా తప్పకుండా కొత్త ఫీల్‌నిస్తుందని హీరో సాయిరోనక్ చెప్పారు. సురేష్, జబర్దస్త్ నాగి, కేపీ పాల్‌రామ్, అభిషేక్, ఫన్ బకెట్ రాజేష్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: శివరామ్ చరణ్, సంగీతం: ఆశీర్వాద్, నిర్మాణం: క్రాస్ వైర్ క్రియేషన్స్, నిర్మాత, దర్శకత్వం: కల్యాణ్ చక్రవర్తి.